
# నైట్ వాకర్

## మధుబాబు



# నైట్ వాకర్

ఎడమ చేతికి వున్న రిస్ట్‌వాచ్ రాత్రి ఎనిమిది గంటలు అయినట్లు సూచించటంతో, చాయ్ గ్లాసును క్రింద పెట్టి మెల్లిగా లేచి నిలబడ్డాడు షాడో.

"ఎవరో స్నేహితుడి కోసం వెయిట్ చేస్తున్నానన్నారు గద సాబ్.... వెళ్ళిపోతున్నారా?" వెంటనే ప్రశ్నించాడు హోటల్ యజమాని.

గ్లాసు మీద గ్లాసుగా సాయంత్రం నాలుగు గంటల నుంచీ చాయ్ తాగుతూ కాలక్షేపం చేస్తున్నాడు షాడో. స్నేహితుడి కోసం ఎదురుచూస్తున్నట్లు రోడ్డు వైపు తల తిప్పి కూర్చున్నాడు గాని, అతని చూపులు మాత్రం రోడ్డుకు అవతలి ప్రక్కన వున్న డిఫెన్స్ రీసెర్చి లేబరేటరీ మీద వున్నాయి.

వెలుగు వున్నంత వరకూ ఎవరో ఒకరు వచ్చి పోతూ వున్నారు ఆ బిల్డింగ్ కాంప్లెక్స్‌లోకి.... చీకటి పడిన తరువాత కొద్దిగా తగ్గింది రద్దీ.... ఏడు గంటలు దాటిన తర్వాత అది పూర్తిగా ఆగిపోయింది.

"స్నేహితులు ఎప్పుడూ చేసే పనే ఇది భాయీసాబ్. అవసరం కోసం రెండు వందలు అప్పు అడిగాను.... వెయిట్ చేస్తూ వుండు తీసుకొచ్చి యిస్తానన్నాడు... చీకటి పడకముందే రావాల్సిన మనిషి ఇంతవరకూ రాలేదంటే అర్థం ఏమై వుంటుందో ఆలోచించు...." తాగిన టీలకు డబ్బు చెల్లిస్తూ అన్నాడు షాడో.

ఆ మాటలకు తల వూపటం అయితే వూపాడు గాని, ముష్టి రెండు వందల రూపాయల కోసం అంతసేపు వెయిట్ చేసే మనిషిలా కనిపించటం లేదు షాడో అతని కళ్ళకు.

ఆ విషయాన్ని బయట పెట్టలేదతను.

"రాత్రి పన్నెండు గంటలదాకా తెరిచే వుంటుంది నా హోటల్.... మీ కోసం ఎవరైనా వస్తే కూర్చోబెట్టి వుంచుతాను... ఒక గంట ఆగి రండి..."ఏదో తెలియని అభిమానంతో కౌంటర్ వెనుక నుంచి లేచి గుమ్మం దాకా సాగనంపుతూ అన్నాడు.

పాంటు జేబులో నుంచి పనామాను తీసి వెలిగించుకుంటూ రోడ్డు మీదికి వచ్చాడు షాడో.... అటూ ఇటూ చూసి ఎడమచేతి వైపుకు మెల్లిగా నడక మొదలు పెట్టాడు.

పాతిక ఎకరాల చదరపు స్థలంలో కట్టబడి వుంది రీసెర్చి కాంప్లెక్స్.... చుట్టూ ఆరు అడుగుల ఎత్తున వైర్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.... ప్రతి పావుగంటకూ మెయిన్ గేట్ దగ్గర్నుంచి బయలుదేరుతున్నారు నలుగురు సెంట్రీలు. వైర్ ఫెన్సింగ్ వెంబడే తాపీగా అడుగులు వేస్తూ కాంప్లెక్స్ ఏరియానంతా రౌండ్స్ కొట్టి తిరిగి వస్తున్నారు.

"రోడ్డు మీది జనమంతా ఇళ్ళకు వెళ్ళిపోయారు... పాంటుజేబుల్లో చేతులు పెట్టుకొని జెండా స్తంభంగా కనిపిస్తోంది మీరొక్కరే...." ఉన్నట్టుండి ఒక చీకటి మలుపులో నుంచి ఆ మాటలు వినవచ్చేసరికి ఉలిక్కిపడి, చిన్నగా నవ్వేశాడు షాడో.

తననెవరూ పర్టిక్యులర్‌గా గమనించటం లేదని నిశ్చయం కాగానే నాలుగు అంగల్లో ఆ మలుపులోకి పోయి, ఒక గోడను ఆనుకొని నిలబడ్డాడు.

తన పోలీస్ యూనిఫాం ని తీసేసి, సివిల్ డ్రస్‌తో వచ్చి, అక్కడ అతని కోసం వెయిట్ చేస్తున్నాడు ఇన్స్‌పెక్టర్ సాహూల్.

షాడో తనను సమీపించగానే అప్రయత్నంగా శెల్యూట్ చేయబోయి, అతి ప్రయత్నం మీద నిగ్రహించుకున్నాడు.

"ఏమయింది సాహూల్? నేను అడిగినవి తీసుకొచ్చావా?" పనామాను క్రిందపడేసి బూటు కాలితో నలుపుతూ ప్రశ్నించాడు షాడో.

అక్కడికి పాతిక అడుగుల దూరంలో వున్న ఒక పీపల్ వృక్షం క్రింద స్టాండ్ వేసి వుంచాడు సాహూల్ తన మోటార్ బైక్‌ని. గబగబా దాని దగ్గిరికి పోయి ఒక పెద్ద కాన్వాస్ సంచిని తీసుకొచ్చి అతనికి యిచ్చాడు.

తను ధరించి వున్న దుస్తుల్ని వదిలేశాడు షాడో. ఆ సంచిలోని బట్టల్ని వేసుకొని పాంటు బెల్టును సవరించుకున్నాడు.

"అడిషనల్ యస్.పి. ధరించే దుస్తులు యివి.... ఆ కేడర్ సరిపోతుందా మీరు చేయబోయే పనికి??" అతని భుజాల మీది స్టార్స్‌ని కరెక్ట్ చేస్తూ అడిగాడు సాహూల్.

వదిలేసిన దుస్తుల్లో నుంచి సిగరెట్ పాకెట్‌ని తీసి, ఇంకో సిగరెట్ వెలిగించుకుంటూ తల వూపాడు షాడో.

మరోసారి మోటార్ బైక్ దగ్గిరికి పోయి ఈసారి కొన్ని కాగితాల్ని తీసుకువచ్చాడు సాహూల్.

"మా డి.ఐ.జి. గారి సంతకాన్ని ఇమిటేట్ చేయటం చాలా కష్టం అయింది. ఎందుకైనా మంచిదని కొంచెం జాగ్రత్తగా వుండండి...." అని జాగ్రత్త చెపుతూ వాటిని షాడో షర్టు పాకెట్‌లో పెట్టాడు.

అంతకు పది నిమిషాల ముందు వరకూ రెండొందల రూపాయల అప్పుకోసం వెయిట్ చేస్తున్న సగటు మనిషి వేషంలో నుంచి క్షణంలో ఎ.యస్.పి. రాంక్‌కి చేరుకున్నాడు షాడో.

సిగరెట్‌ని పెదవుల చివర్ల బంధించి పాంటు జేబుల్లో చేతులు పెట్టుకుంటూ డిఫెన్స్ లేబరేటరీ మెయిన్ గేటు దగ్గిరికి పోయాడు.

"హాల్ట్ దేర్... హాల్ట్..." ఖంగుమంటున్న కంఠంతో హెచ్చరిస్తూ ఒక్క గంతులో అతని ముందుకు వచ్చాడు గేటు బయట సెంట్రీ బాక్స్‌లో నిలబడి వున్న సెక్యూరిటీ గార్డు ఒకతను.

పెదవుల మధ్య వున్న సిగరెట్‌ని తీయకుండానే ఠీవిగా నిలబడి కనుబొమ్మలు ఎగురవేశాడు షాడో.

అతని భుజాల మీది స్టార్స్‌ని చూడగానే తనకు తెలియకుండానే అటెంషన్‌లోకి వచ్చాడు సెక్యూరిటీ గార్డు.

"రీసెర్చి కాంప్లెక్స్‌లో వున్న నెంబర్ త్రీ బ్లాకును ఒకసారి చెక్ చేయమని ఆర్డర్స్... గేటును ఓపెన్ చేయించు...." కంఠం నిండా పోలీసు హుందాతనాన్ని నింపుకుంటూ అన్నాడు షాడో. అంటూనే సాహూల్ యిచ్చిన కాగితాల్ని ఎడమ చేత్తో బయటికి తీసి అతని ముందు వూపాడు.

అతని రాంక్‌ని గ్రహించి వినయంగా నిలబడినా, అతని మాటల్ని వెంటనే ఆచరణలో పెట్టలేదా గార్డు. ఆ కాగితాల్ని సెంట్రీబాక్స్ దగ్గిరికి తీసుకుపోయి, అక్కడి లైటు వెలుగులో జాగ్రత్తగా పరిశీలించాడు.

"క్షమించాలి సార్... నెంబర్ త్రీ బ్లాకు వ్యవహారం ఇక్కడి పోలీసు అధికారుల చేతుల్లో నుంచి స్పెషల్ బ్రాంచి వారి చేతుల్లోకి వెళ్ళిపోయింది. తాను పర్సనల్‌గా చెపితే తప్ప ఎవరినీ అటుకేసి పోనీయ వద్దని ఆర్డర్స్ పాస్ చేశారు స్పెషల్ బ్రాంచి డైరెక్టర్..." కాగితాల్ని మడిచి షాడో చేతికి యిస్తూ అన్నాడతను.

"నాన్సెన్స్... నేను ఎవరినని అనుకుంటున్నావ్? ఈ కలకత్తా నగరంలో పనిచేసే ఆర్డినరీ ఆఫీసర్‌ని అనుకుంటున్నావా? ఇక్కడి వ్యవహారం ఏమిటో తెలుసుకోవటానికి ప్రత్యేకంగా నియమించబడ్డ ఎడిషనల్ స్పెషల్ ఆఫీసర్ని... ఈ కాయితాల్ని సరిగ్గా చూశావా?" కనుబొమల్ని ముడివేసి చూస్తూ గయ్‌మని లేచాడు షాడో.

అదిరిపడి రెండు అడుగులు వెనక్కి వేశాడు ఆ గార్డు.

"అయామ్ సారీ సర్... హడావుడిగా చూడటం వల్ల మేటర్ని సరిగా అర్థం చేసుకోలేక పోయాను... క్షమించాలి..." అంటూ గేట్ల దగ్గిరికి పోయి ఒక ప్రక్కగా అమర్చి వున్న చిన్న ద్వారాన్ని ఓపెన్ చేశాడు.

"మీ స్పెషల్ బ్రాంచి డైరక్టర్‌ని వెంట బెట్టుకొని డి.ఐ.జి. గారు వస్తానని అన్నారు ఇంకో అరగంటలో... రాగానే త్రీ బ్లాకు దగ్గిరికి పంపించు..." అతన్ని హెచ్చరిస్తూ ఆ ద్వారంలో నుంచి లోపలికి పోయి తేలికగా నిట్టూర్చాడు షాడో.

తను వూహించినట్లే ఎయిర్ టైట్ ఏర్పాట్లు చేశారు స్పెషల్ బ్రాంచి వాళ్ళు.... అదృష్టం బాగుండబట్టి తన కేకలకు బెదిరిపోయి దారిని వదిలాడు ఆ గార్డు... అక్కడికి రెండు వందల గజాల దూరంలో వుంది మరొక చెక్‌పోస్ట్... అక్కడి పరిస్థితి ఎలా వుంటుందో??

ఊహించని విధంగా అతన్ని వదిలి దూరంగా వెళ్ళి పోయిందతని అదృష్టదేవత రెండో చెక్‌పోస్ట్ దగ్గిర.

"క్షమించాలి సర్... ఇక్కడి వ్యవహారంలో డి.ఐ.జి. గారికి సంబంధం లేదని మాతో అన్నారు స్పెషల్ బ్రాంచి డిటెక్టివ్స్... మాటల ప్రకారం చూస్తే ఈ కాగితాలకు

విలువ లేదు గదా!" గుర్రుగా చూస్తున్న షాడో చూపులకు బెదిరిపోకుండా అన్నాడతను.

"సంబంధంలేని మనిషి కాగితాల మీద సంతకం ఎందుకు పెట్టాడో కనుక్కో మిస్టర్... ఫోన్ చేసి కన్‌ఫర్మ్ చేసుకో..." తన భయాలను తనలోనే దాచుకుంటూ కమాండ్ చేశాడు షాడో.

రెండు క్షణాలు తటపటాయించి కాగితాలతో సహా చిన్న చెక్కల కట్టడంలోకి పోయాడా గార్డు. అక్కడ వున్న టేబిల్ మీది టెలీఫోన్ అందుకున్నాడు.

రిసీవర్‌ని ఎత్తి డి.ఐ.జి.కి రింగ్ చేస్తే తన బండారంఅక్కడికక్కడే బయట పడిపోతుందని షాడోకి తెలుసు... బయట పడిపోవటమే కాదు, ఫోర్జరీ కాగితాలతో పగటి వేషం వేసినందుకు అరెస్ట్ అయి, కటకటాల వెనక్కి కూడా పోవాల్సిన ఖర్మ పడుతుంది.

చివరికంటా కాలిన సిగరెట్‌ని అవతలికి విసిరేస్తూ రెండు అంగల్లో కట్టడంలోకి వెళ్లాడతను....

అప్పుడే డి.ఐ.జి. ఆఫీసు నెంబర్‌లో ఆఖరి డిజిట్‌ని డయల్ చేయబోతున్నాడు ఆ గార్డు. సడన్‌గా లోపలికి వచ్చిన షాడోని గమనించి వెనక్కి తిరగబోయాడు.

కంటికి కనిపించనంత వేగంగా కదిలాయి షాడో చేతులు... ఎడమ చేయి టెలీఫోన్ రిసీవర్‌ని పట్టుకుంది... కుడిచేయి అతని మెడను చుట్టుకుంది...

"మోసం... మోసం... దగా...." అని అరుస్తూ రిసీవర్‌ని వదిలి, పాంటు బెల్టుకు వ్రేలాడుతున్న రివాల్వర్ మీద చేయి వేయబోయాడతను.

మెడను చుట్టిన షాడో కుడిచేయి కంఠ నాళాన్ని అదిమి, అరుపును బయటికి రాకుండా అడ్డుకుంది. గార్డు వదిలేసిన రిసీవర్‌ని క్షేమంగా ఫోన్ మీద పెట్టి అతని మాడు అదిరిపోయేటట్లు బలంగా గుద్దింది ఎడమ చేయి.

అరటన్ను బరువుండే కాంక్రీట్ దిమ్మ ఏదో తలమీద పడినట్లు అస్పష్టమైన శబ్దాలు చేస్తూ తోటకూర కాడలా షాడో మీదికి వరిగిపోయాడతను.

అక్కడ వున్న కుర్చీలోకి నెట్టి నాడి చూశాడు షాడో.

ప్రాణాలకు వచ్చిన ప్రమాదం ఏదీ లేదు... మరో గంటదాకా స్పృహ మాత్రం రాదు...

స్పృహ వచ్చిన మరుక్షణం అరిచి అల్లరి చేసి అందర్నీ పిలుస్తాడతను... తన కోసం గాలింపు మొదలు పెడతాడు.... ఈలోపలే పూర్తి అయిపోవాలి తన పని...

కట్టడంలో నుంచి బయటికి వచ్చి, అక్కడికి మరో వంద గజాల దూరంలో వున్న నెంబర్ త్రీ బ్లాకు వైపు అడుగులు వేస్తూటైమ్‌ని చూసుకున్నాడు షాడో.

ఎనిమిది గంటల నలభై నిముషాల్ని సూచిస్తోంది అది...

రాత్రి పదిగంటల దాకా పనిచేస్తారు ఒక బేచ్ సైంటిస్టులు... ఆ తరువాత డ్యూటీ ఎక్కుతారు ఇంకో జట్టు...

వాటంతట అవే కదులుతున్నాయి షాడో పాదాలు... మనస్సు మాత్రం అప్రయత్నంగా ఆలోచనలలోకి మరలి, రెండు రోజుల క్రితం జరిగిన సంఘటనల్ని నెమరువేసుకోవటం మొదలుపెట్టింది...

సినిమా రీళ్ళ మాదిరి గిర్రున తిరగసాగాయి ఆ సంఘటనలు అతని కనుల ముందు.

* * * * *

యాక్సిలేటర్ మీద అదిమి వుంచిన పాదాల్ని తొలగించి బ్రేకుల మీద వేశాడు షాడో.

కీచుధ్వనులు చేస్తూ ఎగిరెగిరి దూకింది జాగ్వార్. తల్లక్రిందులైనంత పనిచేస్తూ ఆగిపోయింది సి.ఐ.బి. హెడ్ క్వార్టర్స్ ముందు.

డోర్ తీసుకుని క్రిందికి దూకాడు షాడో. పరుగులాంటి నడకతో ముఖద్వారాన్ని సమీపించాడు.

'భారత్ ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్' అనే సంస్థకు సంబంధించిన పెద్ద నేమ్ బోర్డొకటి వ్రేలాడుతోంది ద్వారం పై భాగంలో.

దేశంలో అతి ముఖ్యమైన, అత్యంత సమర్థవంతమైన సీక్రెట్ ఏజెన్సీ ఆ బోర్డు వెనుక రహస్యంగా పనిచేస్తూ వుంటుందని చాలామందికి తెలియదు...

ముఖద్వారాన్ని దాటగానే కనిపించే పెద్ద హాలువంటి విశాలమైన గదిలో జరిగే తతంగాన్ని గమనిస్తే సి.ఐ.బి. పేరు తెలిసినవాళ్ళు కూడా అది అక్కడ హెడ్ క్వార్టర్స్‌ని కలిగివుంటుందని కూడా అనుకోరు.

పెద్ద టేబిల్స్ నిండా లావుపాటి ఫైల్స్ పెట్టుకొని నిజంగానే ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్ బిజినెస్ చేస్తూ వుంటారు సి.ఐ.బి. ఇన్ఫర్మేషన్ డిపార్ట్‌మెంట్‌కి సంబంధించిన స్టాఫ్.

సడన్‌గా ముఖద్వారంలో ప్రత్యక్షం అయిన షాడోని చూడగానే వినయంగా లేచి నిలబడ్డాడు ఒక బట్టతల వ్యక్తి.

"బాస్ మీ కోసం అరగంట సేపటినుండీ వెయిట్ చేస్తున్నారు... ఇప్పటికి అరడజను సార్లయినా క్రిందికి కబురు చేసి వుంటారు..." అన్నాడు లోగొంతుకతో.

ఆకుపచ్చ రంగు శారీ కట్టుకొని, తలలో సన్నని సన్నజాజుల దండను తురుముకొని వంచిన తల ఎత్తకుండా పని చేస్తోంది అతని అసిస్టెంట్ ఒకామె...

షాడో చూపులు ఆమె మీదికి మరలటాన్ని గమనించి కనపడీ కనపడనట్లు చిన్న చిరునవ్వును వెలయించాడతను.

"క్రొత్తగా అపాయింట్ చేయబడింది... షీ యీజ్ వెరీ ఎఫిషియంట్ ఇన్ కీపింగ్ ఎవ్రీథింగ్ ఇన్ హర్ బ్యూటీఫుల్ హెడ్... రెండు నెలల క్రితం బొంబేలో జరిగిన ఇంటర్నేషనల్ మెమరీ కాంపిటీషన్‌లో పాల్గొని ఫస్ట్ ప్రయిజ్ సంపాదించ లేకపోయినా, అందరి మెప్పును పొందింది..." గొంతును ఎంతమాత్రము పెంచకుండా ఇన్‌ఫామ్ చేశాడు.

ఆ మాటలకు ఏమంత ఆశ్చర్యపడలేదు షాడో.

సి.ఐ.బి. పద్ధతులన్నీ అలాగే వుంటాయి.... ప్రతిభ ఎక్కడ వున్నా వెంటనే గుర్తించి సరయిన అవకాశాల్ని కల్పిస్తుంది.

పాంటు జేబులో నుంచి పనామా పాకెట్‌ని తీసి సిగరెట్ వెలిగించుకుంటూ ముందుకు అడుగు వేశాడు షాడో.

రెండు అడుగుల తర్వాత అతనికి తెలియకుండానే ఆగిపోయాయి పాదాలు.

"ఏమిటి సార్! ఎనీ డౌట్స్??" వెంటనే అతన్ని సమీపిస్తూ అడిగాడు బట్టతల వ్యక్తి.

మరోసారి ఆ యువతి వైపు మరలాయి షాడో చూపులు.

"మన రెగ్యులేషన్స్ అన్నీ అబ్జర్వ్ చేయటం జరిగింది... షీ యీజ్ పర్ఫెక్ట్లీ ఆల్ రైట్..." అతని అనుమానాల్ని గ్రహించి వెంటనే సమాధానం యిచ్చాడతను.

అయినా సరే, ఎందుకనో తృప్తి చెందలేదు షాడో అంతరంగం.

"ఆమె మీద మీరు తయారు చేసిన ఫైల్ని తెప్పించండి... ఐ వాంట్ టూ సీ హర్ బయోడేటా...." అంటూ దగ్గర్లో వున్న ఒక కుర్చీ వైపు కదిలాడు.

కదులుతూ వుండగానే జలదరించింది అతని శరీరం.

అనుక్షణం ప్రమాదాల్లో సంచరిస్తూ దిన దినగండంగా బ్రతకటం వల్ల కంటికి కనిపించని ప్రమాదాల్ని సైతం పసిగట్టగల అతని సిక్స్త్ సెన్స్ వార్నింగ్స్ యివ్వటం ప్రారంభించింది.

ఆ హెచ్చరికల్ని పెడ చెవిన పెట్టటం షాడోకి అలవాటు లేదు.

"గెట్ డౌన్.... గెట్ డౌన్ ఎవ్రీబడీ... గెట్ డౌన్...." ఖంగుమంటున్న కంఠంతో కమాండ్ చేస్తూ నిలుచున్న వాడు నిలుచున్నట్లు నేలమీద పడిపోయాడు.

అతని మాదిరిగా ప్రమాదాల్ని ముందుగా పసికట్టే శక్తి లేకపోయినా, అటువంటి ఆర్డర్స్ వినబడినప్పుడు ఏం చేయాలో బాగా తెలుసు అక్కడి వారందరికీ.

చేస్తున్న పనులనన్నింటినీ ఎక్కడివక్కడ వదిలేశారు.... చేతిలోని ఫైల్స్ని అవతలికి విసిరికొట్టారు.... వాటితో పాటు తాము కూడా కుర్చీల్లోనుంచి జారి నేలను కౌగలించుకున్నారు.

అదే సమయంలో చివాలున కుర్చీలో నుంచి లేచింది ఆకుపచ్చ చీరెను కట్టుకున్న ఆ యువతి. లేస్తుండగానే పమిటె చాటు నుంచి బయటికి లాగింది నల్లగా నిగనిగ మెరుస్తున్న రివాల్వర్‌ని.

పడిన చోటి నుంచి దొర్లుకుంటూ రెండు అడుగులు అవతలికి వెళ్ళిపోయాడు షాడో...

గుండెలు జలదరించేటట్లు గర్జించింది ఆ యువతి చేతిలోని రివాల్వర్... అంతవరకూ అతను వున్న ప్రదేశంలో పడి, కందిరీగల్లా రొద చేస్తూ గాలిలోకి ఎగిరింది బుల్లెట్...

ఆమె తన ఎయిమ్‌ని సరిచేసుకోకముందే కంటికి కనిపించనంత వేగంతో కదిలింది షాడో చేయి. కుడికాలి బూటు ప్రక్కన బిగించి వున్న డాగర్‌ని బయటికి లాగి బలంగా విసిరింది.

షాడో వూహించిన దానికంటె వేగంగా వున్నాయి ఆమె కదలికలు. ఎయిమ్‌ని వెంటనే కరెక్ట్ చేసుకున్న దామె... ట్రిగ్గర్‌ని ప్రెస్ చేస్తుండగానే గింగిరాలు తిరుగుతూ వచ్చి గుండెల్లో దిగబడింది డాగర్.

షాడో శిరస్సును ఛిన్నాభిన్నం చేయవలసిన బుల్లెట్, అతని తల దగ్గిర వున్న టేబిల్ లెగ్‌లో దిగబడింది....

ఒక్క గంతులో లేచి నిలబడి రెండు అంగల్లో ఆమెను సమీపించాడు షాడో. సమీపిస్తూనే కుడికాలిని విసిరి, ఆమె చేతిలో బిగుసుకొని వున్న రివాల్వర్‌ని ఎగరగొట్టాడు....

అతని కనుల ముందే టేబిల్ మీదికి వరిగి పోయిందామె.... చెల్లాచెదురవుతున్న ఫైల్స్‌లనన్నిటినీ తన రక్తంతో మలినపరుస్తూ అక్కడి నుంచి క్రిందికి దొర్లింది.

పిడి వరకూ ఆమె గుండెల్లో దిగబడిన డాగర్‌ని బయటికి లాగి, ఆమె చీరతోనే శుభ్రం చేసి బూటు ప్రక్కన అమర్చుకున్నాడు షాడో.

"కమాన్... ఐవాన్ట్ హర్ అడ్రస్... కమాన్... గెట్ ఇట్ ఇమ్మీడియేట్లీ..." వర్షాకాలపు కారు మేఘాలు ఉరిమినట్లు ఆ హాల్లో ప్రతిధ్వనించింది అతని కంఠం.

కంపిస్తున్న కరచరణాలను స్వాధీనంలోకి తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ, హాలును ఆనుకొని వున్న ఒక చిన్న గదిలోకి పోయాడు బట్టతల వ్యక్తి. అక్కడ వున్న స్టీల్ కాబినెట్స్‌లో నుంచి ఎల్లో కలర్ ఫోల్డర్‌ని తీసుకువచ్చి అందించాడు.

హెడ్ క్వార్టర్స్ ప్రక్కనే వున్న రేకుల షెడ్‌లో నిలబడి రివాల్వర్ మ్రోతల్ని విన్నాడు సెక్యూరిటీ కాప్టన్ వాసు.

వింటి నుంచి వెలువడిన బాణంలా వచ్చేశాడతను... బరువైన మెషీన్‌గన్స్‌ని పట్టుకొని హాల్లో వున్న వారందర్నీ కవర్ చేశారు అతని గార్డులు.

"ఆర్ యూ ఆల్‌రైట్ రాజూ? ఆర్ యూ ఆల్ రైట్??" ఆందోళనగా అడుగుతూ తన ప్రక్కన ప్రత్యక్షం అయిన వాసును చూచి గంభీరంగా తల వూపాడు షాడో.

బట్టతల వ్యక్తి తెచ్చి యిచ్చిన ఫోల్డర్‌లోని వివరాలన్నిటినీ చూడలేదతను. ముందు పేజీలో వున్న ఆ యువతి అడ్రస్సును మాత్రం గుర్తు పెట్టుకొని ఫోల్డర్‌ని అవతలికి విసిరేశాడు.

"గెట్ హర్ ఎవే ఫ్రమ్ హియర్... ముందు ఈమెను యిక్కడి నుంచి అవతలికి తరలించండి..." బట్టతల వ్యక్తికి ఆర్డర్స్ యిస్తూ వాసు చేయి పట్టుకొని బయటికి పరుగుతీశాడు.

క్లోజ్డ్ సర్క్యూట్ టెలివిజన్స్‌లో నుంచి అక్కడ జరిగిన గోలను గమనించి హెడ్ క్వార్టర్స్ ఎమర్జెన్సీ అలారంని ప్రెస్ చేసింది పై అంతస్తులో వుండే రిసెప్షనిస్టు బెట్టీ. అంతటితో ఆగకుండా క్రిందికి పరిగెత్తుకు వచ్చింది.

"బాస్ వస్తున్నారు.... ఆగు రాజూ... కొంచెం ఆగు...." అంటూ ఆమె అరిచిన అరుపును వినిపించుకోనట్లే నటిస్తూ జాగ్వార్ స్టీరింగ్ ముందు కూర్చున్నాడు షాడో. వాసు తన ప్రక్కకు చేరుతుండగానే ఇంజన్‌ని స్టార్ట్ చేసి లైట్‌గా వెనక్కి తిప్పాడు.

"స్టాప్ దట్ ఇడియట్.... స్టాప్ హిమ్...." విపరీతమైన ఆందోళన ప్రతిఫలిస్తున్న కంఠంతో ఆజ్ఞలు జారీ చేస్తూ కులకర్ణిగారు క్రిందికి వచ్చేసరికి ఆ ప్రదేశాన్ని వదిలి రెండు ఫర్లాంగుల దూరం వెళ్ళిపోయింది జాగ్వార్.

## 2

విశాలమైన ఫిఫ్తు టౌన్ మెయిన్ రోడ్డులో ఒక హోటల్ ముందు కారును ఆపి క్రిందికి దిగాడు షాడో.

ప్రశ్నార్థకంగా చూస్తూ రెండో ప్రక్క నుంచి రోడ్డు మీదికి పాదాన్ని మోపిన వాసుకు సైగ చేస్తూ వంద గజాల ముందుకు పోయి ఒక సందులోకి మరలాడు.

పది ఇళ్ళు దాటిన తరువాత విశాలమైన ఆవరణ మధ్యలో అందంగా కట్టబడి కనిపించిందతనికి చిన్న మేడ.

బార్లా తెరిచి వున్న ప్రహరీ గేటును దాటి ఆ మేడ ముందు తలుపుల దగ్గిర ఆగాడతను.

"ఇంత దూరం వచ్చి యింకా ఆలోచిస్తూ నిలబడటం దేనికి రాజూ? లోపలికి పోయి చూద్దాం...." అంటూ ఓరగా వేసి వున్న ఆ తలుపుల్ని తోసుకుంటూ లోపలికి పోబోయిన వాసు చేయి పట్టుకొని ఆపుతూ చుట్టూ చూశాడు.

అతని ఆలోచనల్ని వెంటనే అర్థం చేసుకున్నాడు వాసు. గబగబా వెనక్కి పోయి, గేటు బిగించి వున్న ప్రదేశంలో ప్రహరీ గోడకు భుజాన్ని ఆనించి బలంగా నెట్టాడు.

ఛట్‌మని శబ్దం చేస్తూ పైకి లేచి అవతల పడింది పెద్ద సిమెంట్ అచ్చు. దాన్ని అందుకొని వెనక్కి వచ్చాడతను. అంగీకార సూచకంగా షాడో తల వూపగానే ఓరగా వేసి వున్న తలుపుల్ని కాలితో లోపలికి తన్ని, అదే వూపుతో బలంగా విసిరేశాడు సిమెంట్ అచ్చును.

విసిరిన తరువాత ఏం జరుగుతుందో చూడటానికి సిద్ధంగా అక్కడే నిలబడ లేదతను. రెండు చేతులతోను చెవుల్ని గట్టిగా మూసుకొని పది అడుగులు వెనక్కి పరిగెత్తి బోర్లా పడిపోయాడు నేలమీద.

సిమెంట్ అచ్చు లోపల వున్న ఫ్లోరింగ్‌ని తాకిన మరుక్షణం భూకంపం వచ్చినట్లు కంపించింది ఆ ప్రదేశం.... ఆటంబాంబు ప్రేలినట్లు వినవచ్చింది దారుణమైన శబ్దం.... కనులు మిరుమిట్లు గొలిపే వెలుగు ఆ శబ్దం వెనుకే ప్రత్యక్షమైంది. రాక్షసహస్తం ఏదో పట్టుకొని పైకి లేపినట్లు పాతిక అడుగులు గాలిలోకి లేచిందిమేడ పైకప్పు.... ముక్కలు ముక్కలై నలుదిక్కుల చెదిరిపోయింది.

"వెనుకా ముందు చూడకుండా మనం లోపలికి పోయి వుంటే ఏం జరిగేది వాసూ?" శరీరం నిండా పడిన దుమ్మును వదిలించుకోవటానికి ప్రయత్నిస్తూ వాసును ప్రశ్నించాడు షాడో.

ఎండుకు పోయిన పెదవుల్ని నాలుకతో తడి చేసుకోవటానికి ప్రయత్నిస్తూ లేచి నిలబడ్డాడు వాసు...

గావుకేకలు పెడుతూ యిళ్ళలో నుంచి బయటికి వచ్చేశారు ఆ సందులోని పౌరులు అందరూ.... వారి కంటపడి లేనిపోని అనుమానాల్ని రెచ్చగొట్టటం ఇష్టం లేక చల్లగా వెనక్కి జరిగి సందుకు రెండో వైపున వున్న ఇంటి చాటుకు చేరుకున్నారు వారిద్దరూ.... సందు అంతా జనంతో నిండిపోగానే వారిలో కలిసిపోయి మెయిన్ రోడ్డు మీదికి వచ్చేశారు.

* * * * *

".... యస్ జంటిల్మెన్.... ఇక ప్రారంభిద్దామా మన సమావేశం??" టేబిల్ మీద వున్న కాగితాల్ని ప్రక్కకు నెట్టి కుర్చీ వెనక్కి వాలి కూర్చుంటూ ప్రశ్నించారు ప్రధానమంత్రి.

పది అడుగుల దూరంలో అర్ధచంద్రాకారంగా వున్న ఒక టేబిల్ చుట్టూ కూర్చుని వున్న కొంతమంది ప్రభుత్వాధికారులు, మిలటరీ ఆఫీసర్లు అందరూ వెంటనే తలలు తిప్పి ప్రశ్నార్థకంగా చూశారు హోమ్ మినిస్టర్ గారి వైపు.

"ఇఫ్ యూ డోన్ట్ మైండ్... సి.ఐ.బి. చీఫ్ కులకర్ణి ఇంకా రాలేదు.... ఒక్క పది నిమిషాలు టైమ్ యిస్తే వెంటనే పిలిపించే ఏర్పాటు చేస్తాను...." కుర్చీలో నుంచి లేస్తూ అన్నారాయన.

అందుకు ప్రధానమంత్రి సమాధానం యివ్వక ముందే గుర్రుగా చూసి గొంతును సవరించుకున్నారు డిఫెన్స్ మినిష్టర్.

"దేశ భద్రతకు సంబంధించిన విషయాన్ని డిస్కస్ చేసేందుకు ఇంత మందిమి యిక్కడ వెయిట్ చేస్తుంటే, చెప్పిన టైమ్‌కి అటెండ్ కాలేని ఆ పెద్దమనిషి కోసం ఎదురు చూడటంలో అర్థం ఏమన్నా వుందా? అసలు విషయం ఏమిటో తెలుసుకోవటానికే యింత ఆలస్యం చేసే ఆ జంటిల్మన్ తనకు అప్పగించిన పనుల్ని ఇంకెంత సమర్థవంతంగా నిర్వహిస్తాడో అర్థం అవుతూనే వుంది..." వేడిగా వాడిగా ఆయన నోటినుంచి వెలువడిన మాటల్ని వినేసరికి ఎర్రబడి పోయింది హోమ్ మినిస్టర్ గారి వదనం.

"ఇటీజ్ ఆల్‌రైట్ మై ఫ్రెండ్.... అత్యంత ప్రతిభావంతులైన మీరు అందరూ ఇక్కడ వుండగా పంక్చువాలిటీకి అర్థం కూడా తెలియని ఆ పెద్దమనిషి కోసం వెయిట్ చేయటం అసందర్భమే అవుతుంది... ప్లీజ్ ప్రొసీడ్ విత్ ది మేటర్.... ఫర్‌గెట్ ఎబౌట్ హిమ్..." కుర్చీలోనుంచి లేచే ప్రయత్నాన్ని విరమించుకుంటూ అన్నారాయన.

అక్కడికేదో అత్యద్భుతమైన విజయాన్ని సాధించినట్లు ముసిముసిగా నవ్వుతూ తన ప్రక్కనే వున్న స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ వైపు చూశాడు డిఫెన్స్ మినిస్టర్.

శాల్యూట్ చేసినట్లు చేతిని స్వల్పంగా కదిలించాడతను...

"ఇటీజ్ సెటిల్డ్.... వుయ్ విల్ స్టార్ట్ దిస్ మీటింగ్...." ప్రధానమంత్రి వైపు తిరుగుతూ అన్నాడు.

తమ కనుల ముందే జరిగిన ఆ విచిత్రమైన డ్రామాను గమనించలేదు ప్రధానమంత్రి. తమ ప్రక్కకు వచ్చిన సెక్రటరీకి ఏవో సూచనలివ్వటంలో బిజీ అవటం అందుకు కారణం అయి వుండవచ్చు....

"యస్ జంటిల్మన్.... వుయ్ విల్ స్టార్ట్ ది మేటర్...." స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ అన్న మాటల్ని మాత్రం విని కుర్చీలోనుంచి ముందుకు వంగుతూ అన్నారు.

అదే సమయంలో తెరుచుకున్నాయి ఆ గది తలుపులు... ముఖానికి పట్టిన స్వేదబిందువుల్ని హేండ్ కర్చీఫ్‌తో అద్దుకుంటూ లోనికి ప్రవేశించారు కులకర్ణి.

"సారీ ఫర్ మై లేట్ కమింగ్... ప్లీజ్ కంటిన్యూ..." అంటూ ప్రధానమంత్రికి విష్ చేసి హోమ్ మినిస్టర్ గారి ప్రక్కనే కూర్చున్నారాయన.

ఒక చిరునవ్వు ముఖాన్ని ప్రకాశవంతం చేస్తుండగా ఆయన వైపు చూసితమ మాటల్ని మొదలు పెట్టారు ప్రధానమంత్రి.

"కలకత్తా నగరంలో మనం బ్రహ్మాండమైన డిఫెన్స్ రీసెర్చి లేబరేటరీని స్థాపించి రకరకాల పరిశోధనలు చేయిస్తున్న సంగతి మీకందరికీ తెలుసు..." తమదైన ప్రత్యేకమైన పద్ధతిలో సూటిగా అసలు విషయంలోకి వచ్చేశారు.

"డాక్టర్ మహేంద్రనాథ్ అనే సైంటిస్ట్ ఇప్పటికి రెండు సంవత్సరాలుగా ఆ రీసెర్చి సెంటర్లో పని చేస్తున్నాడని కూడా మీకు తెలుసు..."

"అందరి మాదిరిగా ఆయుధాల మీద, వాటిని ప్రయోగించటానికి అవసరమైన ప్రేలుడు పదార్థాల మీద తన దృష్టిని కేంద్రీకరించకుండా, మానవ శరీరం మీద, శరీరంలోని నాడీ వ్యవస్థ పనిచేసే పద్ధతుల మీద విచిత్రమైన పరిశోధనలు చేశాడతను...."

"ఎందుకూ పనికిరాని ఆ పరిశోధనల్ని ఆపించమని మాకు అనేక రకాల విజ్ఞప్తులు అందినప్పటికీ ఉపేక్షించటం జరిగింది.... మహేంద్రనాథ్‌కి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడటం జరిగింది...."

ప్రధానమంత్రి మాటల్ని వింటూ కోటు జేబులో నుంచి సిగార్‌ని బయటికి తీసి, గాఢంగా నిట్టూర్చారు కులకర్ణి.

"ఎందుకూ పనికిరానివని అందరి వెక్కిరింపులకు గురియైన ఆ మహేంద్రనాథ్ పరిశోధనలే ఇప్పుడు ప్రాణాల మీదికి తెచ్చి పెట్టాయి... శరీరంలోని నాడీ వ్యవస్థను గురించి శోధించి, శోధించి చటుక్కున కనుగొన్నాడతను ఆ వ్యవస్థను నిర్వీర్యపరిచి మనిషిని పూర్తిగా దెబ్బతీసే ఒక విచిత్రమైన నెర్వ్‌గాస్‌ని...."

"ప్రయోగించిన మరుక్షణం ఎదురైన ప్రతి మనిషిని డమ్మీగా మార్చేస్తుందది.... ఎందుకూ పనికిరాని మూర్ఖుడి క్రింద తయారుచేస్తుంది.

ఆయుధాల తయారీలో అమితమైన పోటీల నెదుర్కొంటూ అగ్రరాజ్యాలు తయారుచేస్తున్న విషవాయువుల కంటె వెయ్యిరెట్లు పవర్ ఫుల్ పరిశోధన అది...

తన పరిశోధనను ప్రధానమంత్రికి వివరించి, ఆ నెర్వ్‌గాస్ ఫార్ములాను మిలటరీ అధికారులకు అప్పగించేందుకు బయలుదేరుతున్నానని మూడురోజుల క్రితం ప్రభుత్వానికి ఒక లెటర్ వ్రాశారు మహేంద్రనాథ్...

లెటర్ వ్రాసిన పన్నెండు గంటల్లో మంత్రం వేసినట్లు మాయమైపోయాడు... లాబరేటరీలో వున్నవాడు వున్నట్లే అదృశ్యం అయినాడు....

ఆ వార్త అందిన మరుక్షణం మన కలకత్తా పోలీస్ డిపార్ట్‌మెంట్ రంగంలోకి దిగింది... కులకర్ణిగారి ఆలోచనల్ని డామినేట్ చేస్తూ వినవచ్చింది ప్రధానమంత్రి కంఠస్వరం.

"మహేంద్రనాథ్ జాడల్ని అన్వేషిస్తూ అతను పనిచేసిన లాబరేటరీ బ్లాక్ లోకి పోయారు నలుగురు ఇన్స్‌పెక్టర్స్.... బ్లాకులో అడుగుపెట్టిన మరుక్షణం బాంబులు అమర్చి వుంచినట్లు ముక్కలు ముక్కలై గాలిలోకి ఎగిరిపోయింది ఆ బ్లాకు మొత్తం. తనతో పాటు వారిని కూడా నాశనం చేసేసింది.

"సమర్థులైన అధికారులను పోగొట్టుకున్నప్పటికీ నిరుత్సాహం చెందకుండా మరింత పట్టుదలగా పరిశోధనలు సాగించింది కలకత్తా పోలీస్ డిపార్ట్‌మెంట్...." అంటూ సడన్‌గా మాటల్ని ఆపి వారందరి వైపు చూశారు ప్రధానమంత్రి.

ఆ తరువాత జరిగింది ఏమిటో కూడా తెలుసు కులకర్ణి గారికి. ఆ విషయాన్ని తలుచుకునేసరికి ఆయన్ను ఆవరించుకుంది పెద్ద డిప్రెషన్.

పెళ్ళి పెటాకులు లేని ఆజన్మ బ్రహ్మచారి ఆ మహేంద్రనాథ్... తన జీవితమంతా ఏదో ఒక విషయాన్ని గురించి పరిశోధనలు చేస్తూనే గడుపుకు వచ్చాడు.... రాత్రింబగళ్ళు లాబరేటరీని పట్టుకొని వ్రేలాడే అతనికి స్నేహితులు అనబడే వాళ్ళు కూడా ఎవరూ లేరు. ఎక్కడికి పోయినా ఎటువంటి ఆచూకీ లభించక నిస్సహాయంగా నిలబడి పోయింది కలకత్తా పోలీస్ డిపార్ట్‌మెంట్... తన నిస్సహాయతను ప్రధాన మంత్రికి నివేదించింది.

"శాంతి కాముకులమైన మన దగ్గిర కూడా వుండకూడని భయంకర ఆయుధం మహేంద్రనాథ్ తయారుచేసిన నెర్వ్ గాస్.... ఇప్పుడు అది మన శత్రువుల

చేతికో, మరే సంఘ విద్రోహుల చేతికో చిక్కితే సర్వనాశనం అయిపోతాం మనం... ప్రగతిపథంలోకి ఒక్కొక్క అడుగే వేస్తూ, బంగారు భవిష్యత్తు నిర్మించుకోవాలని అహర్నిశలు శ్రమిస్తున్న మన జాతి సమూలంగా తుడిచి పెట్టుకుపోయే ప్రమాదం మహేంద్రనాథ్ మాయం అవటం వల్ల మనకు ఎదురైంది..."

"అందుకే.... అందుకే జంటిల్మన్ మిమ్మల్ని యిక్కడ సమావేశపరిచింది. అదృశ్యం అయిన ఆ మహేంద్రనాథ్‌ని అతని వద్ద వున్న నెర్వ్ గాస్ ఫార్ములాని వెతికి పట్టుకోమని చెప్పటానికే ఏర్పాటు చేయబడింది ఈ సమావేశం... ఎవరు చేస్తారు ఈ పనిని? ప్రమాదం మనల్ని చుట్టు ముట్టక ముందే ఎవరు కనిపెట్టగలరు ఈ సమస్యకు సమాధానాన్ని?" ఉన్నట్లుండి సూటిగా ప్రశ్నించారు ప్రధానమంత్రి.

ఎంతమాత్రము తడుముకోకుండా, కొంచెం కూడా ఆలోచించుకోకుండా చటుక్కున లేచి నిలబడ్డాడు స్పెషల్ బ్రాంచి డైరక్టర్.

"కలకత్తా పోలీస్ డిపార్ట్‌మెంట్ వద్ద నుంచి ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాల్ని తెప్పించి ఎనలైజ్ చేస్తున్నారు మా డిటెక్టివ్స్.... ప్లీజ్ గివ్ అజ్ ఫైవ్ డేస్ టైమ్... ఐదు రోజులు గడిచేలోగా ఆ మహేంద్రనాథ్‌ని అతని ఫార్ములాతో సహా తీసుకువచ్చి మీ ముందు నిలబెడతాము..." సగర్వంగా ఎనౌన్స్ చేశాడు.

ఆ మాటల మీద ఏవైనా అభిప్రాయాలు వెలిబుచ్చుతారేమోనని మిగిలిన వారందరి వంకా చూశారు ప్రధానమంత్రి.

ఎవరూ పెదవి విప్పలేకపోయేసరికి, "ఆల్‌రైట్ జంటిల్మన్... ఇటీజ్ సెటిల్డ్... స్పెషల్ బ్రాంచి ఈ సమస్యను సాల్వ్ చేస్తుంది.... అందుకు సంబంధించిన పరిశోధనలో వారికి ఎటువంటి సహాయం కావాల్సి వచ్చినా మీరు అందించటానికి సిద్ధంగా వుండాలి..." అంటూ తల వూపారు.

మౌనంగా వుండిపోయిన కులకర్ణిగారి వైపు కోరగా చూశాడు స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ - ఆయన తన అభిప్రాయం ఏదైనా వెలువరిస్తే వెంటనే కౌంటర్ పెట్టి గోల చేయటానికి సిద్ధంగా వున్నాడు.

సుడులు తిరుగుతూ పైకి లేస్తున్న సిగార్ పొగమీదనే దృష్టిని కేంద్రీకరించి అతన్ని గురించి పట్టించుకోలేదాయన. కనీసం కుర్చీలో నుంచి అటూ ఇటూ కదలను కూడా కదలలేదు.

"మా అంతట మేము నోరు తెరిచి సహాయం అడిగితే తప్ప, తమకు తాముగా ఎటువంటి పరిశోధనలు ప్రారంభించి మా దారికి అడ్డు రాకూడదు ఎవరూ.... ఈ విషయం ఒకటి ఖచ్చితంగా అండర్ స్టాండ్ చేసుకోవటం మంచిది" ఆయన వైపే చూస్తూ రెచ్చగొట్టటానికి మాటల బాణాల్ని వదిలాడు స్పెషల్ బ్రాంచి డైరెక్టర్.

"ది గ్రేట్ స్పెషల్ బ్రాంచి డిటెక్టివ్స్‌కి అసలు సహాయం అవసరం లేదని ఇక్కడున్న వారందరికీ తెలుసు మై ఫ్రండ్.... ప్లీజ్ కారీ ఆన్ విత్ యువర్ ఎస్సైన్మెంట్... మీ దారికి పొరపాటున కూడా అడ్డుపడరు ఎవరూ..." ఉన్నట్లుండి కల్పించుకుంటూ అన్నారు హోమ్ మినిస్టర్ గారు.

ఎందుకనో కొంచెంగా కళ తప్పింది స్పెషల్ బ్రాంచి డైరెక్టర్ వదనం. ఏదో అనటానికి నోరు తెరిచాడు గాని, ఏమనాలో అర్థం కానట్లు వెంటనే ఆ ప్రయత్నాన్ని విరమించుకొని, గది బయటికి వెళ్ళిపోయాడు.

పది క్షణాలు ఆగి తాము కూడా లేచి నిలబడ్డారు కులకర్ణి.

"వన్ సెకండ్ కులకర్ణీ.... మహేంద్రనాథ్ కేసును మీకు అప్పచెప్పటానికి పిలిపించలేదు నిన్ను.... దేరీజ్ వన్ అనదర్ వెరీ ఇంపార్టెంట్ మేటర్ ఫర్ యూ టూ

థింక్ ఎబౌట్...." అంటూ ఆయన్ని వారించి ఇంకా తమ కుర్చీలలో కూర్చునే వున్న మిలటరీ ఆఫీసర్ల వైపు చూశారు ప్రధానమంత్రి.

వెంటనే లేచి నిలబడ్డాడు ఒక ఆఫీసర్.

"నాలుగు రోజుల క్రితం అస్సాం ఏరియాలో బోర్డర్స్‌ని పెట్రోల్ చేస్తున్న మా సైనికులకు కనిపించారు కులకర్ణీ చీకటి మాటున బోర్డర్స్‌ని దాటుతున్న కొందరు చైనీయులు.... కాల్పులు జరిపి వారిని వెనక్కి పారద్రోలటానికి చేసిన ప్రయత్నాలు వృధా అయ్యాయి... ఆ సమయంలో చీకటిలో సైతం పనిచేసే ఇన్ఫ్రారెడ్ కెమేరాల నుపయోగించి కొన్ని ఫోటోలు తీశారు మా వాళ్ళు.... ఐ వాన్ట్ యూ టూ సీ దోజ్ ఫోటోస్...." అంటూ ఒక కవర్‌ని ఆయనకు అందించాడు.

కవర్‌లో నుంచి నాలుగు కార్డ్ సైజు ఫోటోల్ని బయటికి తీశారు కులకర్ణి.

ఫైరింగ్ జరుగుతుండగా, పారిపోతున్న వారిని ఫిలిం మీద ముద్రించటం ఏమంత సామాన్యమైన విషయం కాదు.... మూడు ఫోటోల్లో పుట్టలు చెట్లు నల్లని ఆకారాలు తప్ప సరయిన డీటెయిల్స్ కనిపించటం లేదు.... నాలుగో ఫోటో మాత్రం స్పష్టంగా చూపిస్తోంది, ఒక పెద్ద బండరాయి చాటుకు దూకబోతున్న ఇద్దరు ఆగంతకుల్ని.

యావరేజి చైనీయుల కంటే ఒక అడుగు ఎక్కువ ఎత్తున్నాడు ఆ ఇద్దరిలో ఒకతను. ఒక ప్రక్కకు తిరిగి వున్న అతని తల మీద కొట్టివచ్చినట్లు కనిపిస్తోంది బత్తాయి కాయ సైజులో వున్న పెద్ద బుడిపె.

"మైగాడ్! యాంగ్ చీ ఇతను.... చైనీస్ మిలటరీ ఇంటలిజెన్స్ ఆఫీసర్ యాంగ్ చీ..." ఉలికిపాటును కప్పి పెట్టుకోవటం సాధ్యం కాక అప్రయత్నంగా పైకే అనేశారు కులకర్ణి.

* * * * *

"ఎవరు సార్ మీరు? ఇక్కడ చీకటిలో నిలబడ్డారేమిటి?"

ఉన్నట్లుండి ఒక కంఠం ప్రశ్నించటంతో చెదిరిపోయాయి షాడో ఆలోచనలు.

పెద్ద ప్లాస్టిక్ బక్కెట్‌ని పట్టుకొని అతని ఎదుట వున్నాడు అరవై సంవత్సరాలు దగ్గిర పడుతున్న వృద్ధుడు ఒకతను.... చీకటిలో చూపు కనిపించదు కాబోలు కళ్ళకు చేతిని అడ్డం పెట్టుకొని పట్టి పట్టి చూస్తున్నాడు.

"నెంబర్ త్రీ బ్లాకులో జరిగిన ప్రేలుడును విచారించటానికి వచ్చిన ఆఫీసర్ని తాతా..." కంఠంలో తొట్రుపాటు కనిపించకుండా అతని ప్రశ్నకు సమాధానం యిచ్చాడు షాడో.

"ఇప్పటికి కనీసం ఒక యాభై మంది అయినా వచ్చి వుంటారు బాబూ.... బ్లాకు చుట్టూ తిరిగి చేతులు వూపుకుంటూ వెళ్ళిపోవటం తప్ప వాళ్ళు చేసింది ఏమీ లేదు..." అతనెవరో తెలిసిన తరువాత యిక అక్కడ వుండటం అనవసరం అని భావించాడు కాబోలు, బక్కెట్‌ని తీసుకొని అవతలికి వెళ్ళిపోతూ అన్నాడు ఆ వృద్ధుడు.

అతన్ని కూడా రెండో చెక్‌పోస్ట్ లోని గార్డు మాదిరిగా పడుకోబెట్టడం మంచిదా కాదా అనే విషయాన్ని షాడో తేల్చుకునే లోపల, మెర్క్యురీ లైట్లతో నిండివున్న పెద్ద బిల్డింగ్ లోకి పోయి అదృశ్యం అయినాడు.

ప్రమాదకరమైన పనిచేస్తుండగా జరిగిపోయిన సంఘటనల్ని గుర్తుకు తెచ్చుకుంటూ ఏమరిపాటుగా వుండటం ఎంత ప్రమాదకరమో స్పష్టంగా తెలిసివచ్చి, తనను తానే నిందించుకుంటూ రెండు నిమిషాల్లో నెంబర్ త్రీ బ్లాకును సమీపించి నిలబడ్డాడు షాడో.

ప్రేలుడు దెబ్బకు మూడొంతులు శిథిలమై కనిపిస్తోంది అది... విరిగి పడిన గోడల మధ్య ముక్కలు ముక్కలై పోయిన ఫర్నిచర్ లేబరేటరీ పరికరాలు చెల్లాచెదరుగా విసిరేసి వున్నాయి.

నడుము ఎత్తున వున్న ఒక గోడమీద నుంచి అవతలికి దూకి, పాంటు జేబులో నుంచి పెన్ టార్చి నొకదాన్ని బయటికి తీసాడు షాడో.... దాని వెలుగులో బ్లాకులో వున్న గదులన్నిటినీ గాలించటం మొదలుపెట్టాడు.

బాంబులు పెట్టి బూబీ ట్రాప్‌లు తయారు చేయటంలోను, భవనాల్ని బ్రద్దలు కొట్టటంలోను అందెవేసిన చేయి యాంగ్ చీ... సైంటిస్ట్ మహేంద్రనాథ్ అదృశ్యం అవటం వెనుక అతని హస్తం ఏమైనా వుందా??

తన చేతుల్లో స్పృహ కోల్పోయిన గార్డుకి తెలివి వచ్చినా, అతనలా తెలివి లేకుండా పడి వుండటాన్ని ఇతరులు ఎవరైనా గమనించినా కొంపలు అంటుకుంటాయని తెలిసి వుండి కూడా త్వరపడలేదు షాడో.... అంగుళం అంగుళం చొప్పున అక్కడి గదులన్నిటినీ కలియ తిరగసాగాడు.

ఒక రౌండ్ కొట్టి ముందు భాగంలోకి వస్తుండగా, మొండి గోడల ప్రక్కన పడిన పెద్ద కాంక్రీట్ పెళ్ళ క్రింద కనిపించిందతనికి రెండు అంగుళాల పొడవున్న చిన్న రాగి తీగె.

వేగంగా కొట్టుకుంటున్న గుండెల్ని చిక్కబట్టుకొని, ఆ కాంక్రీట్ పెళ్ళను ఎత్తి అవతల పెట్టాడు. దాని క్రింద మట్టిని చేతులతో తవ్వటం మొదలు పెట్టేసరికి, సడన్‌గా కనిపించింది పాకెట్ రేడియో సైజులో వున్న ఒక ఎలక్ట్రానిక్ పరికరం.

ముఖం మీది నుంచి కనులలోకి జారుతున్న స్వేద బిందువుల్ని అడ్డుకోవటం కూడా మరిచిపోయి, ఆ మొండి గోడను ఆనుకొని అలాగే కూర్చుండి పోయాడు షాడో.

తనను హతమార్చటానికి ప్రయత్నించిన ఆకుపచ్చ చీరె యువతి యింట్లో కూడా అటువంటి పరికరమే దొరికింది తమ బాంబింగ్ స్క్వాడ్ గార్డులకు....

ఎంతో సునిశితము, సున్నితము అయిన ఆ పరికరాన్ని ఉపయోగించటం యాంగ్ చీకి తప్ప యితరులకు అసాధ్యం అని డిక్లేర్ చేశారు వాళ్ళు....

"వచ్చిన పని అయిపోయింది గదా.... మహేంద్రనాథ్ మాయం అవటం వెనుక యాంగ్ చీ ప్రమేయం ఉన్నట్లు అర్థం అయింది కదా!! ఇక మర్యాదగా బయటికి పోయి హెడ్ క్వార్టర్స్‌కి రిపోర్ట్ చేయి.... నీ ఎస్సైన్మెంట్ క్లోజ్ అయింది...." ఉన్నట్లుండి అంతరాత్మ హెచ్చరించటంతో ఈ లోకంలోకి వచ్చేశాడు షాడో. చేతిలోని పరికరాన్ని పాంటుజేబులో పెట్టుకుంటుండగా, అంతకు ముందు ఎత్తి అవతల పెట్టిన కాంక్రీట్ పెళ్ళ మీదికి మరలింది అతని దృష్టి.

ముందు గదిలో వున్న ఒక అలమరాకు సంబంధించిన అవశేషం అది... బాంబు అదటుకు ఎగిరి ఇవతల పడింది.

పాలిష్ చేసినట్లు నునుపుగా వున్న దాని అంచుల దగ్గిర కనిపిస్తోంది చిన్న స్క్రూ వంటి సాధనం.

తన కంటె ముందుగా అక్కడికి వచ్చి ఆ ప్రదేశాన్నంతా శోధించి పోయిన కలకత్తా పోలీసులకు గాని, స్పెషల్ బ్రాంచి డిటెక్టివ్‌లకు గాని, ఆ స్క్రూ ఎందుకు కనిపించలేదో వూహించటానికి ప్రయత్నిస్తూ దాన్ని పట్టుకొని గట్టిగా తిప్పాడు షాడో.

రెండు క్షణాల తరువాత టప్పున వూడి అతని చేతిలోకి వచ్చిందది... దానితో పాటు పేక ముక్కలా వూడి క్రింద పడింది సిమెంట్ కలర్ పూసి వున్న రేకు పలక ఒకటి.

ఆశ్చర్యాన్ని అణుచుకోవటానికి ప్రయత్నిస్తూ, ఆ రేకు పలక వెనుక ప్రత్యక్షం అయిన చిన్న అరలో చేయి పెట్టాడతను.

అదే సమయంలో అతని మీదికి ఫోకస్ చేయబడింది పవర్‌ఫుల్ టార్చిలైటు ఒకటి.

"మైగాడ్! వాడే!! నన్ను కొట్టి పారిపోయి వచ్చిన దొంగరాస్కెల్ వాడే... పట్టుకోండి... పట్టుకోండి...." అంటూ వినవచ్చింది కర్ణకఠోరమైన కంఠం.

తన బండారం బయటపడి పోయిందని గ్రహించి అరలో పెట్టిన చేతిని వెనక్కి లాక్కున్నాడు షాడో... చేతితో పాటు కదిలి యివతలికి జరిగింది ఒక చిన్న కవర్... అదేమిటో, అందులో వున్నవి ఏమిటో చూసుకునే వ్యవధి లేక, దాన్ని అలాగే పాంటు జేబులోకి నెట్టుకుంటూ లేచి నిలబడ్డాడతను... గిరుక్కున వెనుతిరిగి బ్లాకు మధ్య భాగంలోకి పరిగెత్తాడు.

"పట్టుకోండి.... పట్టుకోండి...." మరింత బిగ్గరిగా వినవచ్చిందా కంఠం.

మొండి గోడల మీది నుంచి బరువైన పాదాలు లోపలికి దూకుతున్న సవ్వడి వినిపించింది.

బ్లాకు మధ్య భాగంలో నుంచి మరో గోడను క్రాస్ చేసి మెత్తటి పచ్చిక మీద పడ్డాడు షాడో.... పడిన వెంటనే లేచి పరుగు అందుకున్నాడు....

పాతిక అడుగుల దూరం కూడా పోకముందే వచ్చిందతనికి అనుమానం... పరుగును ఆపకుండా వెనక్కి చూసిన అతని కనులకు పెద్ద బ్రహ్మరాక్షసిలా కనిపించింది పెద్ద పెద్ద గంతులు వేస్తూ వస్తున్న నల్లటి ఆల్సేషియన్ డాగ్.

## 3

డిఫెన్స్ లేబరేటరీలో సెక్యూరిటీ సిస్టమ్ ఎలా వుంటుందో వివరంగా చెప్పి, ఆ సిస్టమ్‌లో ఆల్సేషియన్ డాగ్స్ ఉంటాయని చెప్పటం మరిచిపోయిన సి.ఐ.బి. ఇన్ఫర్మేషన్ డిపార్ట్‌మెంట్ హెడ్‌ని తలుచుకొని పళ్ళు కొరుకుతూ నిస్సహాయంగా చుట్టూ చూశాడు షాడో.

పోలీస్ పద్ధతిలో బెల్టుకు బిగించి వుంది రివాల్వర్... దాన్ని బయటికి తీసే వ్యవధి లేదు. బూటుకు బిగించి వున్న డాగర్‌ని అందుకునే టైమ్ అంతకన్నా లేదు...

పరుగు పందెంలో పాల్గొంటున్నట్లు శరవేగంతో వచ్చేస్తున్నదది.... నల్లటి దాని ముఖంలో తెల్లగా మెరుస్తూ కనిపిస్తున్నాయి చురకత్తుల్లాంటి కోరలు.

వేగంగా వేశాడు షాడో మరో పది అడుగులు.... ఉన్నట్లుండి ఎడమ చేతి ప్రక్కన కనిపించిన ఒక గోడను సమీపించి, బోర్లా పడిపోయాడు.

దాట్లు కొడుతూ వచ్చేసింది ఆల్సేషియన్ డాగ్.... అమాంతం ఎగిరి అతని మెడను నోట కరుచుకోవటానికి ప్రయత్నించింది.

అదే ఒక అరక్షణం ముందు ఎగిరి వున్నట్లయితే నోటి నిండా దొరికి వుండేది షాడో మెడ... ఉన్న పాళాన అతను విరుచుకు పడిపోవటంతో వృధా అయింది దాని ప్రయత్నం.

క్రిందపడి బాలెన్స్ నిలబెట్టుకోవాలని అది అనుకుంటుండగానే ముంచుకు వచ్చేసింది అది ఎదురుచూడని ప్రమాదం.

ఖాళీ ప్రదేశంలో పడలేదు షాడో... గోడను ఆనుకొని పడ్డాడు.

అతన్ని పట్టుకోవాలన్న తొందరలో ఆ గోడ సంగతిని విస్మరించిందా కుక్క... దభీమని గోడకు గుద్దుకుని సిమెంట్ బస్తాలా నేలకూలింది.

మెరుపుకంటే వేగంగా కదిలి డాగర్‌ని బయటికి లాగాడు షాడో. పిడిని బిగించి పట్టుకుంటూ గాలిలోకి ఎత్తాడు దాని గుండెల్లో దింపటానికి.

తలకు బలమైన దెబ్బ తగిలింది కాబోలు, నాశికా రంధ్రాల నుంచి వెచ్చటి నెత్తురు కాల్వలై పారుతుండగా, బాధగా మూలిగిందది... తలను అటూ ఇటూ కదిలిస్తూ లేచి నిలబడటానికి ప్రయత్నించింది.

పైకి ఎత్తిన డాగర్ షాడోకి తెలియకుండానే క్రిందికి దిగిపోయింది.

"సారీ డియర్... బెటర్ లక్ నెక్స్ట్ టైమ్..." అంటూ దాని తలను తట్టి పరుగు అందుకున్నాడు.

వంద గజాల దూరం పోయిన తర్వాత అతని ఉనికిని పసికట్టారు గార్డులు.

"అడుగో.... అడుగడుగో...." టార్చిలైటును అతని కేసి ఫోకస్ వేస్తూ అరిచాడు ఒకతను.

మాటలతో అరుపులతో కాలక్షేపం చేయకూడదని నిర్ణయించుకున్నారు కాబోలు వెంటనే ఫైరింగ్ ఓపెన్ చేశారు మిగిలినవారు.

గుండెలు జలదరించే శబ్దాలు చేస్తూ మ్రోగటం ప్రారంభించాయి రివాల్వర్లు. కందిరీగలు ఎగిరినట్లు షాడో శరీరానికి అత్యంత సమీపంలో నుంచి పోసాగాయి బుల్లెట్లు.

పొరపాటున గురి కుదిరి ఏదైనా తనకు తగిలితే-

ఆపైన ఆలోచించటానికి మనస్కరించక మరింత వేగంగా పరుగుతీశాడు షాడో.... పది క్షణాల తరువాత ఎదురైన వైర్‌ఫెన్సింగ్‌ని సమీపించి దానికి వున్న ఇనుప ముళ్ళు చేతుల్ని గాయపరుస్తాయని కూడా చూడకుండా వుడతలా పైకి పాకాడు...

"కొట్టండి.... ఫెన్సింగ్ మీది నుంచి పడగొట్టండి..." అని అరుస్తూ గార్డులు మరికొంచెం దగ్గర్లోకి వచ్చేసరికి అతను అవతలికి దూకటం, రోడ్డును క్రాస్ చేసి చీకట్లలో కలిసిపోవటం జరిగిపోయింది.

## 4

".... ఏది ఏమయినా పని కట్టుకొని పోయి కందిరీగల తుట్టెను కదిలించి వచ్చారు.... సిటీ అంతా హోరెత్తి పోతోంది.... మా స్టేషన్స్ అన్నిటికీ ఎలర్ట్ ఆర్డర్స్ వచ్చాయి..." ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో, సెగలు వెలువరుస్తున్న కాఫీ కప్పును పట్టుకొని షాడో పడుకొని వున్న బెడ్ దగ్గిరికి వస్తూ చెప్పాడు సాహలాల్.

నిద్ర నిండిన కనుల్ని చేతులతో అద్దుకుంటూ, ఆ కప్పును అందుకున్నాడు షాడో.

"కందిరీగల తుట్టెను కదిలించినందుకు ఫలితం దక్కింది.... ఆ పాంటు జేబులో ఒక కవర్ వుంది చూడు..." కాఫీని సిప్ చేస్తూ అన్నాడు.

రాత్రి అతను ధరించిన ఎ.యస్.పి. యూనిఫాం దగ్గిరికి పోయి, పాంటు జేబులోనుంచి చిన్న కవర్‌ని బయటికి తీశాడు సాహుల్.

దాన్ని తెరిచేసరికి అతని చేతుల్లోకి వచ్చాయి పది ఫోటోలు.

మూడేళ్ళ వయస్సున్న చిన్నారి పాప నవ్వు ముఖం కనిపిస్తోంది రెండింటిలో. అదే పాపకు ఆరేళ్ళు, ఎనిమిదేళ్ళు వయస్సు వచ్చినప్పుడు తీసినవి మరో నాలుగు వున్నాయి....

కనులు చెదరగొట్టే అందగత్తెగా తయారై పూర్తి వయస్సును సంతరించుకున్నప్పటి ఫోటోలు - మిగిలిన నాలుగూ.

"నెంబర్ త్రీ బ్లాకులో మహేంద్రనాథ్ తప్ప మరెవ్వరూ పని చేయలేదని మా వాళ్ళు చెప్పారు.... ఈ ఫోటోలు ఆ బ్లాకులోనే ఒక సీక్రెట్ కంపార్ట్‌మెంట్‌లో దొరికాయి..." ఖాళీ అయిన కప్పును క్రింద పెట్టి సిగరెట్ వెలిగించుకుంటూ అన్నాడు షాడో.

"వీటికి మహేంద్రనాథ్‌కి సంబంధం ఏమైనా వుందా? పెళ్ళి పెటాకులు లేని ఆ ఘోటక బ్రహ్మచారి దగ్గిర ఇంత అందమైన అమ్మాయి ఫోటోలు ఎందుకు వున్నట్లు?" తనలో తానే అనుకుంటున్నట్లు పైకి అనేశాడు సాహూల్.

"దటీజ్ ది క్వశ్చన్ ఐ వాన్ట్ టూ హావ్ యాన్ ఆన్సర్.... ఈ ఫోటోల్లో వున్న అమ్మాయి ఎవరో ముందు తెలుసుకోవాలి...." అన్నాడు షాడో.

"గివ్ మీ టూ దిస్ టైమ్... మా కానిస్టేబిల్స్‌ని పంపించి నగరమంతా గాలించమని..." అంటూ ఆ మాటల్ని మ్రింగేశాడు సాహూల్.

రాత్రి జరిగిన గొడవ మూలకంగా సిటీలో మకాం వేసి కూర్చుంది స్పెషల్ బ్రాంచి.... ఖర్మ కాలి ఈ విషయం వారికి తెలిస్తే??

సాహూల్ మనస్సులోని ఆలోచనల్ని గమనించి నవ్వుతూ బెడ్ మీది నుంచి దిగాడు షాడో.

"ఇది నీ డిపార్ట్‌మెంట్ వల్ల తేలే పని కాదు సాహూల్... ఇటువంటి వాటికి వేరే స్పెషలిస్టులు వున్నారు... ఈరోజు సాయంత్రంలోగా ఈ అమ్మాయి జాడల్ని వెతికిస్తాను చూడు...." అంటూ బాత్‌రూమ్‌లోకి పోయి తిరిగి వచ్చాడు పావుగంట తరువాత.

ఈ లోపల మరీ కప్పు కాఫీని తీసుకువచ్చి రెడీగా వుంచాడు సాహూల్. అతని ఎయిర్‌బేగ్‌లో నుంచి స్పేర్ డ్రస్‌ని తీసి బెడ్ మీద పెట్టాడు.

డ్రస్ చేసుకొని కాఫీ తాగాడు షాడో. ఫోటోల కవర్‌ని పాంటు జేబులో పెట్టుకొని బయటికి వచ్చాడు.

"నేను కూడా వస్తాను సార్... వెధవ ఉద్యోగానికి నాలుగు రోజులు శలవు పెట్టేస్తాను..." అతని వెనుకే అడుగులు వేస్తూ చిన్న పిల్లాడిలా గొణిగాడు సాహూల్. ఫ్రష్ సిగరెట్ వెలిగించుకుంటూ తల అడ్డం తిప్పాడు షాడో.

ఎంత సివిల్ డ్రస్‌లో వున్నా సాహూల్‌ని చూడగానే పోలీస్ మనిషని పోల్చుకుంటారు అందరూ... సిటీలో మకాం వేసివున్న స్పెషల్ బ్రాంచి వాళ్ళకు

అతనెవరో తెలుసు.... అతనితో పాటు తనను కూడా గుర్తు పట్టటం జరిగితే కథ అంతా అడ్డం తిరుగుతుంది.

"సారీ సాహూల్... తిరిగి నేను వచ్చేదాకా నువ్వు నీ వెధవ ఉద్యోగానికి అటెండ్ అయి నీ పనులు నువ్వు చూసుకుంటూ వుండక తప్పదు... అసలు గట్టిగా మట్లాడితే నేను వెళ్ళే ప్రదేశానికి నువ్వు రాకూడదు" అంటూ అటుగా వచ్చిన ఒక టాక్సీని ఆపి, వెనుక సీట్లో కూర్చున్నాడు.

నిరాశగా తల విదిలించి లోపలికి వెళ్ళిపోయాడు సాహూల్.

మనసు మార్చుకొని అతను మొండిగా తన వెనుక బయలుదేరటం లేదని నిశ్చయం కాగానే ఒక అడ్రస్సును చెప్పాడు షాడో డ్రయివర్‌కి.

అరగంట తర్వాత త్రీ టవున్ పాత బస్తీ మొగదట్లో టాక్సీని ఆపి అతని వైపు చూశాడు డ్రయివర్.

"ఇక ముందు అంతా యిరుకు సందులు సార్... నడిచి వెళ్ళటమే చాలా కష్టం... నా బండి అసలు పట్టను కూడా పట్టదు" అంటూ....

ఆ సంగతి షాడోకి తెలుసు.

"ఇట్సాల్ రైట్ బ్రదర్.... నడిచే వెళ్ళటానికి ప్రయత్నిస్తాను" అంటూ ఒక కరెన్సీ నోటును అతనికి అందించి కాలినడకన రెండు ఫర్లాంగుల దూరం పోయాడు.

టాక్సీ డ్రయివర్ అన్నట్లు ఆరు అడుగుల కంటె ఎక్కువ వెడల్పు లేవు ఆ సందులు.... వచ్చేపోయే జనంలో అడుగు తీసి అడుగు వేయటానికి కూడా వీలు కానంత రష్‌గా వున్నాయి.

ఆ రష్‌లో కలిసి యింకో ఫర్లాంగు దూరం పోయాడతను... నాలుగు సందులు కలిసే కూడలి వంటి ప్రదేశంలో ఆగి, ఎడమ చేతి వైపున వున్న పెద్ద ఫాన్సీ షాపులోకి ఎంటర్ అయినాడు.

కిటకిటలాడి పోతోంది ఆ షాపు కస్టమర్స్‌తో. వారు అడిగిన వస్తువుల్ని యివ్వటంలో, ఇచ్చిన వస్తువులకు డబ్బును వసూలు చేసుకోవటంలో విపరీతమైన బిజీగా వున్నాడు షాపు యజమాని.

"ఏం కావాలి సాబ్ ? ఊరికే నిలబడి దారిని బ్లాక్ చేయకుండా ఏం కావాలో చెప్పండి..." గుమ్మంలోనే నిలబడి పోయిన షాడోని గమనించి కొంచెం కోపంగానే అన్నాడతను.

"హుజూర్ మియా కావాలి నాకు..." సమాధానం యిచ్చాడు షాడో.

"కళ్లు కొంచెం గట్టిగా తెరిచి చూడండి... మీకు కావల్సిన హుజూర్ మియాను నేనే..." మరికొంచెం కోపంగా అన్నాడతను.

"వెరీగుడ్ బ్రదర్... నీతో ఒక విషయం మాట్లాడాలి. నా కోసం ఒక పది నిముషాలు స్పేర్ చేయగలవా ?" అడిగాడు షాడో.

తన చెవుల్ని తనే నమ్మలేనట్లు విచిత్రంగా చూశాడు హుజూర్ మియా.

షాపు నిండా అంతమంది కస్టమర్స్ వుండగా, బేరాల్ని వదులుకొని అతనితో పది నిముషాలు మాట్లాడాలా ??

"రేయ్ ఎవర్రా అక్కడ? వీడెవడో మెంటల్ హాస్పిటల్ నుంచి పారిపోయి వచ్చినట్లున్నాడు... ఒక చూపు చూసుకోండి..." బిగ్గరిగా అరిచి తన పనిలో తను నిమగ్నమైపోయాడు.

అతను తప్ప ఆ షాపులో పనిచేసేవాళ్లు ఎవరూ కనిపించటం లేదు. ఎవర్ని ఉద్దేశించి అలా అరిచాడో గ్రహించటానికి ప్రయత్నిస్తూ ప్రక్కకు తిరగబోయిన షాడో మెడమీద పడింది బలిష్టమైన చేయి ఒకటి.

షాపు బయట ఫుట్‌పాత్ మీద పనీ పాటా లేకుండా, వచ్చేపోయే వాళ్ళను చూస్తూ కూర్చుని వున్నారు అరడజను మంది వ్యక్తులు.

హుజూర్ మియా అరిచిన అరుపు వినగానే గుంపుగా వచ్చి షాడోని చుట్టుముట్టారు వాళ్ళు. మెడ పట్టుకొని బర్రున రోడ్డు మీదికి లాగాడు వారిలో ఒకడు.

"హుజూర్ మియా సాబ్ మాట్లాడటానికి కూడా తీరిక లేనంత ఖంగార్లో వుంటే పిచ్చి పిచ్చి వేషాలతో ఆయన్ని చికాకు చేస్తావా ? చూడు... చూడు... బే " అంటూ లాగి పెట్టి గడ్డం కింద గుద్దాడు యింకో వ్యక్తి.

కళ్ళముందు పంచరంగుల నక్షత్రాలు ప్రత్యక్షం అవుతుండగా తూలి రోడ్డు మధ్యలో పడిపోయాడు షాడో.

"శహభాష్ భాయీ.... భలే కొట్టావ్... ఏదీ ఇంకోసారి కొట్టు చూస్తాం" ఆ దెబ్బ వేసిన వ్యక్తి ని మెచ్చుకుంటూ హుషార్ చేశారు వాళ్ళు.

పిడికిలిని సవరించుకుంటూ ముందుకు అడుగు వేశాడతను.

అక్కడితో పూర్తి గా అంతరించింది పోయింది షాడో సహనం. ఒక్క గంతులో లేచి నిలబడి విపరీతమైన వేగంతో విసిరాడు కుడిపాదాన్ని.

ఇంకోసారి అతని గడ్డం క్రింద గుద్ది మరో నాలుగు అడుగుల దూరంలో పడేయాలనుకుంటూ వస్తున్న ఆ వ్యక్తి గుండెలు చెదిరిపోయాయి.... పదిహేను

పొండ్ల ఇనుప సమ్మెట ఏదో వచ్చి మీద పడినట్లు బాధపడుతూ వెర్రిగా అరిచి విరుచుకు పడిపోయాడు.

ఆ దృశ్యాన్ని చూసి రియాక్ట్ అయ్యే అవకాశం మిగిలిన వారికి ఇవ్వలేదు షాడో. పాదం నేలకు ఆనగానే రెండు అడుగులు ముందుకు వేసి ఒకదాని వెనుక ఒకటిగా వెలువరించాడు సైడ్ కిక్స్ మరో రెండింటిని.

వీధి దద్దరిల్లి పోయేటట్లు అరిచి చెరొక ప్రక్కకు చెదిరి పోయారు ఆ వ్యక్తులు. వారి శరీరాలు నేలను తాకక ముందే మిగిలిన ముగ్గురి మీదికి జంప్ చేశాడు షాడో. తలతో పొడిచి వెనక్కి తోశాడు ఒకతన్ని. మెడలు పట్టుకొని ఒకరికేసి మరొకర్ని బలంగా గుద్దాదు మిగిలిన యిద్దర్నీ.

కన్ను మూసి కన్ను తెరిచేటంతలో జరిగి పోయిందా సంఘటన... బజార్లో నడుస్తున్న పౌరులు అసలు ఏం జరిగిందో గ్రహించేలోపుగా తల్లక్రిందులుగా పల్టీ కొట్టి షాపు మెట్ల మీదికి చేరుకున్నాడు షాడో.

"రేయ్ హుజూర్ మియా... రారా... రారా బయటికి" అని పిలుస్తూ మొదలు పెట్టాడు విధ్వంసకాండని.

"నా షాపు... నాయనోయ్ నా షాపు... నా షాపు సర్వ నాశనం అయిపోతుందిరోయ్... రండిరోయ్... ఈ మెంటల్ కేసును అవతలికి లాగండిరోయ్..." నెత్తీ నోరు కొట్టుకుంటూ వచ్చి అతనికి అడ్డుపడబోయాడు హుజూర్ మియా.

ప్రాణాల్ని అరచేతుల్లో పెట్టుకొని బయటికి పారిపోతున్న కస్టమర్స్ కాళ్ళకు అడ్డం పడకుండా ఒక ప్రక్కకు తప్పుకున్నాడు షాడో... దగ్గిరికి వచ్చిన హుజూర్ మియా నడుము పట్టుకొని కోడిపిల్లను విసిరేసినట్లు రోడ్డు మీదికి విసిరేశాడు.

"రండిరోయ్... రండిరోయ్... వచ్చి వీడి అంతు చూడండిరోయ్..." అని అరుస్తూ నేలకు కొట్టిన రబ్బరు బంతిలా లేచి నిలబడ్డాడు హుజూర్ మియా.

గింగిరాలు తిరుగుతూ వచ్చి అతని ముఖం మీద పడింది కాష్ బాక్స్... దాని వెనుకే వచ్చేసింది ఖరీదయిన సెంట్ బాటిల్స్‌ని దాచి వుంచే అద్దాల బీరువా... ఆ బీరువాను అనుసరించింది అమూల్యమైన ముత్యాల గాజులుండే అలమరా...

కక్ష కట్టినట్లు విలయతాండవం చేశాడు షాడో... కదిలించటానికి వీలున్న ప్రతి వస్తువును సగానికి విరిచి బయటికి విసిరేశాడు... కదలకుండా గోడలకు బిగించి వున్న వాటన్నిటినీ ముక్కలు ముక్కలు చేసి షాపు నిండా వెదజల్లి వెనుతిరిగాడు.

హుజూర్ మియా అరుపుల్ని ఆలకించి గుంపులు గుంపులుగా వీధిలో పోగయ్యారు అతని బంధువులు, ఆప్తులు, అనుయాయులు అనేకమంది. నిలుచోవటానికి అక్కడ చోటు లేక ఒకరి భుజాల మీద ఒకరు కూర్చున్నట్లు ఒరుసుకు నిలబడుతూ గుడ్లు అప్పగించి చూశారు ఆ విధ్వంసాన్ని.

నడుములు విరిగిపోయిన మనిషిలా సగానికి వంగి పోయిన కాష్ కౌంటర్ కిందినుంచి, షాపు షట్టర్లను క్రిందికి దించేటందుకు ఉపయోగించే ఐరన్ రాడ్‌ని పట్టుకొని వారందరి మధ్యలోకి దూకాడు షాడో.

చట్రాతి మీద కొట్టిన బిల్లపెంకుల్లా చెల్లా చెదరు అయిపోయారందరూ... గావు కేకలు పెడుతూ వెనక్కి పరుగులు తీశారు.

దగ్గర్లో దొరికిన హుజూర్ మియాను మరో రెండుసార్లు ఉతికి చేతికి అందుబాటులోకి వచ్చిన వారందర్నీ ఐరన్ రాడ్ దెబ్బలకు గురి చేస్తూ అడుగులు వేశాడు షాడో.

పది క్షణాల్లో నిర్మానుష్యమై పోయిందా వీధి... షాపుల్ని క్లోజ్ చేసుకొని అందరితో పాటు తాము కూడా పారిపోయారు వ్యాపారస్థులు అందరూ.

తనను అల్లంత దూరంలో చూడగానే విపరీతమైన భయంతో వణికిపోతూ తలుపులు మూయబోతున్న ఒక టీ బంక్ యజమానిని సమీపించి ఐరన్ రాడ్‌ని పైకి ఎత్తాడు షాడో.

"సలాం చేస్తాను సాబ్... మీ కాళ్ళు పట్టుకుంటాను... ఏదో కాసిని టీ నీళ్ళు అమ్ముకొని బతికే నిరుపేదని... పిల్లా జెల్లా బోలెడంత మంది కల పిరికివాడిని... వదిలేయండి సాబ్... నన్ను వదిలేయండి..." నిజంగానే అతని కాళ్ళు పట్టుకోవడానికి ముందుకు వంగుతూ బావురుమన్నాడు బంక్ ఓనర్.

ఐరన్ రాడ్‌ని క్రిందికి దించి అతని జుట్టు పట్టుకొని ప్రక్కకు తోశాడు షాడో.

"లేచిన తర్వాత ఇంతవరకూ ఏమీ తినలేదు... స్పెషల్ రొట్టెలు కాల్చు... మలాయ్ నిండా పంచదార కలిపి రొట్టెలతో పాటు తీసుకురా... నీళ్ళు కలపని పాలతో వేడి వేడి ఛాయ్ తయారు చేయి..." అంటూ లోపలికి పోయి ఒక టేబిల్ మీద కాళ్ళు పెట్టుకొని కూర్చున్నాడు.

ఆలస్యం చేస్తే అతని మనసు మారిపోయి మళ్ళీ ఐరన్ రాడ్‌ని అందుకుంటాడేమోనన్న భయంతో అతను కోరినవన్నీ వెంట వెంటనే సప్లయ్ చేశాడు బంక్ యజమాని.

సువాసనలు వెదజల్లుతున్న రొట్టెల మీద పంచదార కలిపిన మీగడను పెట్టి టేబిల్ మీదికి చేర్చాడు... యాలకులు కలిపి ఎర్రగా కాచిన పాలతో డబుల్ స్పెషల్ టీని తయారుచేసి రెండు కప్పుల నిండా పోసి, యిచ్చాడు.

రొట్టెల్ని తిన్నాడు షాడో... ఛాయ్ తాగాడు. రెండు పనామాల్ని కాల్చిన తరువాత బద్ధకంగా ఆవలించి వళ్ళు విరుచుకున్నాడు.

"నిద్ర వస్తున్నట్లుంది సాబ్ గారికి... రిక్షా ఏదయినా పిలవనా... రిక్షాలో మీ ఇంటికి పోయి హాయిగా నిద్ర పోతారా??" చేతులు కట్టుకొని వినయాతి వినయంగా అడిగాడు బంక్ ఓనర్.

తనను వదిలించుకోవటానికి అతను పడుతున్న ఆత్రుతను గమనించి తనలో తను నవ్వుకుంటూ తల అడ్డం తిప్పాడు షాడో.

"నిద్ర వస్తున్న మాట నిజమే భాయీ.... కాని ఇంటికి మాత్రం పోయేది లేదు. ఇక్కడే పడుకుంటాను... తిరిగి నా అంతట నేను లేచేదాకా డిస్టర్బ్ చేయద్దు..." అంటూ ఐరన్ రాడ్‌ని చేతికి అందుబాటులో పెట్టుకొని కుర్చీ వెనక్కి వాలాడు.

ఆరోజు ఉదయం లేచీ లేవగానే తను ఎవరి ముఖం చూశాడో గుర్తుకు తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ, గుడ్ల నీళ్ళు గుడ్లలోనే కుక్కుకుంటూ షాపు బయట మెట్ల మీద కూర్చున్నాడు బంక్ ఓనర్.

చూస్తుండగానే గడిచిపోయింది టైమ్... పగలు పన్నెండు గంటలు కాస్తా రెండు గంటలయింది... రెండు కూడా గడిచిపోయి నాలుగు సమీపిస్తుండగా తమ గిట్టల ధ్వనులతో ఆ ఇరుకు సందుల్ని కంపింప చేస్తూ కార్డ్‌ని లాక్కువచ్చాయి రెండు గుర్రాలు.

హోటల్‌కి వంద గజాల దూరంలో వున్నట్లుండి ఆ బండిలో నుంచి క్రిందికి దూకారు పదిమంది దృఢకాయులు. పొడుగాటి బాణా కర్రల్ని, మోటార్ సైకిల్ చైన్లను పట్టుకొని తన దుకాణం వైపు తిరిగిన వారందర్నీ చూసేసరికి ప్రాణాలు లేచి వచ్చినంత పని అయింది బంక్ యజమానికి.

అసలు ఆ గొడవ ప్రారంభం కావటానికి మూల కారకుడైన హుజూర్ మియా పగ తీర్చుకునే ప్రయత్నాలు ప్రారంభించాడు.... జరిగినదంతా అస్సాం రాష్ట్రంలోని కోస్గిల్ సిటీలో వుండే తన యజమాని గంగారాం సాబ్‌కి తెలియజేసి సహాయం తెప్పించుకున్నాడు.

అతనికి కావాల్సిన రౌడీ తన దుకాణంలోనే వున్నాడని తెలియ చేసేందుకు మెట్ల మీది నుంచి లేచి బాణంలా ఆ గుర్రపు బండి దగ్గిరికి పోయి విపరీతమైన ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు బంక్ ఓనర్.

హుజూర్ మియాకు వట్టి సహాయం పంపటంతో ఆగలేదు గంగారాం సాబ్... తనే స్వయంగా కదిలి వచ్చాడు కోస్గిల్ సిటీలోనుంచి.

"అదుగో... ఆ వస్తున్న వాడే మన వర్గానికి చెందిన ఒక టీ బంక్ ఓనర్... నన్ను నాశనం చేసిన తర్వాత అతని హోటల్లోనే దూరాడు ఆ రౌడీ... ఇంకా అక్కడే వున్నాడనిపిస్తోంది ఇతని వాలకం చూస్తుంటే..." బగ్గీ దగ్గిర నిలబడి చేతులు కట్టుకుంటూ వినయంగా చెప్పాడు హుజూర్ మియా.

గంభీరంగా తల వూపి బగ్గీలో నుంచి క్రిందికి దిగాడు, గంగారాం సాబ్.

"పదండిరా... మన ఇలాకాలోకి వచ్చి మన వాళ్ళనే హడలకొట్టిన ఆ రౌడీ ఎవరో చూడాలనిపిస్తోంది... పదండి...." అంటూ ముందుకు అడుగు వేశాడు మందగమనంతో.

మూడు జట్లుగా చీలిపోయారు అతని అనుచరులు... గంగారాం సాబ్‌కి రెండు వైపులా నడిచాయి రెండు జట్లు. ముందుగా పోయి హోటల్లోకి తొంగి చూసింది మూడో జట్టు.

"ఉన్నాడు సాబ్... లోపలే టేబిల్ మీద కాళ్ళు పెట్టుకొని గురకలు తీస్తున్నాడు..." భుజం మీది నుంచి వెనక్కి చూస్తూ రిపోర్ట్ చేశాడు ఆ జట్టులో ఒకతను.

"లోపలే వున్నాడని ఆడంగి మాటలు మాట్లాడతారేమిట్రా దొంగనాయాళ్ళలారా.... లాగండిరా బయటికి...." ఎర్రబడుతున్న ముఖంతో వేడిగా కమాండ్ చేశాడు గంగారాం సాబ్.

చేతుల్లోని ఆయుధాల్ని బిగించి పట్టుకుంటూ హోటల్లోకి దూరారు మూడో జట్టు అనుచరులు...

తల్లక్రిందులుగా పల్టీలు కొడుతూ వచ్చి రోడ్డు మధ్యలో పడ్డాడు ఒకతను. ముక్కును రెండు చేతులతో కప్పుకొని మెట్లకు అడ్డంగా వాలిపోయాడు రెండో మనిషి... లోపల భయంకరమైన బ్రహ్మరాక్షసుడు ఎవరో వున్నట్లు కంపించిపోతూ పారిపోయి వచ్చేశాడు.

"ఏమయిందిరా దొంగనాయాలా ? ఏమయిందిరా బేవకూఫ్‌కి బచ్చే ? ఎంతమంది వున్నార్రా లోపల??" ఆశ్చర్యంగా అడిగాడు గంగారాం సాబ్.

నోట మాటరాక జ్వరం వచ్చినట్లు వణికిపోసాగాడు ఆ అనుచరుడు.

"ప్రశ్న వేస్తే సమాధానం చెప్పకుండా ఏమిటి బే ఆ వణుకుడు?" కోపంగా అంటూ, పిడికిలితో అతని నెత్తి మీద గుద్దబోయి ఆఖరి క్షణంలో ఆగిపోయాడు గంగారాం సాబ్.

పోట్లాటకు దిగితే ప్రాణాలు పోయినా, అవయవాలు తెగి అవతల పడినా లెక్కచేయని బండ మొండి మనుష్యులు అతని అనుచరులు... అటువంటి వారిని అంతగా వణికించగల మొనగాడు పుట్టలేదు ఇంతవరకూ... ఒకే ఒక పర్సనాలిటీ తప్ప...

కలకత్తా నగరంలో తన వ్యాపారాల్ని చూసే హుజూర్ మియా మీద దాడి జరిగిందని విన్న దగ్గిర్నించీ అగ్గిరాముడై పోతున్న అతనిలో మొట్టమొదటిసారిగా అడుగుపెట్టింది ఆలోచన.

పెద్ద పెద్ద అడుగులు వేస్తూ హోటల్ ముందుకు పోయి, లోపలికి తొంగి చూశాడు.

"ఏం నీకు కూడా ఏమయినా కావాలా ?" టేబిల్ మీది నుంచి కాళ్ళు క్రింద పెట్టకుండానే పనామాను వెలిగించుకుంటూ ప్రశ్నించాడు షాడో.

విపరీతమైన ఆవేశంతో పూనకం వచ్చిన వాడిలా ఛెంగున ఎగిరి వెనక్కి దూకాడు గంగారాం.

"రేయ్... దొంగనాయాళ్ళలారా... అందుకోండిరా పెట్రోల్ డబ్బాల్ని... వచ్చింది ఎవరో చూడకుండా, స్వయంగా వచ్చి తన ఎదుట సామాన్యమైన మనిషిలా నిలబడిన మాగురువుగారిని గుర్తించకుండా రౌడీల్ని ఉసిగొల్పుతాడా ఈ హుజూర్

మియాగాడు... అంతటితో ఆగకుండా నాకు ఫోన్ చేసి వాడీలు చెపుతాడా! పట్టుకోండి ఆ సువ్వర్‌కీ బచ్చేగాడిని... వాడిని, వాడి పెళ్ళాం పిల్లల్ని, వాడి బంధువుల్ని, అనుచరుల్ని, అనుయాయుల్ని, వాడి ఆస్తుల్ని, అందర్నీ, అందర్నీ తగలబెట్టండి పెట్రోల్ పోసి... ఈ వాడకట్టునంతా నేల మట్టం చేయండి.... లేవండిరా... లేవండి..." ఖంగు ఖంగుమని ప్రతిధ్వనిస్తున్న కంఠంతో ఆర్డర్స్ పాస్ చేసాడు.

షాడో చేతిలో చావుదెబ్బలు తిన్న వాళ్ళు కూడా ఛెంగున లేచారు ఆ అరుపుల దెబ్బకి... పరుగు పరుగున పోయి బయటికి లాగారు గుర్రపు బగ్గీలో సిద్ధంగా తీసుకొచ్చిన పెట్రోల్ డబ్బాల్ని.

"అయ్యబాబోయ్ అపరాధం అయిపోయింది... మీ గురువుగారి ముఖం నేను ఎప్పుడూ చూడకపోవటం మూలాన జరిగిన పొరపాటు యిది... క్షమించండి గంగారాం సాబ్... నన్ను క్షమించండి..." చెవి కోసిన మేకలా అరుస్తూ వచ్చి గంగారాం పాదాల మీద వాలిపోయాడు హుజూర్ మియా.

లాగిపెట్టి తన్నాడు గంగారాం అతని ముఖం మీద.

"పొరపాటు అయిపోయిందా ? మా గురువుగారిని అవమానించటం పొరపాటు అయిపోయిందా ? అవుతుంది బే... అది ఎలా అయిందో నిన్ను తగలబెట్టిన తర్వాత చూస్తాను నేను..." అంటూ చేయి జాచాడు పెట్రోల్ డబ్బా కోసం.

డబ్బా మూత తెరిచి హుజూర్ మియా నెత్తి మీద కుమ్మరించాడు ఒక అనుచరుడు.

"వీడి పెళ్ళాం పిల్లల్ని కూడా లాక్కొస్తాం... ఈ లోపల వీడు ఒక్కడినే తగలబెడుతూ వుండనీయండి" అగ్గిపెట్టెను అతనికి అందించి ముందుకు పరిగెత్త బోయాడు.

అప్పటికే గుప్పుమంది ఆ వార్త వాడకట్టంతా.

నెత్తి నోరు కొట్టుకొని ఏడుస్తూ గుండెల్ని బాదుకుంటూ వచ్చి అగ్గిపుల్ల గీయబోతున్న గంగారాం ముందు పడిపోయారు పదిమంది ఆడవాళ్ళు... వాళ్ళ వెనుకే వచ్చి నేలమీద చతికిల పడ్డారు యాభై మంది చిన్న పిల్లలు.

"ఎవళ్ళు వీళ్ళు?" ఆశ్చర్యంగా అడిగాడు గంగారాం.

"ఈ బడుద్దాయ్ హుజూర్ మియాగాడి పెళ్ళాలు వీళ్ళు. ఈ పిల్లలందరూ వీడి సంతానమే సాబ్..." గుమికూడిన జనంలో నుంచి కొంచెం ధైర్యం చేసి ఒక అడుగు ముందుకు వేస్తూ చెప్పాడు వృద్ధుడు ఒకతను.

"ఓరి నీ జన్మ తగలబడ... ఇవాలో రేపో నీ అంతట నువ్వే చచ్చిపోయే ముసలోడికి యింతమంది పెళ్ళాలా ? ఇంతమంది సంతానమా ? వీళ్ళందరి అండ చూసుకునేనా నా గురువుగారిని అవమానించింది ??" ఆశ్చర్యం కాస్తా తిరిగి కోపం కింద కన్వర్ట్ అవుతుండగా అగ్గిపెట్టెను పైకి ఎత్తాడు.

గొల్లుమన్నారు హుజూర్ మియా పెళ్ళాలు... కీసర బాసరగా అరవటం మొదలుపెట్టారు పిల్లలు.

"చేసే పనేదో కామ్‌గా చేయడం చేతకాదా ? ఏమిటి ఈ గోల ?" హోటల్లో నుంచి బయటికి వస్తూ విసుగ్గా అడిగాడు షాడో.

"అరేయ్... ఎవర్రా అక్కడ ? గురువుగారికి చికాకుగా వుందిట... మొత్తం కట్టకట్టి అందరిమీదా పోసేయండి పెట్రోల్ని. ఒకేసారి అంటించేద్దాం అగ్గిపుల్ల..." కెనెడియన్ ఇంజన్ మాదిరి అరిచాడు గంగారాం.

ఆ పని చేయటానికి రెడీ అయిపోతున్న అతని అనుచరులకు అడ్డం పడుతూ గోల గోలగా అరిచారు హుజూర్ మియా బంధువులందరూ.

"ఆల్‌రైట్ గంగూ... ఈ ఒక్క తప్పుని క్షమించేద్దాం... ఇప్పటికయినా తెలివి తెచ్చుకొని నాకు కావల్సిన పని చేసి పెడతాడేమో కనుక్కో..." సాలోచనగా అన్నాడు షాడో.

ఆ మాట అతని నోటివెంట వెలువడిన మరుక్షణం క్రింది నుంచి లేచి అతని పాదాల దగ్గిర పడ్డాడు హుజూర్ మియా.

"చేసి పెడ్తాను... ఒక్క పనికాదు... వంద పనులయినా సరే తిండి తిప్పలు, నిద్రాహారాలు లేకుండా శ్రమించి మరీ చేసి పెడతాను... చెప్పండి బాబూ... ఏం చేయాలో అర్జంటుగా చెప్పండి" చేతులు జోడిస్తూ వేడుకున్నాడు.

లోపలికి రమ్మని సైగ చేసి తిరిగి యధాస్థానంలో కూర్చున్నాడు షాడో. పాంటు జేబులో వున్న కవర్‌ని తీసి అందులోని ఫోటోల్ని అతనికి చూపించాడు.

"ఎవరు గురూ ఈ అమ్మడు ? అందంగానే వున్నట్లు కనిపిస్తోంది... ఇంట్లోంచి అలిగి పారిపోయిందా ?" షాడో ప్రక్కన వున్న కుర్చీలో కూర్చుంటూ కామెంట్ చేశాడు గంగారాం.

ఆ మాటలు వినబడనట్లు నటిస్తూ సైంటిస్ట్ మహేంద్రనాథ్‌ని గురించి హుజూర్ మియాకు వివరించి చెప్పాడు షాడో.

"అతను పనిచేసే చోట దొరికాయి ఇవి... ఈ ఫోటోలకు అతనికి సంబంధం ఏదైనా వుందో లేదో తెలుసుకోవాలి.... ఒకవేళ వుండివుంటే ఈ అమ్మాయి అడ్రస్సులు వెంటనే నాకు కావాలి..." ఫోటోల్ని అతని చేతికి యిస్తూ చెప్పాడు.

అతను తన దగ్గరికి రాగానే గొడవ చేయకుండా అతని మాటల్ని విని వుంటే ఎంత బాగుండి వుండేదో వూహించుకొని బాధ పడుతూ నిశారుగా నిలబడ్డాడు హుజూర్ మియా.

"రేయ్ దొంగనాయాల... నీ బ్రతుకు ఈ పని సానుకూల పరచటం మీద ఆధారపడి వుంది... అడ్రస్సులు కనుక్కొస్తే జరిగిందంతా మర్చిపోతాను. పాడయిపోయిన నీ షాపును తిరిగి బాగు చేయించి యిస్తాను... తెల్ల ముఖంతో కనిపిస్తే పెట్రోల్ పోసి చంపటం చంపటమే" గుర్రుగా చూస్తూ హెచ్చరించాడు గంగారాం.

రెండోమాట మాట్లాడలేదు హుజూర్ మియా... ఫోటోల్ని పెట్రోల్ వాసన కొడుతున్న తన దుస్తుల్లో దాచుకొని బయటికి పరిగెత్తాడు. తన బంధువుల్ని, స్నేహితుల్ని అందర్నీ వెంటబెట్టుకొని అవతలికి వెళ్ళిపోయాడు.

## 5

"రేయ్... టైమ్ ఎంతయిందిరా?" ఉన్నట్లుండి ప్రక్కకు తిరుగుతూ టీ బంక్ బయట నిలబడి వున్న తన అనుచరుల్లో ఒకతన్ని ప్రశ్నించాడు గంగారాం.

"చీకటి పడిపోయింది సాబ్... తొమ్మిది గంటలు దాటి వుంటుంది..." తడుముకోకుండా సమాధానం యిచ్చాడతను.

వాళ్ళు అక్కడి నుంచి ఎప్పుడు వెళ్ళిపోతారో తెలియక, వాళ్ళు అక్కడ వుండగా తను వెళ్ళిపోవటానికి ప్రయత్నిస్తే పరిస్థితులు ఎలా వుంటాయో అర్థం కాక విపరీతమైన బెంగతో కృశించి పోతున్నాడు బంక్ ఓనర్.

అతని బాధల్ని గమనిస్తూనే వున్నాడు షాడో.

"ఆల్ రైట్ గంగూ... ఇక మనం వెళ్ళిపోదాం... హుజూర్ మియా ఎప్పుడు వస్తాడో తెలియనప్పుడు యిక్కడే కాపలా కాయటం అనవసరం..." అన్నాడు కుర్చీలో నుంచి లేస్తూ.

సంతోషం పట్టలేక నాట్యం చేస్తున్నట్లు అడుగులు వేస్తూ వారందరికీ ట్రిబుల్ స్పెషల్ టీని తయారుచేసి యిచ్చాడు బంక్ ఓనర్. రెండు గుక్కల్ని కూడా పూర్తిగా తాగకముందే గంగారాంకి బాగానచ్చింది ఆ చాయ్.

"రేయ్... జిడ్డూ... మా కోస్గిల్ వచ్చేస్తావా? నీకు బ్రహ్మాండమైన హోటల్ కట్టించి యిస్తాను... మా వాళ్ళందరికీ చాయ్ సప్లయ్ చేసే కాంట్రాక్ట్ కూడా యిప్పిస్తాను..." అన్నాడు.

వాళ్ళు అక్కడి నుంచి వెళ్ళిపోవాలని కోరుకున్నందుకు పశ్చాత్తాప పడిపోయాడు బంక్ ఓనర్. గంగారాం సాబ్ అంతటివాడు తనను కోస్గిల్ రమ్మనమని పిలిచాడంటే తన మీద ఎంత మంచి అభిప్రాయం వుండి వుండాలి??

"ఎందుకు సార్ లేచారు ? కూర్చోండి సార్... హుజూర్ మియా వచ్చేదాకా మీరు ఎక్కడికీ వెళ్ళద్దు. ఇక్కడే వుండాలి...." లేచి నిలబడిన షాడోని బలవంతంగా కుర్చీలో కూర్చోబెడుతూ అన్నాడు.

రాత్రి పన్నెండు గంటల ప్రాంతంలో పరుగు పరుగున బంక్ లోకి వచ్చేశాడు హుజూర్ మియా.

మూడు టేబిల్స్‌ని దగ్గిరికి లాగించి వాటి మీద పడక వేశాడు షాడో. గాఢ నిద్రలో వున్నాడు.

అతనికి నాలుగు అడుగుల దూరంలో కూర్చుని శబ్దం చేయొద్దని సైగ చేశాడు గంగారాం.

"ఎన్నో రోజుల్నించి నిద్ర లేకుండానే తిరిగితే తప్ప యిలా కనిపించిన ప్రతి ప్రదేశంలోను పడక వేయడు మా గురువుగారు... నిద్రాభంగం కావించకుండా మాట్లాడు... గొంతు పెద్దది చేశావంటే దొంగనాయాల నీ నాలుక కత్తిరించేస్తాను" తర్జని చూపిస్తూ బెదిరించాడు.

"సైంటిస్ట్ మహేంద్రనాథ్ పెళ్ళి పెటాకులు లేని బ్రహ్మచారి అని మీ గురువుగారు అన్న మాట నిజమే కాని, మరీ అంత అమాయకుడు కాదు గంగారాం సాబ్ అతను.... ఇరవై రెండు సంవత్సరాల క్రితం చరాస్ గల్లీలో వుండే ఒక కాబరే డాన్సర్‌తో ప్రేమాయణం సాగించి ఒక ఆడపిల్లను కన్నాడు... కాన్పు కష్టం అయి ఆ డాన్సర్ చనిపోయిందిట... ఆ పిల్లను ఎవరికీ తెలియకుండా మిడ్నాపూర్‌లో వున్న వెల్‌ఫేర్ హాస్టల్లో చేర్పించి పెంచుతున్నాడు... ఇప్పుడు ఆ అమ్మాయి డాక్టర్ చదువు చదువుతోందిట అక్కడే..." లోగొంతుకతో తను తన వారందరూ కలకత్తా నగరమంతా కలియ తిరిగి తెలుసుకు వచ్చిన సమాచారాన్ని వినిపించాడు హుజూర్ మియా.

పడుకోవటం అయితే పడుకున్నాడు గాని, నిద్ర పోవటం లేదు షాడో, హుజూర్ మియా మాటలన్నీ క్లియర్‌గా వినిపించాయి అతనికి.

తమ సి.ఐ.బి. సిబ్బందిగాని, స్పెషల్ బ్రాంచ్ డిటెక్టివ్స్ గాని అంతవరకూ కనిపెట్టలేక పోయిన ఆ రహస్యాన్ని అతను అంత త్వరగా తెలుసుకు రావటంలో ముచ్చట వేసిందతనికి.

"మనిషి వట్టి లఫూట్ అయినా, పని మాత్రం బ్రహ్మాండంగా వుంది గంగూ... ఇతన్ని నీ ఏజెంట్‌గా యిక్కడ వుంచటంలో తప్పు ఏమీ లేదు... ఇతని సామర్థ్యం నాకు నచ్చింది" టేబిల్స్ మీది నుంచి లేస్తూ అన్నాడు.

"పోరా దొంగనాయాల... పోయి ఇక నుంచీ మన వ్యాపారాల్లో నీకు రావాల్సిన కమీషన్ కాక అదనంగా ఇంకా ఐదు పర్సంట్ తీసుకో... మా గురువుగారి దృష్టిలో సమర్థుడవని అనిపించుకోవటం నీ అదృష్టం. పోయి ఖుషీ చేసుకో" పాంటు జేబులో నుంచి పెద్ద నోట్ల కట్టను తీసి అతని మీదికి విసురుతూ అన్నాడు గంగారాం.

అంతకు ముందే తను అతని చేతుల్లో మృత్యువుకు అత్యంత సమీపంలోకి పోయిన మాటను మరిచిపోయి వంగి వంగి సలాంలు చేశాడు హుజూర్ మియా.

"మీరు రావాల్సిన అవసరం లేదు సాబ్... ఎప్పుడయినా, ఏ సమయంలోనైనా కాకితో కబురు పంపించండి చాలు... క్షణాల మీద నేనే వచ్చేస్తాను... వస్తాను సాబ్... వస్తాను..." అంటూ వీధిలోకి పరిగెత్తి అదృశ్యం అయ్యాడు.

"ఏం చేద్దాం గురూ ఇప్పుడు ?" షాడోతో పాటు హోటల్ బయటికి బయలుదేరుతూ అడిగాడు గంగారాం.

"ముందు నీ చంచాల్ని పంపించేయ్... మందీ మార్బలంతో బయలుదేరితే మొదటికే మోసం వస్తుంది..." అన్నాడు షాడో.

క్షణాల మీద డిస్పర్స్ చేసేశాడు గంగారాం తన చంచాల్ని.

"పొండిరా వెధవల్లారా... పోయి మన వూరికి చేరుకోండి" అని ఆర్డర్స్ యిచ్చి షాడో వెనుకగా అడుగులు వేశాడు.

సూటిగా మెయిన్ రోడ్డు మీదికి దారి తీసి, ఒక టాక్సీని పిలిచాడు షాడో. అక్కడి నుంచి వన్‌టవున్‌లో వున్న పెద్ద బస్ డిపోను చేరుకున్నాడు.

"యువార్ లక్కీ సార్... ఇంకో గంటలో బయలుదేరుతుంది మిడ్నపూర్ పోయే ఎక్స్‌ప్రెస్ బస్సు ఒకటి... వెయిటింగ్ రూమ్‌లో కూర్చోండి..." అతని ప్రశ్నను వినగానే సమాధానం యిచ్చాడు రిసెప్షన్ కౌంటర్లో కునికి పాట్లు పడుతున్న క్లర్క్.

వెయిటింగ్ రూమ్‌లో కూర్చున్నాడు షాడో... గంగారాంని పంపించి సిగరెట్లు తెప్పించుకొని బస్ వచ్చే దాకా వెయిట్ చేశాడు.

తెల్లవారిన తరువాత నాలుగు గంటలు ప్రయాణం చేసి పదకొండు గంటల ప్రాంతంలో వారిని మిడ్నపూర్‌లో దించింది ఆ ఎక్స్‌ప్రెస్ బస్.

బస్‌స్టేషన్‌లో వున్న ఒక టెలిఫోన్ బూత్ లోకి పోయి డైరెక్టరీలో వెల్‌ఫేర్ హాస్టల్ అడ్రస్ సంపాదించాడు షాడో. టాక్సీలు దొరక్కపోవటం వల్ల ఒక గుర్రపు బండిలో అక్కడికి పోయారు.

"సైంటిస్ట్ మహేంద్రనాథ్ గారి అమ్మాయా ? అటువంటి వాళ్ళు ఎవరూ యిక్కడ లేరే !!" ఆశ్చర్యంగా అన్నాడు హాస్టల్ వాచ్‌మన్.

జేబులోనుంచి ఒక కరెన్సీ నోటును తీసి, హుజూర్ మియా దగ్గిర్నించి తిరిగి తీసుకున్న ఫోటో ఒకదాన్ని నోటుతో పాటు అతనికి అందించాడు గంగారాం.

"ఓ! ఈ అమ్మాయా... ఈమె పేరు వాసవి... మెడిసిన్ చదువుతోంది... పొద్దున్నే కాలేజికి పోయింది" నోటును దాచేసుకొని ఫోటోని అతనికి యిస్తూ చెప్పాడు వాచ్‌మన్.

కాలేజి ఎక్కడ వుందో తెలుసుకొని గుర్రపు బండిని అటుకేసి పోనీయమని టాంగావాలాకు చెప్పాడు గంగారాం.

అరగంట తరువాత మెడికల్ కాలేజి ముందు టాంగా దిగి, తను లోపలికి పోయాడు.

"వాసవి కోసం వచ్చారా ? గమ్మత్తుగా వుందే! ఇప్పుడే ఎవరో బంధువులు వచ్చి ఆమె ఫాదర్ రైల్వేస్టేషన్‌లో వెయిట్ చేస్తున్నారని వెంట బెట్టుకు పోయారు... ఇప్పుడే.. యింతకు ముందే బయటికి పోయింది ఒక నీలం రంగు ఫియట్ కారు... మీకు ఎదురుపడే వుంటుంది..." వాసవి కోసం అతను చేస్తున్న ఎంక్వయిరీలను గమనించి చెప్పింది ఒక స్టూడెంట్.

గేటు దాటి లోపలికి వస్తుండగా ఆమె చెప్పిన ఫియట్ రైల్వేస్టేషన్ వైపు పోవటాన్ని గమనించి వున్నాడు గంగారాం. క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెనుతిరిగి టాంగా దగ్గిరికి వచ్చేశాడు.

"ఏమయింది గంగూ... వాసవి కనిపించలేదా ?" అని ప్రశించబోయి అతని ముఖంలోని భావాల్ని గమనించాడు షాడో. ప్రశ్నను తనలోనే అదుముకుని కామ్ అయిపోయాడు.

"తొందరగా పోనీ... మన ముందు నీలం రంగు ఫియట్ ఒకటి స్టేషన్ వైపు వెళ్ళింది... దాన్ని క్రాస్ చేస్తే వందరూపాయలు యిస్తా..." టాంగావాలాతో అన్నాడు గంగారాం.

నాలుగు కాళ్ళ మీద సవారి చేయించాడు టాంగావాలా తన గుర్రాన్ని... అడ్డు వచ్చిన వెహికల్ డ్రయివర్స్‌ని, మనుషుల్ని ఘాటయిన పదాలతో యిష్టం వచ్చినట్లు తిడుతూ పది నిమిషాల్లో స్టేషన్‌ని చేరుకున్నారు.

టాంగా పూర్తిగా ఆగకముందే క్రిందికి దూకి స్టేషన్ ఎదురుగా వున్న టాక్సీస్టాండ్ వైపు పరిగెత్తాడు గంగారాం.

రెండు నిముషాల తరువాత లభించింది అతని ప్రశ్నలకు సమాధానం.

"బ్లూ కలర్ ఫియటేనా సార్? అదిగో ఆ రోడ్డు మీదుగా సిర్సిలా సిటీవైపు వెళ్ళిపోయింది... స్టేషన్‌కి అటువైపున వున్న బంక్‌లో పెట్రోల్ పోయించుకుని మరీ పోయింది..." తను దాన్ని గుర్తు పట్టుకోవటానికి కారణాన్ని వివరిస్తూ చెప్పాడు ఒక టాక్సీ డ్రయివర్.

"సిర్సిలా సిటీకేనా? ఎంతసేపు సార్? గంటలో తీసుకుపోతాను... ఈ కాస్త దూరానికి మీరు టాక్సీలు ఎక్కటం దేనికి సార్? నా టాంగా ఏమయిపోయిందట?" వాళ్ళు టాంగాను వదిలి టాక్సీని మాట్లాడుకుందామని అనుకోవటం విని కోపంగా అన్నాడు టాంగావాలా. వారి సమాధానం కోసం ఎదురు చూడకుండా కొరడాతో గుర్రాన్ని కొట్టి ముందుకు దూకించాడు టాంగాని.

రోడ్డుమీది గతుకుల్లో పడి తల్లక్రిందులయ్యేంత పనిచేస్తూ వేగంగా ప్రయాణం ప్రారంభించిన ఆ టాంగాలో ప్రాణాన్ని అరచేతుల్లో పెట్టుకొని కూర్చున్నారు షాడో, గంగారాం.

"ఫియట్‌ని పట్టుకుంటే వంద రూపాయలు యిస్తానని అనటం పొరపాటు అయింది. ఆ వంద కోసం ఇప్పుడు మన నడుములు విరగగొట్ట బోతున్నాడు వీడు... టాంగా దిగిన తర్వాత తోడు లేకుండా నడవలేము... నాకు తెలుసు..." తను చేసిన పొరపాటును తలుచుకొని వాపోయాడు గంగారాం.

రోడ్డుకు అటూ ఇటూ వున్న చిట్టి పొదల్ని, కొండ గుట్టల్ని చూడటంలో నిమగ్నమై వున్నాడు షాడో. క్రింద పడిపోకుండా టాంగా ప్రక్కన అమర్చి వున్న ఇనుప కమ్మీలను పట్టుకొని ముంగాళ్ళ మీద కూర్చున్నాడు.

అరగంట తర్వాత అతని దృష్టిని ఆకర్షించింది ఒక దృశ్యం.

"టాంగాను ఆపించు గంగూ... క్విక్..." అంటూ కమాండ్ చేసి టాంగా ఆగక ముందే క్రిందికి దూకేశాడు.

ఎందుకలా కమాండ్ చేశాడో అడగలేదు గంగారాం... టాంగాను ఆపించి తను కూడా క్రిందికి దూకాడు.

దూకిన వెంటనే అతనికి కనిపించింది, రోడ్డు ప్రక్కన చిట్టి పొదల మధ్యలో వున్న పెద్ద బంగ్లా...

ఏ కారు కోసం వాళ్ళు బయలుదేరారో, ఆ నీలం రంగు ఫియట్ కారు ఆ బంగ్లా ముందు ఆపి వుంది.

# 6

వెంటనే జేబులో నుంచి పైకం తీసి టాంగా అద్దె చెల్లించేశాడు గంగారాం. ఇచ్చిన మాట ప్రకారం ఒక వంద ఎగస్ట్రాగా ముట్టచెప్పాడు.

"తొందర ఏమీ లేదు సార్... మీ పని పూర్తి చేసుకు రండి. నేను ఇక్కడే వుంటాను... నా గుర్రానికి కాస్తంత పచ్చికను రుచి చూపిస్తూ మీ కోసం ఎదురు చూస్తాను" గుర్రం కళ్ళేలను పట్టుకొని రోడ్డుకు ఆవలి ప్రక్కన వున్న పొదల్లోకి తీసుకుపోతూ చెప్పాడు టాంగావాలా.

"ఇంకో వంద కాజేయటానికి వేస్తున్నాడు ఎత్తు... చూడగా చూడగా వీడు సామాన్యుడిలా కనిపించటం లేదు" షాడోతో అంటూ, బంగ్లా వైపు అడుగులు వేశాడు గంగారాం.

రోడ్డుకు రెండు వందల గజాల దూరంలో వున్నది ఆ బంగ్లా. దాని సమీపంలోకి పూర్తిగా పోకముందే ఒక పెద్ద పొద చాటునుంచి వారి ముందు ప్రత్యక్షం అయ్యారు ఇద్దరు ఆజానుబాహులు.

"సిర్సిలా పట్టణం పోతూ వుండగా దురదృష్టవశాత్తు మా టాంగా ఇరుసు విరిగిపోయింది... కాస్సేపు విశ్రాంతి తీసుకుందామని వచ్చాం... వీలయితే మీ కార్లో కాస్తంత లిఫ్టు యిస్తారేమో అడుగుదామని కూడా అనుకుంటున్నాం..." వారిని చూడగానే గబగబా చెప్పేశాడు గంగారాం.

"లిఫ్టు లేదు గిఫ్టు లేదు, మర్యాదగా అవతలికి పొండి... ఇక్కడికి ఎవరూ రాకూడదు... పొండి... పొండి..." రఫ్‌గా తిరస్కరించాడు వారిలో ఒకతను అతని విన్నపాన్ని.

"లిఫ్టు ఇవ్వకపోతే పోయారు. కాస్సేపు విశ్రాంతి కూడా తీసుకోనీయరా?" పట్టిన పట్టు వదలకుండా రెట్టించాడు గంగారాం.

"మంచి మాటలు చెపితే మీకు అర్థం కావటం లేదనుకుంటాను... పోతారా పోరా..." కోపంగా అంటూ రెండు అడుగులు ముందుకు వేశాడు ఒకతను.

అతని చేయి తన వంటి మీద పడకముందే తల వంచి బలంగా గుద్దాడు గంగారాం అతని గుండెల మీద. వెనక్కి తూలుతున్న అతన్ని అమాంతం గాలిలోకి ఎత్తి రెండో వ్యక్తి మీదికి విసిరేశాడు.

అదిరిపడి వెనక్కి దూకబోతూ, వేగంగా వచ్చి మీద పడిన సహచరుడి బరువుకు వెల్లికిలా నేలమీద పడ్డాడతను.

తిరిగి లేచి నిలబడే అవకాశం వారిద్దరికీ యివ్వలేదు షాడో. బూటు కాలిని వెనక్కి లాగి ఫెడీ ఫెడీమని తన్నాడు రెండుతన్నులు వారి కణతల మీద. బాధగా అరవబోయారు యిద్దరూ. అరుపులు నోటిని దాటక ముందే స్పృహ కోల్పోయి తలలు వాల్చేశారు.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఫియట్‌ని దాటి బంగ్లా ముఖద్వారం ముందుకు పోయారు స్నేహితులు యిద్దరూ.

ఎప్పుడో పురాతన కాలంలో ఎవరో రాజులు కట్టించుకున్న కట్టడం అది... ఆలనా పాలనా చూసేవాళ్ళు లేక పోవటం వల్ల దర్వాజాలు, తలుపులు కిటికీ వూచలు అన్నీ మాయం అయిపోయాయి...

గబ్బిలాల వాసనతో బోసిగా కనిపిస్తున్నాయి లోపలి గదులు... చెత్తా చెదారంతో అసహ్యకరంగా అగుపిస్తున్నది ఫ్లోర్.

అడుగులో అడుగు వేస్తూ ఒకరి వెనుక ఒకరుగా రెండు గదుల్ని దాటారు షాడో, గంగారాం.... మూడో గది ముందుకు పోతుండగా కనిపించింది వారికి వాసవి.

* * * * *

కాళ్ళు చేతులు కట్టివేసి కుర్చీ వంటి పెద్ద రాతి దిమ్మ మీద కూర్చోబెట్టబడి వున్నదామె. విపరీతమైన భయం నిండిన కనులతో చుట్టూ చూస్తూ తల అడ్డం తిప్పుతోంది.

ఆమె ఎదుట నిలబడి వున్నాడు సన్నగా పొడుగ్గా వున్న వ్యక్తి ఒకతను.... వెనుక ప్రక్కన నిలుచుని ఆమె జుట్టును పిడికిట్లో పట్టుకొని మెలిపెడుతున్నాడు ఇంకో వ్యక్తి ... వారిద్దరికీ కొంచెం ఇవతలగా వింత చూస్తున్నారు మరో ఇద్దరు.

"దొంగనాయాళ్ళు.... మనకంటె రెండు అడుగులు ముందే వున్నారు... చూస్తావేమిటి గురూ చెమడాలు ఎక్కతీద్దాం..." అంటూ ముందుకు దూకబోయిన గంగారాం నోటిని గట్టిగా మూసి గబగబా ఒక గోడ చాటుకు లాగేశాడు షాడో.

"ఎమిటి గురూ ? ఏమయింది? ఎందుకు అంత భయం ??" ఆశ్చర్యంగా చూస్తూ లోగొంతుకతో అడిగాడు గంగారాం అతన్ని.

"చెమడాలు ఎక్కతీసే మొనగాడివి బయలుదేరావ్ కానీ, వాళ్ళు ఎవరో తెలుసా ? వాళ్ళ ముఖాల్ని సరిగ్గా చూశావా ?" అవసరం అయితే అతని నోటిని మరోసారి మూయటానికి సిద్ధం అవుతూ అన్నాడు షాడో.

అయోమయంగా చూసి తల అడ్డం తిప్పాడు గంగారాం... గోడ వెంబడి మెల్లిగా పాకి మరోసారి ఆ గదిలోకి తొంగిచూసి ఈసారి తనకు తానుగా ఎగిరి దూకాడు ఇవతలికి.

"అయ్యబాబోయ్... పప్పులో కాలు వేశాం... మనం అనుకున్నట్లు వేరే మనుష్యులు కాదు వీళ్ళు.... స్పెషల్ బ్రాంచి డిటెక్టివ్‌లు..." ఆశ్చర్యాన్ని అణుచుకోవటానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

తను కలకత్తా బయలుదేరే ముందు కులకర్ణిగారు చేసిన హెచ్చరికలు చెవుల్లో మార్మోగుతుండగా, గాఢంగా నిట్టూర్చి తల విదిలించాడు షాడో.

"యాంగ్ చీ ఎందుకు మన దేశంలోకి అడుగు పెట్టాడో తెలుసుకోవటం వరకే పరిమితమై వుంది మన ఎసైన్మెంట్... సైంటిస్ట్ మహేంద్రనాథ్ లేబరేటరీని నాశనం చేసింది అతనేనని తగిన సాక్ష్యం లభించిన మరుక్షణం, అతను మహేంద్రనాథ్ కోసమే మన దేశంలోకి వచ్చినట్లు తేటతెల్లం అవుతుంది. ఆ విషయం స్పెషల్ బ్రాంచికి తెలియచేయటంతో ముగిసిపోతుంది మన బాధ్యత..." రైల్వేస్టేషన్‌కి వచ్చి హౌరాకి పోయే ఎక్స్‌ప్రెస్‌ని ఎక్కిస్తూ చెప్పారాయన.

"మరి నా మీద జరిగిన హత్యా ప్రయత్నం మాట ఏమిటి? అది కూడా యాంగ్ చీ ఘనకార్యమే అంటున్నారు మనవాళ్ళు... ఆ విషయాన్ని మరిచిపోయి ఆ బాస్టర్డ్‌ని వదిలిపెట్టి వెనక్కి వచ్చేయనా?" అడిగాడు తను.

రెండు నిముషాల దాకా సమాధానం యివ్వలేదు కులకర్ణిగారు ఆ మాటలకు.

"నథింగ్ డూయింగ్ రాజూ.... నీ మీద జరిగిన అఘాయిత్యాన్ని గురించి ప్రస్తుతానికి మర్చిపో... యాంగ్ చీనే ఈ పనులన్నిటికీ కారకుడని తెలియగానే వెనక్కి వచ్చేయ్... మిగిలిన విషయాలు నేను చూసుకుంటాను... " తన పద్ధతిని మార్చుకోకుండా మొండిగా అన్నారాయన.

లేబరీటరీలో కాంక్రీట్ అచ్చు క్రింద దొరికిన ఎలక్ట్రానిక పరికరం, ఆ పని చేసింది యాంగ్ చీ అనే తెలియచేస్తోంది... మహేంద్రనాథ్ అదృశ్యం కావటానికి కారకుడు కూడా అతనేనని నిరూపిస్తోంది.

తన బాధ్యత ముగిసిపోయింది ఆ విషయాన్ని గమనించిన మరుక్షణం... కులకర్ణిగారి వద్దకు వెళ్ళి రిపోర్ట్‌ని సబ్‌మిట్ చేసి చేతులు దులుపుకోవచ్చు... కాని, అనుకోకుండా దొరికిన ఫోటోలు తనలో కుతూహలాన్ని రేకెత్తించాయి... మహేంద్రనాథ్ చుట్టూ అలుముకొని వున్న మిస్టరీని సాల్వ్ చేయాలనే కోరికను కలిగించాయి.

తన మాదిరిగానే పట్టిన పట్టు వదలకుండా అతని గత జీవితాన్ని తిరగతోడి, అతని కూతురు జాడల్ని పసికట్టారు స్పెషల్ బ్రాంచివాళ్ళు... వాళ్ళ బాధలు ఏవో వాళ్ళను పడనీయకుండా ఇప్పుడు తను కల్పించుకుంటే కులకర్ణిగారి చేతిలో తిట్లు తినటం గారెంటీ... చూస్తూ చూస్తూ ఆ రొంపిలోకి అడుగుపెట్టి, ఆ తరువాత బాధ పడటం దేనికి?

"కమాన్ గంగూ... ఇక్కడ వుండకూడదు మనం... మన చేతుల్లో దెబ్బలు తిన్నవాళ్ళు లేచి కూర్చుంటే అనవసరంగా బద్‌నామ్ అయిపోతాం..." అంటూ వెనుతిరిగి బంగ్లా బయటికి వచ్చేసాడు షాడో.

ఇష్టం లేకపోయినా ఎదురు చెప్పకుండా అతన్ని అనుసరించాడు గంగారాం. ఫియట్ దగ్గిర పడివున్న వారిద్దర్నీ జాగ్రత్త గా ఎత్తి కారులో పడుకోబెడుతూ షాడో వెనుకే రోడ్డును ఎక్కాడు.

అవతలి ప్రక్కన వున్న చిట్టి పొదల్లో కూర్చుని తన గుర్రాన్ని మేపుకుంటున్నాడు టాంగావాలా...

"అయిపోయిందా సాబ్ మీ పని ? పోదామా ఇక ??" అని అడుగుతూ గుర్రాన్ని పట్టుకొని లాగాడు.

పళ్ళు అన్నీ కనబడేటట్లు నోరు తెరిచి పెద్ద పులిలా అతని మీదికి దూకిందది. ముందు కాళ్ళకు అతను అందక పోయేసరికి గిర్రున వెను తిరిగి లాగిపెట్టి తన్నింది వెనుక పాదాలతో...

ఆఖరి క్షణంలో నేర్పుగా వెనక్కి దొర్లి వజ్రాయుధాల వంటి ఆ గిట్టల్ని తప్పించుకున్నాడు టాంగావాలా.

"పచ్చిగడ్డి తిని చాలాకాలం అవటం వల్ల మకురుతనం చూపిస్తోంది సాబ్... దీని తిక్కను ఎలా వదిలించాలో నాకు తెలుసు... మీరు ఫికర్ చేయకుండా టాంగా దగ్గిరికి పదండి..." మెడకు చుట్టుకున్న కొరడాను చేతుల్లోకి తీసుకుంటూ అన్నాడు.

టాంగావాలా వంక గుర్రుగా చూస్తూ ఆవురావురమని పచ్చిగడ్డిని కొరుకుతున్న ఆ మూగ ప్రాణాన్ని చూసేసరికి మారిపోయింది షాడో మనస్సు.

"ఇట్సాల్ రైట్ మై ఫ్రెండ్... అర్జంటుగా పోయి అటెండ్ కావాల్సిన పనులు ఏవీ యిప్పుడు మాకు లేవు. ఇంకో అరగంట ఆగి బయలుదేరుదాం. మరేం పరవాలేదు" అంటూ సిగరెట్‌ని వెలిగించుకొని, అక్కడ కనిపించిన ఒక బండరాయి మీద కూర్చున్నాడు.

"చచ్చీ చెడీ యింత దూరం వచ్చి, ఆ అమ్మడితో ఒక్కమాట కూడా మాట్లాడకుండా యిలా వచ్చేయటం నాకు నచ్చలేదు గురూ..." అంటూ అతని ప్రక్కనే చతికిలపడబోయి, అప్రయత్నంగా బంగ్లావైపు చూశాడు గంగారాం.

అతనే కాదు, షాడో, టాంగావాలా, ఆఖరికి ఆబగా పచ్చిగడ్డిని కొరుకుతున్న గుర్రం అందరూ చూశారు అటుకేసి...

"ఏమిటి సాబ్ అది ? దీపావళి పండగ యింకా చాలా రోజులు వుంది గదా... ఇప్పటి నుంచే టపాకాయలు మోగిస్తున్నారేమిటి ఆ భూత్ బంగ్లాలోని వాళ్ళు!!" ఆశ్చర్యంగా కామెంట్ చేశాడు టాంగావాలా.

అతని మాటలు పూర్తి కాక ముందే వెంట వెంటనే వినవచ్చిందా శబ్దం ఇంకోసారి.

ఆ పైన ఆలస్యం చేయలేదు షాడో. అవి టపాకాయల శబ్దాలు కాదనీ పాయింట్ ఫార్టీఫోర్ కాలిబర్ రివాల్వర్ ఏదో బంగ్లాలో మారణ కాండను సాగిస్తోందనీ టాంగావాలాకు చెప్పకుండా వింటి నుంచి వెలువడిన బాణంలా పరిగెత్తాడు అటుకేసి.

"ఈ బుద్ధి ఇందాకే వుంటే బాగుండేది కదా! ఈ షటిల్ సర్వీస్ ఖర్మ తప్పేది కదా!!" అంటూ అతన్ని క్లోజ్‌గా ఫాలో అయ్యాడు గంగారాం.

బంగ్లా ముందున్న మొండి ద్వారాన్ని దాటి లోపలి గదుల వైపు తిరుగుతూ వుండగానే ఎదురయ్యారు షాడోకి ఇద్దరు దృఢకాయులు.

నీటిలో నుంచి బయటపడేసిన చేపలా కొట్టుకుంటున్న వాసవిని గట్టిగా పట్టుకొని బయటికి పరిగెత్తుకు వస్తున్నారు.

హఠాత్తుగా ఎదుట ప్రత్యక్షం అయిన షాడోని చూడగానే తన చేతిలోని రివాల్వర్‌ని పైకి ఎత్తాడు ఒకతను.

పరుగు వేగాన్ని తగ్గించకుండా పల్టీ కొట్టి గాలిలోకి ఎగిరాడు షాడో... ధన్‌మని గర్జించిందా రివాల్వర్.

చటుక్కున ప్రక్కకు దూకి ఆ బుల్లెట్ బారిన పడకుండా తను కూడా తప్పించుకున్నాడు వెనుకే వస్తున్న గంగారాం.

ఆ దృఢకాయుడికి నాలుగు అడుగుల దూరంలో నేలను తాకాడు గాలిలోకి ఎగిరిన షాడో. తాకుతూనే బూటుకు బిగించి వున్న డాగర్‌ని బయటికి లాగి బలంగా దూశాడు గాలిలోకి.

రివాలవర్‌ని అతని కేసి తిప్పటానికి ప్రయత్నించాడా వ్యక్తి.

అదే అతను చేసిన తప్పు...

సూటిగా డాగర్ దారిలోకి జరిగిందా రివాల్వర్‌ని పట్టుకుని వున్న చేయి. మణికట్టు మీద అంగుళం లోతు గాయం ఏర్పడుతుండగా రివాల్వర్‌ని వదిలేసి వెనక్కి జరిగింది.

అదే సమయంలో ఇంకో యాంగిల్‌లో ఎటాక్ చేసాడు షాడో... డాగర్‌ని అలాగే బిగించి పట్టుకొని ఎగిరి తన్నాడు అతని గుండెల మీద.

ఆవలించటానికన్నట్లు నోటిని తెరిచి వెనక్కి తూలాడాతను... ఒక గోడను గుద్దుకుని నేలమీద చతికిలపడ్డాడు.

అతను వదిలేసిన రివాల్వర్‌ని అందుకుంటూ రెండో దృఢకాయుడి వైపు తిరిగాడు షాడో.

అప్పటికే అయిపోయిందా వ్యక్తి పని.... షాడో మాదిరిగా సున్నితమైన టెక్నిక్స్ ఏవీ ప్రయోగించలేదు గంగారాం. మోటుగా పోయి అతని జుట్టు

పట్టుకున్నాడు. అతను తన గుండెల మీద కొడుతున్న దెబ్బలనన్నిటినీ భరిస్తూ మోకాలితో డొక్కలో పొడిచాడు.

ఆ బాధను భరించలేక వాసవిని వదిలి పెట్టేశాడా వ్యక్తి. అది చాలు గంగారాంకి... వెంటనే అతన్ని ఒక గోడ దగ్గరికి నెట్టి, తపీ తపీమని ఆ గోడకేసి కొట్టాడు అతని తలను...

రెండు దెబ్బలు తగిలేదాకా తట్టుకోగలిగాడతను... మూడో దెబ్బకు కళ్ళు తేలవేశాడు. నాలుగో దెబ్బ కూడా పడేసరికి తెలివి తప్పి క్రిందికి వాలిపోయాడు.

అతని చేతులు తనను వదలగానే ముందుకు పరిగెత్తబోయి క్రింద పడిపోయింది వాసవి.

"ఇట్సాల్‌రైట్ బేబీ... ఇట్సాల్ రైట్... నువ్వు ఖంగారు పడాల్సిన అవసరం లేదు... ఎవ్రీ థింగ్ యీజ్ క్వయిట్ ఆల్‌రైట్..." అంటూ ఆమె భుజాలు పట్టుకొని నెమ్మదిగా లేవతీశాడు షాడో.

అదురుతున్న పెదవుల్ని మునిపళ్ళతో నొక్కి పట్టుకుంటూ, నీరు నిండిన కళ్ళను అతనికేసి తిప్పింది వాసవి... సూటిగా అతని ముఖంలోకి చూస్తూ తల వాల్చేసింది.

గోడకు ఆనుకొని కూర్చుండిపోయిన మొదటి దృఢకాయుడి దగ్గిరికి పోయి, అతని తలను కూడా గోడకేసి కొట్టబోతూ, అతని దుస్తుల్లో నుంచి జారిపడిన పాకెట్ రేడియో వంటి వస్తువును ఒకదాన్ని చూసి ఆశ్చర్యంగా విజిల్ వేశాడు గంగారాం.

"ఇదేమిటో క్రింద పడింది గురూ... విచిత్రంగా కనిపిస్తోంది..." అంటూ ముందుకు వంగి దాన్ని చేతుల్లోకి తీసుకోబోయాడు.

తల వాల్చేసిన వాసవిని పొదివి పట్టుకొని లోపలి గది కేసి కదలబోతున్నాడు షాడో. అతని మాటలు విని ఆ వస్తువు కేసి చూశాడు.

ఛలిగాలి వీచినట్లు జలదరించింది అతని శరీరం... కత్తుల్లా లేచి నిలబడ్డాయి మెడ మీది వెంట్రుకలు.

"మైగాడ్... గెట్ బాక్ గంగూ... గెట్ బాక్..." అని హెచ్చరిస్తూ గిరుక్కున వెనుతిరిగి బయటికి పరుగు తీశాడు వాసవితో పాటు.

ముందుకు జాచిన చేతిని వెనక్కి లాక్కుని అతని వెనుకే నాగులు అంగల్లో బయటికి వచ్చేశాడు గంగారాం.

బంగ్లాముందే నిలబడి వున్న ఫియట్‌ని దాటి పాతిక అడుగుల దూరం కూడా వారు పోక ముందే చెవులు చిల్లులు పడే శబ్దంతో బ్రద్దలై పోయింది ఆ పాడు పడిన భవంతి.

భూకంపం వచ్చినట్లు అదిరిపోయింది దాని చుట్టూ వున్న నేల... పెచ్చులు పెచ్చులుగా గాలిలోకి లేచి వర్షం కురిసినట్లు నలుదిక్కులకు వెదజల్లబడ్డాయి భవనం యొక్క అవశేషాలు.

కన్ను మూసి కన్ను తెరిచేటంతలో రాళ్ళ గుట్టగా మారిపోయిన ఆ బంగ్లాలోని స్పెషల్ బ్రాంచి డిటెక్టివ్స్‌ని తలుచుకునే సరికి వికలమై పోయింది షాడో అంతరంగం.

"నువ్వు అనవసరంగా బాధ పడకు గురూ... ముందు చూపేగాని వెనుక చూపు సరిగా లేని వాళ్ళ గతి ఎప్పుడూ అంతే అవుతుంది... వాళ్ళని గురించి పట్టించుకోకుండా ఇక జరగాల్సింది ఏమిటో ఆలోచించు..." మీద పడిన దుమ్ము ధూళిని వదిలించుకుంటూ ప్రాంప్ట్ చేశాడు గంగారాం.

ప్రేలుడు అదటుకు దానంతట అదే వెనక్కి జరిగి ఒక పల్లపు ప్రదేశంలోకి దొర్లింది ఫియట్ కారు... అందులోని వ్యక్తులు మాత్రం ఈలోకంలోకి రాలేదు...

తన చేతుల్లో వున్న వాసవిని వారికి అప్ప చెప్పాలన్న కోరికను అతి ప్రయత్నం మీద అదుముకొని రోడ్డు వైపు తిరిగాడు షాడో.

వాసవిని అప్పగించుకోవటంతో ఆగరు వాళ్ళు... బంగ్లాలో సమాధి అయిన తమ సహచరుల మృతికి కారకుడు తనేనని నింద వేస్తారు... పైదాకా తీసుకుపోయి గోల గోల చేస్తారు.

"ఏమయింది సార్? అక్కడ ఏం జరిగింది? ఈ పిల్ల ఎవరు ?" రోడ్డు మీదే నిలబడి భయం భయంగా చూస్తున్న టాంగావాలా మాటలకు మరోసారి తన ఆలోచనల నుండి బయటపడి, వాసవిని టాంగాలో పడుకోబెట్టాడు షాడో.

"అనవసరమైన ప్రశ్నలు వేసి లేనిపోని తలనెప్పులు తెచ్చుకోకు భాయీ... టాంగాని సిల్సిలా పట్టణానికి పోనీ త్వరగా..." అతన్ని హెచ్చరిస్తూ తను కూడా టాంగాలో కూర్చున్నాడు గంగారాం.

ప్రేలుడు అదటుకు తను కూడా భయపడింది కాబోలు, కళ్ళేలు పట్టుకోగానే వచ్చి టాంగా ముందు నిలబడింది గుర్రం.

కొరడాను గిరగిరా తిప్పి గాలిలో విదిలించాడు టాంగావాలా.

"ఛల్‌రే బేవకూఫ్... ఛల్ ఛల్ రే" అని అరిచి హుషార్ చేశాడు. విపరీతమైన వేగంతో పరుగులు తీసింది గుర్రం. నలభై అయిదు నిముషాల తరువాత వారిని సిల్సిలా సిటీలోకి చేర్చింది.

## 7

".... చిన్నతనం నుంచీ వంటరిగానే జీవించటానికి అలవాటు పడ్డాను... కన్న తండ్రి పేరే గాని, సంవత్సరానికి ఒకసారి కూడా నా దగ్గిరికి వచ్చేవాడు కాదు మా ఫాదర్... నాకు అవసరమైనంత డబ్బు మాత్రం పంపిస్తూ వుండేవాడు..." బుగ్గల మీదికి జారిన కన్నీటిని అద్దుకుంటూ చెప్పింది వాసవి.

"చూడు అమ్మడూ... నువ్వు ఎన్ని కబుర్లయినా చెప్పు.... ఎంతటి భయంకరమైన విషయాలనయినా వివరించు.... ఓపికగా వినటానికి మేము సిద్ధంగానే వున్నాం... ఇలా ఏడ్చి రాగాలు మాత్రం తీయకు... ఏడుపులంటే మాకు మహా భయం..." వెంటనే అడ్డుకున్నాడు గంగారాం.

ఫక్కున నవ్వి తన విచారాన్ని మరిచిపోయింది వాసవి.

"మీ నాన్న ఎక్కడున్నాడు ? ఏమయిపోయాడు ? ఎక్కడికి వెళ్ళి వుంటాడో నీకు తెలుసా ? అని రకరకాల ప్రశ్నలు వేసి వేధించుకు తిన్నారు బంగ్లాలోని వ్యక్తులు... ఆ మాటలతో నా వంటరితనం గుర్తుకు వచ్చి రగిలింది బాధ... ఐయామ్ సారీ..." అంటూ క్షమాపణలు చెప్పుకోబోయింది.

"మీ ఫాదర్ ఎక్కడికి వెళ్ళాడో నీకు తెలియదని అంటావ్... అంతేగదా?" వెంటనే ప్రశ్నించాడు గంగారాం.

మౌనంగా తల వూపిందామె.

"మీ నాన్న అంతర్ధానం వెనుక అంతుబట్టని మిస్టరీ వుంది... దాన్ని సాల్వ్ చేయటానికే మేము తంటాలు పడుతున్నాం... ఆయనంతట ఆయన మాయం అయ్యారో, లేక ఎవరయినా బలవంతంగా తీసుకుపోయారో తెలిస్తే కొంచెం కుదుట పడుతుంది మా మనస్సు..." మళ్ళీ అన్నాడతను.

"నాకు తెలిసినంత వరకూ మా ఫాదర్‌కి స్నేహితులు గాని, చుట్టాలు గాని ఎవరూ లేరు... కలకత్తాలో మాకో చిన్న యిల్లు వుందని చెప్పాడాయన... ఎక్కువకాలం లేబరీటరీలోనే గడపటం వల్ల ఆలనాపాలనా లేక అది పాడు పడి పోయిందని కూడా ఆయన నోటివెంటే విన్నాను..." సమాధానం యిచ్చింది వాసవి.

"బాగా ఆలోచించు అమ్మడూ... నేను బయటికి పోయి చల్లటి కూల్ డ్రింకులకు ఆర్డర్ యిచ్చి వస్తాను... అవి వచ్చేలోగా యింకా గట్టిగా ఆలోచించు..." అంటూ బయటికి పోయాడు గంగారాం.

సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తూ ఆ గదిలోనే పచార్లు చేస్తున్న షాడో వైపు చూసింది వాసవి.

"ఈ సమస్యకు నువ్వే సాల్వేషన్ చెప్పాలి డియర్... మీ ఫాదర్ మాయం అయ్యే సమయానికి యాంగ్ చీ అనే చైనీయుడు ఒకతను సరిహద్దుల్ని దాటి మనదేశంలోకి వచ్చాడు... అతను ఉపయోగించే ప్రేలుడు పదార్థాలతోనే మీ ఫాదర్ పనిచేసే లేబరేటరీ ధ్వంసం అయిపోయింది... ఆ యాంగ్ చీ చేతుల్లో మీ ఫాదర్ బందీ అయ్యాడని ఎందుకో నాకు అనిపించడం లేదు... అతను సరిహద్దులు దాటక ముందే తప్పించుకున్నాడు మీ ఫాదర్... ఎందుకు జరిగింది అలా ? ప్రమాదాన్ని ముందుగానే కనిపెట్టి ఇంకెక్కడయినా తల దాచుకున్నాడా? అటువంటి రహస్య ప్రదేశాలు నీకు ఏవైనా తెలుసా??" ప్రశ్నించాడు షాడో.

పది నిముషాల పాటు సీరియస్‌గా ఆలోచించి వున్నట్లుండి లేచి నిలబడింది వాసవి.

"మీరు చెప్పింది అక్షరాలా నిజమే అయి వుంటుంది. ఈ సిల్సిలా పట్టణానికి యాభైమైళ్ళ దూరంలో మాకు కొన్ని ఆరంజి తోటలున్నాయని ఒకసారి మా ఫాదర్ నాకు చెప్పారు... వట్టి తోటలే గదా అనే వుద్దేశ్యంతో ఆ విషయాన్ని విస్మరించాను... మా ఫాదర్ తనంతట తానుగా మాయం అవదలుచుకుంటే అక్కడికి పోయే అవకాశాలు చాలా ఉన్నాయి..." ఆనందంగా చెప్పింది.

గుండెల మీది నుంచి కొండంత బరువు దిగిపోయినట్లు తేలికగా నిట్టూర్చాడు షాడో.

ముడి పడదని అనుకున్న అంశం ఒకటి దారిలోకి వచ్చింది... ఆ ఆరంజి తోటల్ని కూడా ఒకసారి చెక్ చేసి, కులకర్ణి గారికి కబురు చేయచ్చు... జరిగిందేమిటో ఆయన ద్వారా స్పెషల్ బ్రాంచికి తెలియ చేయించి, వాసవిని వారికి అప్పగించవచ్చు...

తన ఆలోచనలో తనుండి వెనుక నుంచి వచ్చిన ప్రమాదాన్ని చాలా ఆలస్యంగా గుర్తించాడతను... రియాక్ట్ అవటానికి కూడా వ్యవధి యివ్వకుండా రెండు అంగల్లో అతన్ని సమీపించి రివాల్వర్‌ని తలకు గురిపెట్టాడు ఒక చైనీయుడు.

అతని తలమీద నారింజకాయ సైజులో కనిపిస్తోంది పెద్ద బుడిపె.

* * * * *

"సో.... ది గ్రేట్ యాంగ్ చీ అంటే నువ్వేనన్న మాట..." తన అజాగ్రత్తకు తనను తనే నిందించుకుంటూ పైకి మాత్రం కామ్‌గా అన్నాడు షాడో.

ఫక్కున నవ్వి అతన్ని ఆ గది మూలకు తోశాడు యాంగ్ చీ.

"నేను అడగాల్సిన ప్రశ్నను నువ్వే అడగటం ఏమంత బాగోలేదు మిస్టర్ షాడో... ఎంతో రహస్యంగా వుంచాలని మేము అనుకున్న విషయాల్ని నీ నోటి వెంట వింటుంటే నాకు చాలా ఆశ్చర్యం కలిగింది... నీ గురించి నేను విన్న కథలన్నీ నిజమేనని యిప్పుడు నమ్ముతున్నాను..." అంటూ లాగిపెట్టి కొట్టాడు మెడ మీద.

భరింపరాని బాధ నరాల్ని జివ్వు మనిపిస్తుండగా మోకాళ్ళ మీద వాలిపోయి, మెడను తడుముకున్నాడు షాడో.

మేము మేమని బహువచనం ప్రయోగిస్తున్నాడు యాంగ్ చీ... మేము అంటే ఎవరు? అతని అనుచరులా లేక...

షాడో మనస్సులోని ఆలోచనల్ని పసికట్టి మరింత క్రూరంగా నవ్వుతూ ఇంకో దెబ్బ వేశాడు యాంగ్ చీ.

"ఆలోచించ వద్దు మిస్టర్ షాడో... నీకు ఎంత మాత్రము ఉపయోగం లేని ఆలోచనల్ని చేసి హైరానా పడవద్దు... ఇంకో అరగంటలో అంతిమ శ్వాస తీసుకునే వాడివి నువ్వు... కఠినమైన విషయాల్ని వదిలి, అందమైన అనుభవాల్ని గుర్తుకు తెచ్చుకో..." అంటూ చటుక్కున రివాల్వర్‌ని బెల్టులో దోపుకొని, పాంటుజేబులో చేయి పెట్టాడు.

ఆ కాస్త అవకాశాన్ని ఉపయోగించుకోవటానికి ప్రయత్నించాడు షాడో. క్రింది నుంచి లేచి అతని మీదికి జంప్ చేయబోయాడు.

గది గుమ్మం దగ్గిర పత్యక్షం అయ్యారు ఇద్దరు వ్యక్తులు... తమ చేతుల్లో వున్న రివాల్వర్స్‌ని అతని గుండెల కేసి గురి పెట్టారు.

ఉబికి వస్తున్న ఆగ్రహాన్ని అతి ప్రయత్నం మీద అదుముకొని, గోడకు ఆనుకొన్నాడు షాడో.

కూల్ డ్రింకుల కోసం బయటికి పోయాడు గంగారాం. ఏ క్షణంలో నైనా తిరిగి రావచ్చు... గుమ్మం దగ్గిర వున్న వారిని అతను గమనించుకున్న మరుక్షణం తను యాంగ్ చీని ఎటాక్ చేయచ్చు...

అతని ఆలోచనలు ఆలోచనల రూపంలోనే వుండిపోయాయి. కార్యరూపంలోకి రాకముందే పాంటు జేబులో నుంచి హేండ్ కప్స్‌ని బయటికి తీసాడు యాంగ్ చీ. షాడో కుడిచేతికి ఒక కొక్కేన్ని బిగించి, అతను ఆనుకున్న గోడలోని కిటికీ వూచకు రెండో కొక్కేన్ని తగిలించాడు.

"సైంటిస్ట్ మహేంద్రనాథ్ మాయం అయ్యాడని తెలియగానే మీ సి.ఐ.బి. రంగంలోకి దిగుతుందని తెలిసి ముందు జాగ్రత్తలు చాలా తీసుకున్నాం మిస్టర్ షాడో... ఇంతవరకూ ఎవరూ చేయలేని సాహసం చేసి, మా మనిషిని మీ డిపార్ట్‌మెంట్‌లో చేర్పించాము... ఆ పథకం విఫలం అయితే, తప్పకుండా ఆమె యింటికి వెళ్తావని ముందే ఊహించి అక్కడ నా ఆయుధాల్ని నిక్షేపింప చేశాను... ఆ రెండు ప్రమాదాల్ని అధిగమించి తెలివి కలవాడినను కుంటున్నావు నువ్వు... ఏ బాంబుల నుంచి తప్పించుకున్నావో, ఆ బాంబులతోనే నిన్ను హతమారుస్తాను... చూడు..." అంటూ రెండో జేబులో నుంచి మరికొన్ని వస్తువుల్ని బయటకు తీశాడతను.

పొడుగాటి వైర్ వుంది వాటిలో... రబ్బర్ బంతి వంటి నల్లటి వస్తువు కూడా ఒకటి వుంది.

వైర్ చివరల్ని నోటితో కొరికి నేలమీద పరుచుకుంటూ గది గుమ్మం దాకా తీసుకుపోయాడు యాంగ్ చీ... అక్కడ వున్న తలుపు గడియకు కొసను బిగించి, రెండో కొసను బంతి వంటి వస్తువులో దూర్చి, ఒక పట్టును టైట్ చేశాడు.

అతని ఉద్దేశ్యం ఏమిటో అర్థం కాక నొసలు విరిచి చూస్తున్న షాడోకు ఛటాలున అయింది జ్ఞానోదయం.... చెమటలతో నిండిపోయింది శరీరం.

రబ్బర్ బంతి వంటి వస్తువు గ్రనేడ్ కంటె పదిరెట్లు పవర్ కలిగిన మినీ బాంబు... దాన్ని ఎత్తి తన చేతిలో పెడతాడు యాంగ్ చీ... తలుపుల్ని దగ్గిరికి వేసి వెళ్ళిపోతాడు.

సాధారణంగా కనిపించే అమరిక కలిగి వున్న తలుపులు కావవి... వాటిని తెరవాలంటే బయటకు లాగాలి...

అలా లాగే సమయంలో తలుపుతో పాటు వెనక్కి గుంజబడుతుంది వైర్... తనతో పాటు తన చేతిలోని బాంబును కూడా వెనక్కి లాగి క్రింద పడవేస్తుంది. ఆ అదటుకు బ్రద్ధలై పోతుంది బాంబు... తనతో పాటు ఆ గదిని కూడా సర్వనాశనం చేస్తుందది...

గంగారాం తిరిగి వచ్చేలోపుగానే జరిగిపోతుంది ఆ ఏర్పాటు... తన అలవాటు ప్రకారం వెనకా ముందు చూసుకోకుండా వచ్చి తలుపుల్ని బయటికి లాగుతాడతను...

బాంబును ఎత్తి షాడో చేతిలో పెడుతూ అతని ఆలోచనల్ని ఇంకోసారి గమనించి చిన్నగా నవ్వాడు యాంగ్ చీ...

"కరెక్ట్ మైడియర్ షాడో... ఎవరినైతే నువ్వు ప్రాణం కంటే ఎక్కువగా చూసుకున్నావో, ఆ గంగారాం చేతిలోనే నీ ప్రాణాలు పోతాయి. డోన్ట్ వర్రీ మిస్టర్ షాడో... నిన్ను చంపిన తరువాత ఎంతో సేపు బ్రతికి వుండడు అతను... యాభై అడుగుల మేర విధ్వంస కాండను సృష్టించే శక్తి ఈ బాంబుకు వుంది... ఇది ప్రేలగానే ముందు నువ్వు, తరువాత అతను పై లోకాలకు వెళ్ళటం తప్పనిసరి..." అంటూ పాంటు జేబులో నుంచి మందపాటి ప్లాస్టర్‌ని తీసి షాడో పెదవులకు అంటించాడు.

గది ద్వారం దగ్గిర అడుగుల చప్పుడును పసికట్టి పెద్దగా హెచ్చరించే అవకాశం కూడా చేజారిపోయిందని గ్రహించి మరింత కలవరపాటుకు గురి అయ్యాడు షాడో.

అతని చేతిలోని బాంబును ఒకసారి పరిశీలించి, రెండు అంగల్లో వాసవిని సమీపించాడు యాంగ్ చీ.

నిశ్చేష్టురాలై శిలా విగ్రహంలా నిలబడి వుందామె... అతను తన దగ్గిరికి వచ్చేసరికి తెలివి తెచ్చుకొని గది బయటికి పరిగెత్తింది.

దగ్గిరికి రానిచ్చి రివాల్వర్ మడమతో నుదుటి మీద కొట్టాడు అక్కడ వున్న వారిలో ఒకతను.

చేతులతో నుదుటిని వత్తుకుంటూ ముందుకు వాలి పోయిందామె. వెంటనే తలుపులు మూయించాడు యాంగ్ చీ...

"గుడ్ బై మిస్టర్ షాడో... విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్" అంటూ విష్ చేసి వాసవితో సహా అక్కడి నుంచి నిష్క్రమించాడు.

ఎండుకు పోయిన పెదవుల్ని నాలుకతో తడి చేసుకుంటూ, ఎడమ చేతిని కొద్దిగా క్రిందికి దించాడు షాడో.

సడన్‌గా టైట్ అయింది తలుపులకు కట్టి వున్న వైరు... చేతి మధ్యలో వున్న బాంబు చేతిని దాటి క్రింద పడబోయింది.

"అయిపోయింది... అయిపోయింది బే నీ పని... ఖతమ్ అయిపోయింది" అంతరాత్మ హెచ్చరించే సరికి, చటుక్కున ఆ చేతిని తిరిగి అంతకు ముందున్న పొజిషన్లోకి జాచాడు షాడో.

కుడి చేతికి కిటికీ వూచలకేసి బిగించి వుంచటం వల్ల, దాన్ని కదిలించటం గాని, ముందుకు జరగటంగాని కుదరటం లేదు.

అలా అని వెనక్కి జరిగితే జారి క్రింద పడిపోతుంది ఎడమ చేతిలోని బాంబు. రెండు చేతుల్ని హారిజాంటల్‌గా జాచి వుంచి కరాటే ఎక్సర్ సైజులు చేస్తున్నట్లు నిలబడి వున్నాడతను.

ముఖం మీది స్వేద బిందువులు... బిందురూపాన్ని వదిలి ధారలు ధారలుగా కారసాగాయి. చోటు ఎక్కడా లేనట్లు సూటిగా వచ్చి కనుల్లో పడి మంట పుట్టించ సాగాయి.

సాధ్యమైనంత జాగ్రత్తగా తలను ప్రక్కకు వంచి చెమటను షర్టు భుజానికి తుడుచుకునే ప్రయత్నం చేశాడతను.

క్షణాలు నిముషాల మాదిరి గడవసాగాయి... గంగారాం వెళ్ళి చాలాసేపు అయింది... ఏ క్షణంలోనైనా తిరిగి రావచ్చు... అతనే రావాలని సిద్ధాంతం ఏముంది?

వీలుగా వుంటుందని, తమ జాడలు ఎవరికీ తెలియకుండా వుండాలని ఊరి బయట వుండే ఆ పాడుపడిన ఇంట్లో మకాం వేశారు తాము... తమ మాదిరిగా కాలక్షేపం చేయటానికి ఎవరైనా వచ్చి ఆ గది తలుపులు తెరిస్తే?

వేపాకు నమిలినట్లు చేదుగా తయారయింది అతని నోరు...

"జరగబోయే ప్రమాదాన్ని గురించి ఆలోచించుకుంటూ కూర్చోవటమేనా? లేక ఈ ప్రమాదంలో నుంచి బయటపడే ప్రయత్నం ఏదయినా చేసేది వున్నదా?" ఉన్నట్లుండి అంతరాత్మ కొత్త హెచ్చరికను చేసేసరికి కొత్త యాంగిల్లో ఆలోచనలు ప్రారంభించాడు షాడో.

మృత్యువు అనేది కొత్తదేమీ కాదు తనకి... ఎన్నోసార్లు దాని నోటిలోకి పోయినట్లే పోయి వెనక్కి తిరిగి వచ్చాడు... ఎప్పుడో, ఏదో ఒక రోజున అలా తిరిగి రావటం కుదరదనీ, దాని నోటిలో చిక్కుకుపోవడం తప్పదనీ తెలుసు తనకి... ఎప్పుడో వస్తుందని అనుకున్నా ఆ రోజు ఇప్పుడే వచ్చిందని ఎందుకు అనుకోకూడదు?

వేగంగా కొట్టుకుంటున్న గుండెల్ని చిక్కబట్టుకొని, పరిపరి విధాల పోతున్న మనస్సును కంట్రోల్ చేసుకున్నాడు షాడో.

తలుపులు తెరిస్తే జరుగబోయే ప్రమాదాన్ని మనస్సు నుండి నెట్టి వేసి ఆ తలుపులు తెరువ బడేలోగా అందులో నుంచి బయటపడే మార్గాన్ని అన్వేషించసాగాడు.

ఎడమ చేతిలోని బాంబును క్రింద పెట్టేస్తే గట్టెక్కి పోతుంది ఆపద... ఆ పని జరగాలంటే తను మరో నాలుగు అంగుళాలు ముందుకు జరగాలి... అలా

జరగకుండా బారుగా చాచబడి వుంది కుడిచేయి. ఒక్క అంగుళం కూడా కదలకుండా కిటికీ వూచలకు బిగించబడి వుంది.

రక్త ప్రసరణం ఆగిపోయి చేతులు మొద్దుబారి పోతున్న సెన్సేషన్ కలిగేసరికి మరోసారి ఖంగారు పడబోయిన మనస్సును అదుపులోకి తెచ్చుకుంటూ, దృష్టినంతా కుడిచేతి మీద కాన్సన్ట్రేట్ చేశాడతను.

మణికట్టును బిగించి వున్న హేండ్కప్ని వదిలించుకోవటానికి ప్రయత్నాలు ప్రారంభించాడు...

చేతి కండరాలు బిగుసుకునే సరికి టైట్ అయ్యింది హేండ్కప్... చర్మంలోకి దిగబడి విపరీతమైన బాధను క్రియేట్ చేసింది.

లెక్క చేయలేదు షాడో... పళ్ళు బిగించి మణికట్టును కదిలించాడు... శరీరంలోని బలాన్నంతా కుడి చేతిలోకి తెచ్చుకుంటూ కప్ని పట్టుకొని ముందుకు లాగాడు.

చర్మాన్ని వత్తుతున్న ఆ ఇనుప సాధనం వత్తటం మాని రక్తాన్ని రుచి చూడటం మొదలు పెట్టింది... చర్మం తెగి ఎర్రని రక్తం నేల మీద బొట్లు బొట్లుగా పడటం మొదలు పెట్టింది.

"ఆపు... కాస్సేపు ఆపి కొంచెం విశ్రాంతి తీసుకో..." జాలి గొలిపే మాటలతో నిరుత్సాహ పరుస్తున్న ఆలోచనల్ని అదిమి పట్టుకొని చేతిని మరింత టైట్ చేసి లాగాడు షాడో.

పట పటమని శబ్దం చేశాయి హేండ్కప్స్కున్న ఇనుప లింకులు... ఆ శబ్దంలో ఒక విధమైన ఓటి సవ్వడి చెవుల పడేసరికి ఇనుమడించింది షాడో ఉత్సాహం.

ఒకే విధమైన మెటల్‌తో చేయబడినా, కొంచెం వీక్‌గా వున్నట్లుంది వాటిలోని ఒక లింకు... తను ప్రయోగిస్తున్న వత్తిడిని తట్టుకోలేక ఓటిగా మోగుతున్నది.

పెదవులు బిగించి మరింత బలాన్ని చేతిలోకి పంపాడు షాడో....

అదే సమయంలో అతని చెవులకు చేరింది అడుగుల సవ్వడి...

వచ్చేశాడు గంగారాం... సూటిగా వచ్చి తలుపుల మీద వేస్తాడు చేయి... మరింతగా పెరిగిన ఆందోళనతో గుడ్డిగా గుంజాడు షాడో చేతిని... ఫట్‌మని శబ్దం చేసింది హేండ్ కప్...

అది వూడ లేదు... ఆ బలమే కాదు, అంతకు నాలుగు రెట్లు బలాన్ని ఉపయోగించినా ఓటి మ్రోతలు చేయటం తప్ప అది మాత్రం తెగే సూచనలు అక్కడ లేవు.

అయితే మరో విధంగా పని చేసింది షాడో ఉపయోగించిన ప్రెషర్...

తుప్పు పట్టి పట్టి ఉండనా ఊడనా అన్నట్లున్నాయి కిటికీకి వున్న లావుపాటి ఊచలు... వాటి పైజను చూశాడుగాని, వాటి బలాన్ని అంచనా వేయలేదు యాంగ్ చీ.

సాకెట్స్‌లో నుండి ఊడి చివ్వున యివతలికి వచ్చేసింది హాండ్‌కప్ రెండో చివర్ని పట్టుకొని వున్న ఇనుప వూచ... ఆ అదటుకు తూలి గది మధ్యలో పడ్డాడు షాడో... చేతిలోని బాంబు గాలిలోకి ఎగిరింది క్రికెట్ బంతి మాదిరి.

అది నేలను తాకితే...

ఆ పైన ఆలోచించటానికి మనస్కరించక దానితో పాటు ఎగిరాడు షాడో... రక్తసిక్తమైన కుడిచేతిని జాచి గాలిలో వుండగానే దాన్ని పట్టుకొని స్విచ్కి బిగించి వున్న వైరును ఊడతీసేశాడు.

ఆ స్క్రూను కూడా బాంబు మీది నుంచి వేరు చేయగానే డిఫ్యూజ్ అయి నిరపాయకరమైన రబ్బర్ బంతి మాదిరిగా తయారయిందది.

అప్పుడు... అప్పుడు కుదుట పడింది షాడో మనస్సు... ఆ బాంబును గది మూలకు విసిరికొట్టి గది తలుపుల్ని బయటికి తోశాడు.

"హల్లో గురూ... ఎంతసేపు యిలా బయట నిలుచోవాలి? ఇంతసేపు నన్ను నిలబెట్టటం నీకు మర్యాదగా వుందా??" నవ్వుతూ పలకరించాడు గుమ్మం అవతల నిలబడి వున్న గంగారాం.

# 8

లాగిపెట్టి అతని నెత్తి మీద ఒకటిచ్చుకుందామన్న కోరికను బలవంతంగా అణుచుకుంటూ షర్టు కాలర్ క్రింద వున్న సూది వంటి సాధనాన్ని బయటికి తీశాడు షాడో. ఎడమచేత్తోనే దాన్ని హేండ్‌కప్స్ చివరి భాగంలో వున్న లాక్ లోకి ఇన్‌సర్ట్ చేసి అటూ ఇటూ తిప్పాడు మెల్లిగా.

క్లిక్‌మని శబ్దం చేసిందది రెండు క్షణాల తర్వాత... వాటంతట అవే విడిపోయి క్రింద పడ్డాయి అతని చేతిని పట్టి వుంచిన ఇనుప రింగులు.

"చాలా అలిసిపోయావు గురూ... కొంచెం నెమ్మదిగా ఈ కూల్ డ్రింక్‌ను తీసుకో... అలుపు తీరుతుంది" గోడ వారగా పెట్టిన ఒక కూల్ డ్రింక్ సీసా మూతను పళ్ళతో ఓపెన్ చేసి సీసాను అతనికి అందిస్తూ అన్నాడు గంగారాం.

అక్కడే వున్న ఇంకో సీసాను కూడా అదేవిధంగా ఓపెన్ చేసి అతను పుచ్చుకోవటాన్ని గమనిస్తూ క్రిందికి చూశాడు షాడో.

*గదిలో వున్న వాళ్ళందరికీ అంటే తమ ముగ్గురికీ మూడు సీసాలు తీసుకు రావాల్సిన గంగారాం రెండే తీసుకొచ్చాడు... వాసవిని యాంగ్ బీ ఎత్తుకు పోయాడని అతనికి తెలిసే అవకాశం లేదు... మూడో సీసా ఏది?? తీసుకు రాలేదా??*

*"ఇంత బ్రతుకూ బ్రతికి ఆఖరికి కూల్ డ్రింక్ సీసాల్ని లెక్కబెట్టుకోవటంలోకి వచ్చిందా మన గొప్పతనం?? దాహం వేసి నేనే ఆ సీసాను తాగేశానని ఎందుకు అనుకోకూడదు??" కనుబొమ్మలు ముడివేసి చూస్తూ కోపంగా అడిగాడు గంగారాం అతని ఆలోచనల్ని గమనించి.*

*వెంటనే స్ట్రయికయ్యింది షాడోకి.*

*కూల్ డ్రింక్ సీసాల వెనుక కథ వుంది... అందుకే అంత తాపీగా వున్నాడు గంగారాం... అమాయకంగా మాట్లాడుతున్నాడు.*

*"ఆల్‌రైట్ గంగూ... నేను మతిలేని వాడిననే వప్పుకుంటున్నాను... ఏం జరిగిందో చెప్పు" డ్రింక్ సీసాను అవతల పడేసి గాయపడిన కుడిచేతికి హేండ్ కర్చీఫ్‌ని చుట్టుకుంటూ అడిగాడు.*

*"అయ్యయ్యో... దాన్ని అవతల పడేయకు... దానితో అవసరం రావచ్చు..." అంటూ తన చేతిలోని సీసాతో ఆ సీసాను కూడా కలిపి పట్టుకొని బయటికి దారి తీశాడు గంగారాం.*

*సస్పెన్స్‌ని భరించటం అసాధ్యం అనిపిస్తున్నా ఓర్పుగా అతన్ని అనుసరించాడు షాడో.*

*వారు మకాం పెట్టిన ఆ ఇంటి ముందు వుంది పెద్ద మర్రిచెట్టు ఒకటి. దాని మొదట్లో పడుకొని హాయిగా నిద్ర పోతున్నాడు ఒక దృఢకాయుడు.*

జరిగింది ఏమిటో వెంటనే అవగతమై చిన్నగా నవ్వలేకుండా ఉండలేకపోయాడు షాడో.

వాసవిని అపహరించి తీసుకుపోవటంతో తృప్తి చెందకుండా, తన అనుచరుడొకడిని అక్కడ కాపలాగా పెట్టి మరీ పోయినట్టున్నాడు యాంగ్ చీ.

కూల్‌డ్రింక్స్ తీసుకురావటానికి పోయిన గంగారాం పొటెన్సీని చాలా తక్కువగా అంచనా వేశాడతను.

చెట్టు చాటున దాగున్న ఆకారాన్ని గమనించగానే క్రికెట్ బాల్ మాదిరి విసిరాడు గంగారాం ఒక సీసాని. గులకరాయి దెబ్బ తిన్న గుడ్లగూబలా విరుచుకు పడిపోయాడు ఆ దృఢకాయుడు.

"వీడిని చూడగానే నాకు అనుమానం వచ్చింది గురూ! నేను బయటికి పోయేటప్పుడు బార్లా తెరిచి వున్న తలుపులు మూసుకొని వుండటంతో, ఎందుకైనా మంచిదని సందుల్లో నుంచి తొంగిచూశాను. అప్పటికే కిటికీ వూచను వూడగొట్టేశావు నువ్వు..." జరిగింది ఏమిటో అప్పుడు షాడోకి వివరించి చెప్పాడు గంగారాం.

"ఆల్‌రైట్... ఇక ఇక్కడ టైమ్ వేస్ట్ చేస్తూ కూర్చోవటం నాకు యిష్టం లేదు. అతన్ని నిద్రలేపు..." అంటూ మర్రిచెట్టు క్రిందే కనిపించిన బండరాయి మీద కూర్చున్నాడు షాడో.

పడిపోయిన దృఢకాయుడి బుగ్గలు తట్టాడు గంగారాం. అయ్యా, బాబూ అంటూ సగౌరవంగా పిలిచాడు. అప్పటికీ అతను కనులు తెరవక పోయేసరికి, చేతిలోని సీసాల్ని ఎత్తి ఠపీ ఠపీమని వేశాడు తలమీద.

ఆ దెబ్బల్ని తట్టుకోలేక స్పృహ తెచ్చుకున్నాడు అతను. కనులు తెరిచీ తెరవటంతోటే ఛెంగున లేచి రోడ్డు మీదికి పరిగెత్తాడు.

"వీడెవడో పూర్వజన్మలో ఆస్ట్రేలియాలో కంగారు మృగంగా పుట్టి వుంటాడు... ఎంత స్పీడ్‌గా పరిగెత్తు తున్నాడో చూడు గురూ..." అంటూ కూల్‌డ్రింక్ సీసాని గిరగిరా తిప్పి విసిరాడు గంగారాం.

సూటిగా పోయి ఆ వ్యక్తి మెడ మీద పడిందది... ఇంకోసారి గావు కేక పెట్టి ముందుకు తూలాడతను. తూలి ముందుకు పడబోతుండగా వేగంగా కదిలి పాంటు జేబులోకి పోయిందతని చేయి.

"గెట్ బేక్ గంగూ... గెట్ బెక్..." అని కమాండ్ చేస్తూ బూటు ప్రక్కన బిగించి వుండే డాగర్‌ని అందుకోబోయాడు షాడో.

రివాల్వర్ వంటి ఆయుధాన్ని దేన్నో బయటికి తీయబోతున్నాడా దృఢకాయుడని అతని వుద్దేశ్యం.

దారుణంగా ఫెయిల్ అయింది అతని అంచనా, ఎటువంటి ఆయుధాన్నీ బయటికి తీయలేదు అతని చేయి... వక్కపొడి పొట్లం వంటి చిన్న పాకెట్‌ని తీసి చటుక్కున నెట్టింది నోటిలోకి.

"మైగాడ్... స్టాప్ హిమ్.... స్టాప్ హిమ్ గంగూ..." ఆందోళన నిండిన కంఠంతో హెచ్చరిస్తూ సగం బయటికి వచ్చిన డాగర్‌ని వదిలేసి అతనికేసి జంప్ చేశాడు షాడో.

"అన్నీ నీ మాటలే అయితే ఎలా గురూ? వెనక్కి తగ్గమనేది నువ్వే... ముందుకు దూకమనేదీ నువ్వే... చచ్చిపోతున్నాను నీతో..." అంటూ వేగంగా ఆ

దృఢకాయుడిని సమీపించి గొంతును బిగించి పట్టుకున్నాడు గంగారాం. కుడిచేత్తో నోటిని విచ్చ తీయటానికి ప్రయత్నించాడు.

అప్పటికే నలుపు రంగుకు తిరిగిపోయిందతని శరీరం... గంగారాం చేతులు నోటి మీద పడకముందే అనంత విశ్వంలో కలిసిపోయాయి అతని ప్రాణ వాయువులు.

"సైనేట్ పిల్‌ని మింగాడు, దొంగనాయాలు... ఏమీ తెలియని అమాయకుడిలా పోజు పెట్టి చీట్ చేశాడు..." తనకంటే అరక్షణం ఆలస్యంగా వచ్చిన షాడోని చూస్తూ కామెంట్ చేశాడు గంగారాం.

రోడ్డు మీద నుంచి దృఢకాయుడి శరీరాన్ని మర్రిచెట్టు చాటుకు చేర్చాడు షాడో. మెథాడికల్‌గా అతని చేతుల్ని సెర్చ్ చేశాడు.

పొడుగాటి కత్తి, చిన్న పిస్టల్, కొద్దిపాటి కరెన్సీ, ఏవేవో బస్ టిక్కెట్స్ తప్ప వారికి ఉపయోగపడే సరంజామా ఏదీ కనిపించలేదు.

"మనతో పాటు ఇంకెవరైనా ఈ కేసును స్టడీ చేస్తున్నారో లేదో తెలుసుకోవటానికి నిలపబడ్డ కాపలా మనిషి యితను..." సాలోచనగా అంటున్న గంగారాం మాటలకు తల వూపుతూ లేచి నిలబడ్డాడు షాడో.

అందినట్లే అంది చేజారిపోయిన ఆధారాన్ని తిరిగి సంపాదించాలంటే ఆలస్యం చేయకుండా యాంగ్ చీని అనుసరించాలి. అందుకు ముందు అతను ఎక్కడికి పోయాడో తెలుసుకోవాలి...

సిల్సిలా సిటీకి యాభై కిలోమీటర్ల దూరంలో మహేంద్రనాథ్‌కి ఆరెంజి తోటలు వున్నాయని చెప్పింది వాసవి... వాటెబౌట్ దెమ్? అక్కడికి పోయి చూస్తే ఎలా వుంటుంది??

# 9

"హేయ్ ఎవరక్కడ ? ఎవరది ?" పెద్దగా పిలుస్తూ ఒక చెట్టు చాటు నుంచి నలుగురు వ్యక్తులు ఎదుట ప్రత్యక్షం అయ్యేసరికి చటుక్కున ఆగిపోయాడు షాడో.

"ఎవరని అడుగుతుంటే సమాధానం చెప్పరేమిటి ? ఎవరు మీరు ??" కనుబొమ్మలు ముడివేసి అనుమానంగా చూస్తూ రెండు అడుగులు ముందుకు వేశాడు ఆ వ్యక్తుల్లో ఒకతను.

కిటికీ వూచను ఊడలాగటంలో గాయపడిన చేతిని భద్రంగా ఎత్తి పట్టుకుంటూ నెంబర్ వన్ అమాయకుడి ఫోజు పెట్టాడు షాడో.

"పని కోసం వెతుకుతున్న కాందిశీకులం బాబూ... పొట్ట చేత్తో పట్టుకొని వచ్చిన పరాయి రాష్ట్రం వాళ్ళం... పనేదైనా యిప్పించగలరా?" దీనంగా చూస్తూ అడిగాడు.

ఎదురు తిరిగి ఎడా పెడా వాయించాల్సి వస్తే షాడోకి వెనుక నుంచి రక్షణ కల్పించేందుకు నాలుగు అడుగులు దూరంగా నిలబడ్డాడు గంగారాం. ఎదురు తిరిగే లక్షణాలు షాడోలో కనిపించక పోయేసరికి, ఏడుపు ముఖం పెట్టుకొని ముందుకు వచ్చేశాడు.

"అన్నం తిని రెండు రోజులయింది. ఎక్కడికి పోయినా మమ్మల్ని చూసి దొంగలని అనుకుంటున్నారు... మీరైనా కాస్తంత కనికరం చూపించండి... మీ తోటలో పని కల్పించండి..." చేతులు జోడించి కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

సిల్సిలా పట్టణం నుంచి ఒక నాటు బస్సులో ప్రయాణం చేసి రావటం వల్ల నలిగిపోయి వున్నాయి వారి దుస్తులు. ఎర్రటి దుమ్ముతో నిండి వున్నాయి ముఖాలు.

ఇంటర్‌పోల్ డైరెక్టర్లను కూడా ఖాతర్ చేయకుండా మాట్లాడగల మనిషిలా కనిపించటం లేదు షాడో. గంగారాం అన్నట్లు అచ్చం ఫోర్త్ క్లాస్ పర్సనాలిటీ మాదిరిగానే కనిపిస్తోంది వాలకం.

ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ ఆలోచనలో పడ్డారు ఆ వ్యక్తులు.

"కొత్త వాళ్ళనెవర్నీ తోటలోకి రానీయొద్దని చెప్పాడు యజమాని..." తల బరుక్కుంటూ అన్నాడు వారిలో ఒకతను.

"ఆయన అలాగే అంటాడు... ఇంకో గంటలో నాలుగు లారీలు వస్తాయి. వాటిని లోడ్ చేయటం మన నలుగురివల్లా అవుతుందా? లోడింగ్ లేట్ అయితే సరుకు దెబ్బ తినిపోదా? అప్పుడు మాట పడేది ఎవరు??" వెంటనే ప్రశ్నించాడు మరొకతను.

"వీళ్ళని పనిలోకి తీసుకుందాం... చెక్కల మేడ సమీపంలోకి పోవద్దని చెపుదాం..." సజెస్ట్ చేశాడు మూడో మనిషి.

చెక్కల మేడ అనే కట్టడం ఒకటి అక్కడ వున్నదని, దాని సమీపంలోకి పోకూడదనీ తెలిసే సరికి చెవులు రిక్కించాడు షాడో.

అతని కుతూహలానికి అక్కడితో ఫుల్‌స్టాప్ పడిపోయింది. తమ కండిషన్‌ని వివరించి, అందుకు యిష్టపడితే పనిలోకి రావచ్చని ఎనౌన్స్ చేశాడు మొదటి వ్యక్తి.

మహదానందంగా అంగీకరించాడు గంగారాం.

"ఆకలి... ఆకలిగా వుంది... ముందు కాస్త తినటానికి ఏదైనా ఏర్పాటు చేయండి బాబుల్లారా..." అని రిక్వెస్ట్ చేశాడు.

వారిద్దరినీ తోట మధ్యలోకి తీసుకుపోయారు ఆ వ్యక్తులు.

అంతకు ముందే చెట్ల మీది నుంచి దింపబడ్డాయి కాబోలు, చక్కటి సువాసనలు వెదజల్లుతూ గుట్టలు గుట్టలుగా పోయబడి వున్నాయి ఆరంజస్.

ఆ గుట్టల వెనుక వున్న పెద్ద పాకలోకి పోయి రెండు సత్తు ప్లేట్లలో చల్లారి పోయిన రొట్టెల్ని తీసుకొచ్చి వారికి యిచ్చాడు ఒక వ్యక్తి.

రబ్బర్ సాగినట్లు సాగుతున్న రొట్టెల్ని నమలటానికి శాయశక్తులా ప్రయత్నిస్తూ కనుచివరల నుంచి చుట్టూ వున్న పరిసరాల్ని పరిశీలించటానికి ప్రయత్నించాడు షాడో.

పాతిక ఎకరాల విస్తీర్ణంలో పెంచబడి వుందా తోట... వారున్న ప్రదేశానికి అల్లంత దూరంలో కనిపిస్తోంది రెండు అంతస్తుల చెక్కల మేడ....

ఆ మేడ ఆసుపాసులు అతనికి పూర్తిగా అర్థం కాక ముందే మ్రోతలు చేస్తూ అక్కడికి వచ్చేశాయి, నాలుగు లారీలు.

"త్వరగా ... త్వరగా లోడ్ చేయండి... త్వరగా..." ఇంజన్‌ని ఆఫ్ చేయక ముందే అక్కడి వారిని హెచ్చరించారు వాటి డ్రయివర్లు.

ఎంత నిమిలినా నలగని రొట్టెల్ని బ్రతుకు జీవుడా అనుకుంటూ అవతల పడేసి రెండు తట్టల్ని అందుకున్నారు షాడో, గంగారాం. గుట్టలు గుట్టలుగా పోసి వున్న ఆరెంజెస్‌ని వాటిల్లో నింపుకొని లారీల్లోకి దొర్లించటం మొదలు పెట్టారు.

వంచిన నడుము ఎత్తకుండా ఎంత వేగంగా పని చేసినా నాలుగు గంటలకు పైనా పట్టిందా పని... ఆఖరి లారీ సరుకుతో అవతలికి పోయేసరికి చీకటి తెరలు దట్టంగా ముసురుకున్నాయి ఆ పరిసరాల్ని.

"మీ వాలకాలు చూసి మొదట్లో సందేహించిన మాట యదార్థం. మీ పని మాకు నచ్చింది. సీజన్ అయిపోయే దాకా మీకు పని యిస్తాం. రేపటి నుంచీ తెల్లారగానే రండి..." అంటూ రెండు పది రూపాయల కాగితాల్ని షాడో చేతికి అందించాడు వారిని అపాయింట్ చేసుకున్న వారిలో ఒకతను.

షాడో కంటె ముందుగా కదిలి, ఆ నోట్లను తను లాక్కున్నాడు గంగారాం.

"మావాడు వట్టి దుబారా మనిషి సార్... నాకు యివ్వండి... మా యిద్దరిలో జాగ్రత్త పరుడిని నేనే..." అంటూ వాటిని మడిచి జేబులో పెట్టుకుంటూ తోట బయటికి దారి తీశాడు.

పాతిక అడుగుల దూరం వరకూ అతన్ని అనుసరించాడు షాడో. తోటకు కాపలా వున్న వాళ్ళు పాకలోకి పోయారని గ్రహించగానే చటుక్కున అతని చేయి పట్టుకొని, దూరంలో వున్న చెక్కల మేడ వైపు దారి మార్చాడు.

"అక్కడ కూడా కాపలా వున్నట్లుంది గురూ.... ఎవరి కంట్లోనైనా పడ్డామంటే ఇందాకటి నుంచి చేసిన కష్టం అంతా మట్టి కొట్టుకు పోతుంది..." లోగొంతుకతో అంటూ అడుగులు వేశాడు గంగారాం.

వంద గజాల దూరం కూడా పోకముందే యదార్థం అయింది అతని అనుమానం. నాలుగు హండ్రెడ్ కాండిల్స్ బల్బులు ఏర్పాటు చేయబడి వున్నాయి చెక్కల కట్టడం చుట్టూ. ప్యాంటు జేబుల్లో చేతులు పెట్టుకొని ఆ బల్బుల దగ్గిర నిలబడి వున్నారు పదిమంది ఆగంతకులు.

వారు అక్కడ వుండగా మేడలోకి ఎంటర్ అవటం అసంభవమనే మాట అవగతమై ఒక చెట్టు చాటున కూర్చుండిపోయాడు షాడో.

మరో రెండు నిముషాలపాటు అతని దగ్గరే నిలబడ్డాడు గంగారాం. ఉన్నట్లుండి ప్రక్కకు తిరిగి చెట్లను చాటు చేసుకుంటూ మేడ చుట్టూ రెండు రౌండ్లు కొట్టాడు.

టైట్‌గా వుంది సెక్యూరిటీ... చీమ దూరే సందు కూడా అక్కడ అగుపించటం లేదు.

ఉన్నట్లుండి అతని మనస్సులో అడుగు పెట్టింది ఒక ఆలోచన. దాన్ని షాడోకి చెప్పి, అతనికి ఇష్టం వుంటుందో లేదో కనుక్కోవాలన్న కోరిక మాత్రం కలగలేదతనికి. కామ్‌గా వెనక్కి జరిగి, క్రిందికి వాలి వున్న ఒక కొమ్మ నుంచి పచ్చిగా వున్న ఆరెంజెస్‌ని రెండింటిని తుంచాడు. రెండు అడుగులు ముందుకు వేసి ఎడాపెడా విసిరాడు ఆ రెంటినీ రెండు బల్బుల కేసి.

అరక్షణం వ్యవధిలో రైఫిల్ బుల్లెట్ల మాదిరి పోయి ఆ బల్బుల్ని పగల గొట్టేశాయా కాయలు.

వెంటనే చెలరేగిందక్కడ కలకలం.

"ఏమిటిది ? ఏమయింది ? ఏమయిందక్కడ ??" అని అరుస్తూ అటుకేసి పరిగెత్తుకొచ్చారు పగలకుండా వున్న బల్బుల దగ్గిరి వ్యక్తులందరూ.

"అబ్బా!" అని అరిచాడు గంగారాం. ఆ అరుపు కూడా సరిపోదేమోనని రెండుసార్లు గట్టిగా దగ్గాడు. దగ్గిన తర్వాత క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెనుతిరిగి పిక్కబలం చూపించాడు.

అతను ఆశించినట్లు అక్కడ వున్న వారందరూ అతన్ని వెంటాడలేదు.

"బాస్‌కి చెప్పండి... బాస్‌కి రిపోర్ట్ చేయండి..." అని కమాండ్ చేస్తూ ఇద్దర్ని లోపలికి పంపి, మరో ఇద్దర్ని అక్కడే వుంచి, మిగిలిన వారితో చేజింగ్ ప్రారంభించాడు కాపలా వ్యక్తుల నాయకుడు.

బాస్‌కి రిపోర్ట్ చేసేందుకు కట్టడంలోకి వెళ్లిన వారి వెనుకే తను కూడా లోపలికి చేరుకున్న షాడోని మాత్రం వారెవరూ గమనించలేదు.

* * * * *

".... ఇది ఆ షాడో పనే అయి వుంటుంది. సందేహం లేదు... మనం అమర్చిన ట్రాప్‌లో నుంచి బయటపడి వుంటాడు..." చెక్కల కట్టడం రెండో అంతస్థులోని ఒక కిటికీ దగ్గిర నిలబడుతూ కామెంట్ చేశాడు యాంగ్‌చీ.

"తోటనంతా గాలిస్తున్నాం సర్... శక్తివంతమైన టార్చిలైట్లతో చెట్ల కొమ్మల్ని కూడా వెతుకుతున్నాం..." రిపోర్ట్ చేశాడు అతని అనుచరుడు ఒకతను.

దీర్ఘంగా నిట్టూర్చి తల అడ్డం తిప్పాడు యాంగ్‌చీ.

"వచ్చింది షాడోనే అయితే మీ శ్రమ వ్యర్థం మైఫ్రెండ్! కారణం లేకుండా ఏ పనీ చేయడు అతను.... మేడ చుట్టూ వున్న లైట్లలో రెండింటిని మాత్రమే పగల గొట్టాడంటే అర్థం ఏమిటో కొంచెం ఆలోచించు..." అన్నాడు.

నొసలు విరుస్తూ, ఆలోచించాడా అనుచరుడు. రెండు క్షణాల తరువాత అదిరిపడి నోరు తెరిచాడు.

అతని ముఖంలో ప్రతిఫలించిన భావాల్ని గమనించి పెద్దగా నవ్వాడు యాంగ్‌చీ.

"యస్ మై ఫ్రండ్... లైట్లు పగలగానే మేడమట్టూ నిలబడి వుండాల్సిన మీరందరూ ఒక వైపుకు చేరుకున్నారు... ఆ సందడిలో నిర్భయంగా లోపలికి వచ్చేసి వుంటాడతను... ఎక్కడో పొంచి వుండి మన మాటల్ని, కదలికల్ని గమనిస్తూ వుండి వుండోచ్చు... గో ఆన్ సెర్చ్ ది ప్లేస్ కంప్లీట్లీ..." అంటూ ఆర్డర్ పాస్ చేశాడు.

పరుగులాంటి నడకతో ఆ గది బయటికి పోయాడా అనుచరుడు. తన వారందర్నీ పిలిచి కట్టడమంతా గాలించటం ప్రారంభించాడు.

పొడుగాటి సిగార్‌ని వెలిగించుకొని తన గదిలో పచార్లు చేస్తున్న యాంగ్‌చీని చూస్తూ తీవ్రమైన ఆలోచనలో మునిగిపోయాడు అదే గదిలో వున్న పెద్ద వార్డ్ రోబ్ మధ్య కూర్చుని వున్న షాడో.

తను భవనంలోకి వచ్చినట్లు యాంగ్‌చీ వూహించక ముందే ఆ ప్రదేశాలన్నిటినీ క్షుణ్ణంగా పరిశీలించి నేర్పుగా ఆ వార్డ్ రోబ్ లోకి చేరుకున్నాడతను.

వాసవి చెప్పినట్లు ఆ భవనం వున్న తోట మహేంద్రనాథ్‌కి చెందినదే అయినా, ఆ చుట్టు పట్ల ఎక్కడా లేడు మహేంద్రనాథ్...

ఎటువంటి ఎస్సైన్మెంట్ ప్రారంభించినా, అవసరం అయితే నేర్పుగా తప్పించుకోవటానికి రెండు మూడు మార్గాలను ముందుగానే సిద్ధం చేసుకొని వుండటం యాంగ్ చీ స్పెషాలిటీ.

అదే పద్ధతి ప్రకారం మరేదైనా ప్రదేశంలో దాచి పెట్టబడ్డాడా మహేంద్రనాథ్? దాచి పెట్టబడ్డాడా లేక దాక్కున్నాడా??

అసలు అతను యాంగ్ చీతో చేతులు కలిపాడో లేదో తెలియని సందిగ్ధ స్థితిలో చిక్కుబడి ముంచుకు వస్తున్న ప్రమాదాన్ని గుర్తించలేక పోయాడు షాడో.

అతను ఆ ఆలోచనలతో సతమతం అవుతున్న సమయంలోనే ఉన్నట్లుండి చెక్క ల కట్టడం బయట చెలరేగింది పెద్ద గందరగోళం.

"చుట్టు ముట్టండి.... మేడను పూర్తి గా సరౌండ్ చేయండి. అందులో వున్న వారిని ఒక్క ళ్ళని కూడా వదిలి పెట్టవద్దు..." ఖంగు ఖంగున వినబడసాగాయి ఆజ్ఞలు.

చేతిలోని సిగార్‌ని అవతలికి విసిరి కొట్టి కిటికీలో నుంచి బయటికి తొంగి చూశాడు యాంగ్‌చీ. చూసిన వెంటనే క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఆ గది బయటికి పరిగెత్తాడు.

అర్థం పర్థం లేని ఆలోచనల్లో పడి అతన్ని చేజార్చుకుంటున్నట్లు గ్రహించి డాగర్‌ని బిగించి పట్టుకుంటూ బీరువాలో నుంచి బయటికి దూకాడు షాడో.

అప్పటికే ద్వారాన్ని దాటి అవతలికి వెళ్ళిపోయాడు యాంగ్‌చీ.

"పరిగెత్తు మిస్టర్ షాడో... స్పీడ్‌గా పరిగెత్తు... ఆలస్యం అయిందంటే అడ్రసులు లేకుండా పోతాడు యాంగ్‌చీ.... ఆ తరువాత తల్లక్రిందులుగా తపస్సు చేసినా నీకు లభించవు అతని జాడలు..." అని హెచ్చరిస్తున్న అంతరాత్మ మాటల్ని వింటూ రెండు అంగల్లో ద్వారంలో అడుగుపెట్టి అదిరిపడ్డాడు షాడో.

గిరుక్కు న వెను తిరిగి గదిలోకి రాబోయాడు గాని అప్పటికే ఆలస్యం అయిపోయింది.

"ఎక్క డికి పోతావురా? ఎక్క డికి పోతావ్?" కర్క శంగా అంటూ చేతిలోని రివాల్వర్‌ని వెనక్కి తిప్పి దాని మడమతో మెడమీద బలంగా మోదాడు ఇండియన్ స్పెషల్ బ్రాంచి ఏజెంటు ఒకతను.

చచ్చీచెడి తలలు పగల గొట్టుకున్న తర్వాత గాని తమకు లభించని ఆ ఆరెంజి తోట ఆనుపానులు స్పెషల్ బ్రాంచికి ఎలా అవగతం అయ్యాయో తెలుసుకోవటానికి ప్రయత్నిస్తూ ముందుకు తూలాడు షాడో.

తిరిగి లేచి నిలబడే అవకాశం లభించలేదతనికి. దెబ్బ మీద దెబ్బ మరో అరడజను దెబ్బల్ని డెలివర్ చేశాడు ఆ స్పెషల్ బ్రాంచి ఏజెంట్.

కనుల ముందు టెక్నికలర్ నక్షత్రాలు ప్రత్యక్షం అవుతుండగా నేలను కౌగిలించుకున్నాడు షాడో. స్పృహ తప్పి అచేతనంగా వుండిపోయాడు.

## 10

"ఆల్‌రైట్ మిస్టర్... ఇక చెప్పు... ఎక్కడ వున్నాడు మహేంద్రనాథ్ ఏం చేశారు అతన్ని?? ఎక్కడ దాచి పెట్టారు??" పొడుగాటి లాటీ కర్రను షాడో తలమీద తాటిస్తూ ప్రశ్నించాడు ఎత్తుగా, లావుగా వున్న స్పెషల్ బ్రాంచి ఏజెంట్ ఒకతను.

పది పౌండ్ల హేమర్‌తో బాదినట్లు పోటెత్తి పోతున్న మెడను తడుముకుంటూ బ్లాంక్ ఫేస్ పెట్టాడు షాడో. చెక్కల మేడ క్రింది అంతస్థులో కూర్చో పెట్టబడి వున్నాడతను. యమభటుల మాదిరి చుట్టూ నిలబడి వున్నారు పదిమంది స్పెషల్ బ్రాంచి ఏంజెంట్లు.

వారిలో ఎవరికీ తన ఐడెంటిటీ అంతుబట్టలేదన్న అంశం ఒక్కటే కొంచెంగా తగ్గిస్తోంది షాడో బాధని.

"నీ ఐడెంటిటీ బయట పడలేదని అతిగా సంతోషించకు మిస్టర్ షాడో... ఏ క్షణంలోనైనా పెద్ద అధికారులు యిక్కడికి రావచ్చు... నీ వదనారవిందాన్ని చూసిన మరుక్షణం గుర్తు పట్టేస్తారు... వెంటనే మీ బాస్‌ని పిలిపించి నీ తోక కత్తిరింపిస్తారు...

చూసి రమ్మంటే కాల్చి వస్తాననే నీవంటి వాళ్ళకు పట్టాల్సిందే ఈ గతి... అనుభవించు..." వికృత కంఠంతో హెచ్చరిస్తున్న అంతరాత్మ మాటల్ని వినిపించుకోనట్లు నటిస్తూ మరింత అమాయకంగా ఫోజు పెట్టి దిగులుగా చూశాడు షాడో.

"మీ మాటలు ఒక్కటి కూడా నాకు అర్థం కావటం లేదు సార్... పని కోసం పొట్ట చేత్తో పట్టుకొని పరాయి రాష్ట్రం నుంచి ఇవ్వాళే యిక్కడికి వచ్చాను... నా ఖర్మ కాలి మీకు పట్టుబడ్డాను..." అన్నాడు జాలి గొలిపే కంఠంతో.

ఫెడీ ఫెడీమని పడ్డాయి రెండు దెబ్బలు అతని తల మీద.

"అతి తెలివి చూపిస్తే ఖతం అయిపోతావ్.. నిజం చెప్పు... మహేంద్రనాథ్‌ని ఎక్కడ దాచి పెట్టారు?" మళ్ళీ లాటీ కర్రను ఎత్తి పట్టుకుంటూ ప్రశ్నించాడా ఏజెంట్.

మెడ మీది బాధకు తల మీద పడిన దెబ్బలు కూడా తోడయ్యేసరికి బైర్లు కమ్మాయి షాడో కనులు.

"తెలియదు సార్... నిజంగా చెపుతున్నాను... అసలా పేరు కూడా నేను వినలేదు" అప్పటికీ తన పద్ధతిని మార్చుకోకుండా రిపీట్ చేశాడు.

పళ్ళు పటపట కొరుకుతూ మిగిలిన వారి వైపు చూశాడు లాటీని పట్టుకున్న ఏజెంట్.

"తమ పనులు పూర్తి చేసుకోవటానికి బాంబులతో ఆటలు ఆడి ప్రాణాలు తీసే ఈ దుర్మార్గులకు మెత్తటి మాటలు తలకు ఎక్కవు... గట్టిగా చెప్పాల్సిందే..." కనుబొమ్మలు ముడివేస్తూ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు ఒకతను.

రోడ్డు ప్రక్క పాడు బడిన బంగ్లాలోని ఇన్సిడెంట్ ని దృష్టిలో వుంచుకొని అలా మాట్లాడుతున్నా రని గ్రహించేసరికి ఝల్లు మన్న ది షాడో శరీరం.

బంగ్లా ముందు కాపలా వున్న ఏజెంట్స్ని ఎటాక్ చేశారు గంగారాం తను. తన ఐడెంటిటీ బయట పడటానికి స్పెషల్ బ్రాంచి ఉన్న తాధికారులే రావాల్సిన అవసరం ఉన్న ట్లు కనిపించటం లేదు. దెబ్బలు తిన్న వాళ్ళు వస్తే చాలు... అంతవరకే సాగాయి షాడో ఆలోచనలు.

ఉన్న ట్లుండి నాలుగు ప్రక్కల నుంచీ కమ్ము కున్నా రు అక్కడి వారందరూ. వడగళ్ళ వర్షం కురిసినట్లు అతని శరీరం మీద పడసాగాయి లాఠీ దెబ్బలు. లాగి లాగి తన్నా రు ఇద్దరు ఏజెంట్లు తమ బూటు కాళ్ళతో... ప్రక్కటెముకలు పటపటమని పైకే శబ్దాలు చేస్తున్నా లక్ష్య పెట్టకుండా ఫుట్ బాల్ ఆడేశారు.

ఊపిరి తీసుకోవటానికి కూడా వ్యవధి లేకుండా మూడు నిముషాల పాటు కొనసాగిందా టార్చర్ కార్యక్రమం. వర్షం ఆగిపోయినట్లే సడన్గా ఆగిపోయింది.

పెదవుల వెంట, ముక్కుల వెంట నెత్తురు ధారలు వెలువడుతుండగా, నిస్త్రాణగా పడిపోయిన షాడో జుట్టు పట్టుకొని రఫ్గా లేపి కూర్చోబెట్టాడు ఒక ఏజెంట్. ఈసారి వాళ్ళు ప్రశ్ని ంచేదాకా ఆగలేదు షాడో.

"నాకేం తెలియదు సార్... అమ్మ తోడు నాకేం తెలియదు..." వాచి పోయిన పెదవుల్ని అతి ప్రయత్నం మీద కదిలిస్తూ అస్పష్టంగా అన్నా డు.

"చిత్రహింసల్ని తట్టుకోవడానికి కండిషన్ చేయబడిన మనిషిలా వున్నా డితను. పొట్ట చేత్తో పట్టుకొని పని కోసం వచ్చిన వాడే అయితే ఈ పాటికి కళ్ళు తేలవేసి కాళ్లు బార్లా చాపి వుండేవాడు..." అంటూ జుట్టును వదిలి చేతుల్ని

పట్టుకున్నాడు ఆ ఏంజెంట్. ముళ్ళ కంప మాదిరి ఈడ్చుకుంటూ మేడ చుట్టూ వున్న చెట్లలోకి బయలుదేరాడు.

అతని ఉద్దేశ్యం అవగతం అయినట్లు మౌనంగా తన వెనుక అడుగులు వేస్తున్న మిగిలిన వారిని చూసి ప్రాణాల మీద ఆశను వదిలేసుకున్నాడు షాడో.

ఏదైనా చిన్న అవకాశం లభించిన మరుక్షణం వాళ్ళకి స్లిప్ యిచ్చి పిక్కబలం చూపించవచ్చనే ధైర్యంతో వున్నాడతను దెబ్బల వర్షం ప్రారంభం అయ్యేవరకూ.

ఆ తరువాత మాయమై పోయిందా ధైర్యం.. ఏమాత్రం ఎగ్రెసివ్‌నెస్ చూపించినా రివాల్వర్స్‌ని బయటికి లాగి వళ్ళు తూట్లు పడగొట్టేలా కనిపిస్తోంది వాళ్ళ వాలకం.

ఉన్నట్లుండి చల్లటి గాలి ముఖానికి తగలటంతో ఉలిక్కిపడి ముందుకు చూశాడు షాడో.

ఆరెంజి తోటకు దక్షిణ భాగంలో పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తోంది పెద్ద కొండవాగు... మంచుకంటె చల్లగా వున్న ఆ నీళ్ళ దగ్గిరికి అతన్ని నెట్టి కన్ను మూసి కన్ను తెరిచేటంతలో చేతుల్ని వెనక్కి విరిచి కట్టేశారు స్పెషల్ బ్రాంచి ఏజెంట్లు. మెడకు పొడుగాటి తాడును చుట్టి పాదాలతో బలంగా తన్నారు.

చేపలా ఎగిరి నడుములోతు నీళ్ళలో పడ్డాడు షాడో. బాలెన్స్ నిలుపుకోవటం కుదరక రెండు రెండు మునకలు వేశాడు.

మెడకు చుట్టిన తాడును పట్టుకుని బర్రున వడ్డుకు లాగారు వాళ్ళు.

"చెప్పరా... నీళ్ళలో మునిగి ప్రాణాలు పోగొట్టుకోకముందే నిజం చెప్పు..." ముఖంలో ముఖం పెట్టి అడిగాడు ఒకతను.

షాడో నోటి నుంచి ఎంత ప్రయత్నించినా రాలేదు సమాధానం... విపరీతమైన చలి మూలకంగా గజగజ వణుకుతూ తల మాత్రం అడ్డం తిప్పాడు.

రెట్టించిన పట్టుదలతో చేతుల మీద ఎత్తారతన్ని. బలం కొద్దీ విసిరారు వాగు మధ్య భాగంలోకి.

ఇసుక మూట పడినట్లు దభేలుమని శబ్దం చేస్తూ నీటిని తాకి సూటిగా లోపలికి వెళ్ళిపోయాడు షాడో.

"ఒక నిముషం ఆగుదాం... ఒక నిముషం తరువాత పైకి లాగుదాం..." తాడును చేతికి చుట్టుకొని రెడీగా నిలబడుతూ అన్నాడు ఆ ఏజెంట్.

నడుముల మీద చేతులుంచుకొని నీళ్ళ వంకే చూస్తూ నిలబడ్డారు మిగిలిన వాళ్ళు. సరిగ్గా నిముషం గడిచిన తరువాత అతనికి సైగ చేశారు.

చేపల వలను లాగినట్లు ఎంతో భారంగా లాగబోయి వెల్లికిలా పడిపోయాడు ఆ ఏజెంట్.

అతని చేతిలోని తాడు జారిపోతుందన్న భయంతో చటుక్కున వంగి దాన్ని పట్టుకున్న తర్వాత గాని తెలిసి రాలేదు వాళ్ళందరికీ.

చేప జారిపోయినట్లే జారి పోయింది ఆ తాడుకు కట్టబడిన పర్సనాలిటీ... నీటిలో మునిగిన తరువాత ఒక్కసారి కూడా పైకి రాకుండా నీటిలో వుండగానే మాయం అయింది.

* * * * *

"నువ్వేదో పెద్ద పోటుగాడివని, గొప్ప నిశాచరుడివని లైట్లు పగల గొట్టి ఆ దరిద్రపు మేడలోకి వెళ్ళే వీలు కల్పించాను... ఇలా అడ్డగోలుగా పట్టుబడి వళ్ళు వాయ

కొట్టించుకుంటావని మాత్రం అనుకోలేదు..." వేడి నీళ్ళలో టవల్‌ని ముంచి షాడో వంటి మీది దెబ్బలకు కాపు పెడుతూ కోపంగా అన్నాడు గంగారాం.

టవల్ తగిలిన మరుక్షణం జివ్వు మంటున్నాయి షాడో నరాలు... భరించరాని బాధ ఎగసుకు వచ్చేస్తోంది.

"నీళ్ళలో పడేదాక నాకు గుర్తుంది... ఆ తరువాత ఏం జరిగిందో చెప్పు..." బోర్లా పడుకున్న వాడు కాస్త ప్రక్కకు తిరిగి పనామా పాకెట్‌ని అందుకుంటూ అడిగాడు.

"ఏం జరుగుతుంది? సమయానికి నేను వుండబట్టి, ఆ స్పెషల్ బ్రాంచి వాళ్ళ కళ్ళ పడకుండా నీళ్ళలో దిగి నీ మెడకు కట్టిన తాడును వూడ తీయబట్టి బ్రతికి పోయావ్... లాగి పెట్టి తంతే లేచి నిలబడటం చేతకాని ఆ దొంగనాయాళ్ళు నిన్ను ఇన్ని దెబ్బలు కొట్టేదాకా అసలు ఎందుకు ఆగినట్లు?" కోపాన్ని కొంచెం కూడా తగ్గించుకోకుండా ఎదురు ప్రశ్న వేశాడు గంగారాం.

నీళ్ళల్లో నుంచి రిస్క్యూ చేసిన తరువాత నిశ్శబ్దంగా అవతలి వడ్డుకు చేర్చి సిల్సిలా పట్టణానికి తీసుకు వచ్చేశాడతను. సిటీ లిమిట్స్‌కి దగ్గరిగా వున్న ఒక చిన్న హోటల్లో మకాం పెట్టి పరిచర్యలు చేస్తున్నాడు.

ఆ మాటకు మాత్రం సమాధానం యివ్వలేదు షాడో. పనామా పొగను రింగులు రింగులుగా గాలిలోకి వదులుతూ లేచి కూర్చున్నాడు.

"తగిలిన దెబ్బలు జీర్ణమైపోయాయా? మళ్ళీ బయటికి పోయి ఇంకో నాలుగు తిని రావాలా??" అతని ముఖంలోని భావాల్ని గమనించి వెంటనే అడిగాడు గంగారాం.

చిన్నగా నవ్వి తల అడ్డం తిప్పాడు షాడో.

"చేతికి దొరికినట్లే దొరికి తప్పించుకు పోయాడు యాంగ్‌చీ... ఆ స్పెషల్ బ్రాంచి వాళ్ళు ఒక్క పది నిముషాలు ఆలస్యంగా వచ్చినట్లయితే వాడి సంగతి అటో ఇటో తేల్చేసి వుండేవాడిని..." అంటూ బెడ్ దిగి ఒక కిటికీ దగ్గరికి పోయి నిలబడ్డాడు.

ఉదయం ఎనిమిది గంటలు అయింది అప్పటికి. పరుగులాంటి నడకతో ఎవరి పనుల మీద వాళ్ళు పోతూ యమబిజీగా కనిపిస్తున్నారు సిల్సిలా సిటీ పౌరులు.

"పదిమంది పోలీసు మనుష్యుల దారుణ హత్య... చదవండి బాబూ చదవండి... ఆరంజి తోట దగ్గర అఘాయిత్యం..." హోటల్‌కి వంద అడుగుల దూరంలో వున్న కార్నర్ దగ్గర నిలబడి పెద్ద గొంతుకతో బిజీగా తిరుగుతున్న ఆ పౌరుల్ని ఆకర్షించటానికి ప్రయత్నిస్తున్నాడు ఒక పేపర్ బాయ్.

"కమాన్ గంగూ... ఐవాన్ట్ దట్ పేపర్... అర్జంటుగా ఒకటి తెప్పించు..." అనుమానంగా నొసలు విరుస్తూ వెనక్కి తిరిగి గంగారాంతో అన్నాడు షాడో.

గది బయటికి పోయాడు గంగారాం. పది నిముషాల్లో పేపర్‌తో తిరిగి వచ్చాడు.

ఫ్రంట్ పేజీలోనే పెద్ద పెద్ద అక్షరాలతో ప్రింట్ చేయబడి వుందా వార్త.

బాంబులు పెట్టి మనుష్యుల్ని ఖతం చేయటంలో మొనగాడయిన ఒక నేరస్థుడి కోసం ఆరంజి తోట దగ్గిరి కొండవాగు దగ్గిర తిరుగుతూ వుండగా హతమారి పోయారట పదిమంది పోలీస్ సిబ్బంది... పరిశోధన జరుపబడుతోందిట!

జరిగింది ఏమిటో అవగతమయ్యే సరికి ఛలిగాలి వీచినట్లు జలదరించింది షాడో శరీరం.

తన కోసమే... తనను నీళ్ళల్లో వుండగా గంగారాం రక్షించిన సంగతి తెలుసుకోలేక వాగు వద్దునే సెర్చి ప్రారంభించి వుంటారు స్పెషల్ బ్రాంచి ఏజెంట్లు. వాళ్ళు ఖతమ్ అయిపోయారంటే తన చేతిలో నుంచి జారిపోయిన యాంగ్‌చీ ఆ కొండవాగు దగ్గరే ఎక్కడో దాగుకొని వున్నట్లే లెక్క...

అయాచితంగా లభించిన ఆ ఆధారాన్ని యింకోసారి చేజార్చుకోదలచలేదు షాడో.

హోటల్ బాయ్‌ని పిలిపించి బ్రేక్‌ఫాస్ట్‌కి ఆర్డర్ యిచ్చాడు... గంగారాంని పంపించి మరో జత రెడీమేడ్ దుస్తుల్ని తెప్పించుకొని, స్పెషల్ బ్రాంచి ఏజెంట్ల దెబ్బలకు చినిగిపోయిన బట్టల్ని వదిలేశాడు. పనులన్నీ పూర్తి చేసుకొని పగలు పన్నెండు గంటల కల్లా కొండవాగు వద్దున ప్రత్యక్షం అయ్యాడు.

* * * * *

"రాకూడదు... ఇటు కేసి ఎవరూ రాకూడదు..." వెంటనే వారిని అడ్డుకున్నాడు వాగు వద్దున సెంట్రీ డ్యూటీ చేస్తున్న సిల్సిలా సిటీ పోలీస్ కానిస్టేబుల్ ఒకతను.

చనిపోయిన వారి శరీరాల్ని మార్చురీకి తరలించటం జరిగిపోయిందప్పటికి. చంపింది ఎవరో తెలుసుకోవటానికి పోలీస్ డాగ్స్ రప్పించబడ్డాయట...

"మీ పరిశోధనలకు మేము అడ్డురాము భాయీ సాబ్... ఊరికే ఒక్కసారి అలా వెళ్ళి వస్తాం... అంతే..." అనునయంగా ఆ కానిస్టేబిల్‌తో అన్నాడు గంగారాం.

రెండు క్షణాలు ఆలోచించి మనసు మార్చుకున్నాడతను.

"మా పోలీస్ కుక్కలు పొడిచేసింది కూడా ఏమీ లేదులే... వాగు వడ్డున రెండు రౌండ్లు కొట్టి వెనక్కి వచ్చేశాయి. ఢిల్లీ నుంచి పెద్దాఫీసర్లు ఎవరో వస్తారని నన్ను యిక్కడ నిలబెట్టారు... తొందరగా వెళ్ళి తొందరగా వచ్చేయండి..." అంటూ అటు వెళ్ళటానికి పర్మిషన్ యిచ్చాడు.

స్పెషల్ బ్రాంచి ఏజెంట్లు తనని నీళ్ళల్లో పడేసిన ప్రదేశం దగ్గర్నుంచి అడుగులో అడుగువేస్తూ ముందుకు కదిలాడు షాడో.

వాగు అంచునేవున్న బురదలో కొట్టు వచ్చినట్లు కనిపిస్తున్నాయి వాళ్ళ అడుగు జాడలు. పట్టిన పట్టు వదలకుండా రెండు ఫర్లాంగుల దూరం వెళ్ళారు వాళ్ళు... ఉన్నట్లుండి ఆగిపోయారు ఒక ప్రదేశంలో.

తను కూడా అక్కడే నిలబడి పనామా వెలిగించుకుంటూ ఉరుకులు పరుగులు పెడుతున్న వాగు వంక పరిశీలనగా చూశాడు షాడో.

స్పెషల్ బ్రాంచి ఏజెంట్ల మీద ప్రత్యేకమైన కక్ష ఏమీ లేదు యాంగ్‌చీకి. అయినా సరే అతను వాళ్ళను ఎటాక్ చేశాడంటే అందుకు బలమైన కారణం వుండే వుంటుంది.

ఎగుడు దిగుడుగా వున్న కొండరాళ్ళతో నిండి వుంది వాగు అవతలి ఒడ్డు... ఏటవాలుగా లేచి వంద అడుగుల ఎత్తుగల కొండ మాదిరిగా కనిపిస్తోంది ఒక ప్రదేశం...

"కమాన్ గంగూ... అక్కడికి పోయి చూద్దాం" అంటూ సిగరెట్‌ని అవతలికి విసిరి, నీళ్ళలో దిగాడు షాడో. కదలమని మొరాయిస్తున్న అవయవాల్ని అతి ప్రయత్నం మీద కదిలిస్తూ ఆ కొండగుట్ట సమీపంలోకి చేరుకున్నాడు.

నడుము లోతు నీళ్ళల్లో నిలబడి చుట్టూ చూస్తున్న అతన్ని నిరుత్సాహ పరిచాడు గంగారాం అరగంట తరువాత.

"ఈ నీళ్ళల్లో ఇలాగే ఇంకో పది నిముషాలు నిలబడితే నిమోనియా వచ్చి చచ్చిపోతాం. ఇక్కడ మనకి కావల్సింది ఏమీ లేదు గాని ఇక పద..." అంటూ వెను తిరిగి ఇవతలి వడ్డు వైపు బయలుదేరబోతుండగా అతని పాదాలకు తగిలిందొక పొడుగాటి గుడ్డపీలిక.

నీళ్ళల్లో వున్న కొండరాయి నొకదాన్ని చుట్టుకొని వున్నదది.

"విచిత్రంగా వుంది... ఎక్కడి నుంచి వచ్చి వుంటుందది? నీటి వాలున పైనుంచి కొట్టుకు వచ్చిందా??" నీటిలోకి వంగి దాన్ని బయటికి తీస్తూ కామెంట్ చేశాడతను.

అతనితో పాటు ముందుకు వంగాడు షాడో ఆ గుడ్డ పీలికను చూడటానికి. తల నీటి మట్టాన్ని సమీపిస్తుండగా కనిపించింది అతనికి ఆ ఎంట్రన్స్.

## 11

నీటి మట్టానికి రెండు అడుగుల ఎత్తులో నేర్పుగా తొలచబడింది ఆ కొండగుహ. దగ్గిర్నించి చూస్తే తప్ప కనిపించని విధంగా అరెంజ్ చేయబడి వుంది.

స్పెషల్ బ్రాంచి ఏజెంట్లు ఎందుకు హతమారిపోయారో కొట్టవచ్చినట్లు అర్థమై, రెండు అంగల్లో ఆ ప్రదేశాన్ని సమీపించి లోపలికి పాకాడు షాడో.

తమ మాదిరిగానే యాదృచ్ఛికంగా ఆ గుహను చూసి వుంటారు వాళ్ళు... లోపలికి పోయేందుకు ప్రయత్నించే సరికి ఎటాక్ ప్రారంభమై వుంటుంది.

"ఇప్పుడు మనం మాత్రం సురక్షితంగా వుంటామా ? మనల్ని మాత్రం ప్రాణాలతో వదిలి పెడతారా ?" అతని ఆలోచనల్ని గమనించి లోగొంతుకతో అన్నాడు గంగారాం క్లోజ్‌గా ఫాలో అవుతూ.

పాతిక అడుగుల దూరం పోయిన తర్వాత సడన్‌గా విశాలమైంది ఆ గుహ... నీటిని వదిలి పైకి పోవటానికి వీలుగా చెక్కల మెట్లు కనిపించాయి.

వాటి మీదుగా పైకి లేచిన వారిద్దరి ముందు ప్రత్యక్షం అయ్యారు రైఫిల్స్ పట్టుకున్న ఇద్దరు దృఢకాయులు.

"వెల్‌కమ్ మిస్టర్ షాడో... పట్టిన పట్టు వదలకుండా నా వెన్నంటి వచ్చిన నీ పట్టుదలకు నా జోహార్లు..." ఆ దృఢకాయుల వెనుకగా ప్రత్యక్షం అవుతూ స్వాగతం పలికాడు యాంగ్‌చీ.

* * * * *

"... స్వసుఖాలు చూసుకోకుండా పరిశోధనలే నా సర్వస్వమని అనుకొని లేబరేటరీకి నా జీవితాన్ని అంకితం చేశాను... ఏమిచ్చింది నాకు ఈ దేశం? నేను చేసిన పరిశోధనల వంటి పరిశోధనలు చేస్తున్న ఇతర దేశీయులు ఎన్ని గౌరవాలు పొందుతున్నారో, ఎన్ని సుఖాల్ని అనుభవిస్తున్నారో నీకు తెలుసా? వారిని ప్రజలు, ప్రభుత్వాలు ఎంతగా అభిమానిస్తున్నాయో ఎప్పుడైనా చూశావా ??" ఆవేశంగా అన్నాడు సైంటిస్ట్ మహేంద్రనాథ్.

నీటి ఒడ్డుకు వంద గజాల దూరంలో తొలచబడి వున్న మరో పెద్ద హాలు వంటి గుహలో వున్నాడతను.

నిశ్శబ్దంగా పనిచేసే జనరేటర్ సహాయంతో ఆ ప్రదేశాన్నంతా పట్టపగలు మాదిరిగా తయారుచేశాడు యాంగ్‌చీ... అతనికి కావల్సిన పరిశోధనా సామగ్రిని ఏర్పాటు చేశాడు.

నల్లటి ప్లాస్టిక్ కాన్స్‌లో నిలువచేసి దొంతర్లు దొంతర్లుగా పేర్చబడి వుంది మహేంద్రనాథ్ కనిపెట్టిన నెర్వ్‌గాస్... ప్లాస్టిక్ కాన్స్‌లో నుంచి బయటికి వదిలిన మరుక్షణం తన దారుణ మారణకాండను ప్రారంభించటానికి రెడీగా కనిపిస్తోంది.

"నీకు కావల్సినవి గౌరవ మర్యాదలే అనుకుంటే ఇలా దేశద్రోహులతో, మన పగవారితో చేతులు కలపాల్సిన అవసరం ఏముంది ? నీ పరిశోధనల సారాంశం బయటికి వచ్చిన మరుక్షణం ప్రజలు నీకు బ్రహ్మరథం పట్టరని ఎందుకు అనుకున్నావ్?" అడిగాడు షాడో అతన్ని.

విచిత్రంగా నవ్వి తన కోటు జేబులోనే దాచుకున్న ఒక కవర్‌ని తీసి అతనికి అందించాడు మహేంద్రనాథ్.

అందులోని కాగితాన్ని తీసి చూశాడు షాడో.

నాడీ వ్యవస్థ మీది పరిశోధనల్ని కావాలనే ప్రక్కదారి పట్టించి, మారణాయుధం క్రింద పనికి వచ్చే నెర్వ్‌గాస్‌ని తయారు చేసినందుకు అతన్ని తీవ్రమైన పదజాలంతో నిందించింది స్పెషల్ బ్రాంచి... ఆ పరిశోధనా పత్రాల్ని వెంటనే నాశనం చేయకపోతే అరస్ట్ చేసి సెక్యూరిటీ సెల్‌లో బంధించవలసి వస్తుందని హెచ్చరించింది.

తన పరిశోధనల వివరాల్ని ప్రధాన మంత్రికి, డిఫెన్స్ డిపార్ట్‌మెంట్‌కి తెలియ చేద్దామన్న ఆత్రుతతో నెలరోజుల క్రితమే వారిని కంటాక్ట్ చేశాడు మహేంద్రనాథ్...

మెచ్చుకోలు లభిస్తుందన్న ఆశతో వున్న అతన్ని నిరాశపరచటమే కాక బెదిరింపులు కూడా స్పెషల్ బ్రాంచి ప్రారంభించేసరికి, మనస్సు కష్టపెట్టుకున్నాడతను. ఆ ఆవేశంలో యాంగ్ చీ ఎత్తుగడలకు లొంగిపోయాడు.

"అహర్నిశలూ శ్రమించి పరిశోధనలు చేసేవారిని గౌరవించలేని ఈ దేశం మీద నాకు గౌరవం నశించింది... నన్ను అభిమానించే వారితో కో-ఆపరేట్ చేయటంలో ఎటువంటి తప్పూ లేదనే అనుకుంటున్నాను...." లెటర్ చదివిన షాడోతో అన్నాడు మహేంద్రనాథ్.

ముందు వెనుకలు ఆలోచించుకోకుండా, సున్నితంగా చెప్పవలసిన మాటల్ని దురుసుగా చెప్పి ఆ అనర్థానికి మూలకారకులైన స్పెషల్ బ్రాంచిని తలచుకొని నిస్సహాయంగా పళ్ళు కొరుక్కున్నాడు షాడో.

సరిచేయలేని డామేజి జరిగిపోయింది... ఎదురు దెబ్బతిన్న ఆవేశంలో యాంగ్ చీ ఎటువంటివాడో అర్థం చేసుకోలేక పోతున్నాడు అతను.

పరిశోధనల సారాంశం పూర్తిగా తన చేతికి చిక్కిన మరుక్షణం అతన్ని పైకి పంపించేస్తాడా దుర్మార్గుడు... ఆ కాగితాలతో తన దేశానికి వెళ్ళిపోతాడు.

తన మాతృభూమి మీది కోపంతో ప్రపంచానికంతటికీ చేటు తెచ్చి పెట్టబోతున్నట్లు ఎలా ఎక్స్‌ప్లెయిన్ చేయాలి అతనికి?

వెనుకగా నిలబడి వున్న యాంగ్ చీని క్రీగంట చూస్తూ సరయిన మాటల కోసం వెతుక్కుంటున్న షాడో కంటె రెండు అడుగుల ముందే వున్నాడు గంగారాం.

"మీ పద్ధతిని కాదనే సాహసం మాకు లేదు మహేంద్రనాథ్ సాబ్... గౌరవం లేనిచోట తలవంచుకొని జీవించమని బుద్ధి వున్న మనిషెవడూ మీకు చెప్పడు... అయితే నాకు ఒక చిన్న సందేహం వచ్చింది..." అన్నాడు.

"ఏమిటది?" తన పద్ధతిని అతను మెచ్చుకున్నందుకు సంతోషిస్తూ అడిగాడు మహేంద్రనాథ్.

"మిమ్మల్ని అభిమానించి ఎంతో దూరం నుంచి వచ్చిన ఈ యాంగ్‌చీ మిమ్మల్ని అభిమానించటంతో ఆగకుండా మీ అమ్మాయి వాసవిని కూడా ఎందుకు తీసుకు వచ్చినట్లు? గౌరవించటానికేనా??"

"వ్వాట్!" అప్రయత్నంగా అరిచాడు మహేంద్రనాథ్.

"మా అమ్మాయి... వాసవిని... వాసవిని యాంగ్‌చీ తీసుకొచ్చాడా? ఎప్పుడు?"

ఆ మాటలకు గంగారాం సమాధానం యివ్వక ముందే కల్పించుకున్నాడు యాంగ్‌చీ...

"నమ్మకండి... వీళ్ళ మాటల్ని నమ్మకండి... మిమ్మల్ని మోసం చేయటానికి ప్రయత్నిస్తున్నారు వీళ్ళు..." అంటూ.

షాడో జేబుల్లో చేతులు పెట్టి నీళ్ళతో తడిసిపోయిన వాసవి ఫోటోల్ని మహేంద్రనాథ్ మీదికి విసిరేశాడు గంగారాం.

"మోసం చేయవలసిన అవసరం లేదు. మేము యిక్కడే వుంటాం. మీరు మిడ్నపూర్ వెళ్ళి మీ అమ్మాయిని చూసి రండి... ఆమె కాలేజీకి వెళుతున్నదో లేదో

మీ అంతట మీరే చూసి రండి..." అంటుండగా ఒక్కసారిగా అతన్ని సమీపించి గుండెల మీద బలంగా గుద్దాడు యాంగ్ చీ.

"తీసుకు వెళ్ళండి... వీళ్ళిద్దర్నీ తీసుకుపోయి ఖతమ్ చేసేయండి..." అని ఆజ్ఞ యిచ్చాడు తన అనుచరులకు.

షాడో, గంగారాంల చేతులు వెనక్కి విరిచి పట్టుకోబోతున్న దృఢకాయుల్ని చూస్తూ తల అడ్డం తిప్పాడు మహేంద్రనాథ్.

"వాళ్ళని ఏం చేయకండి... మనం మిడ్నపూర్ వెళ్ళి వచ్చేదాకా బంధించి వుంచండి... వాళ్ళ మాటలు అసత్యాలు అని తేలిన మరుక్షణం నా నెర్వ్‌గాస్‌ని ప్రయోగించి నేనే నాశనం చేస్తాను..." అన్నాడు.

"మీకు తెలియదు సార్... వీళ్ళు అత్యంత ప్రమాదకరమైన వ్యక్తులు. వీళ్ళని సఫా చేసి మనం మిడ్నపూర్ వెళదాం..." అన్నాడు యాంగ్ చీ.

"నో నథింగ్ డూయింగ్... డూ వాట్ ఐసే" ఖంగుమంది సైంటిస్ట్ కంఠం.

ఒక్కసారిగా కర్కశ రూపాన్ని సంతరించుకుంది యాంగ్ చీ వదనం.

"మీకు సంబంధించని విషయాల్లో జోక్యం చేసుకోకండి మహేంద్రనాథ్... మీ పరిశోధనల్ని తప్ప ఇతర విషయాల్ని పట్టించుకోకండి..." కరుకుగా అంటూ తన అనుచరులకు సైగ చేసి అక్కడి నుంచి బయలుదేరాడు.

రైఫిల్స్‌ని షాడో వెన్నుకు ఆనించి ముందుకు తోశారు వాళ్ళు. గంగారాం నడుము మీద బూటు కాలిని ఆనించి బలంగా నెట్టారు.

బాలెన్స్ తప్పి బోర్లా పడిపోయాడు గంగారాం. పడుతూ పడుతూ పొరపాటున తన కంటె ముందు పోతున్న యాంగ్‌చీ పాదాన్ని పట్టుకొని ప్రక్కకు లాగాడు.

"మైగాడ్! వాటీజ్ దిస్!!" ఆశ్చర్యంగా అంటూ ప్రక్కకు తూలాడతను.

ఆ కాస్త డైవర్షన్ని నేర్పుగా ఉపయోగించుకున్నాడు షాడో. చటుక్కున ముందుకు వంగి గిర్రున ఒక రౌండ్ కొట్టాడు. రౌండ్ పూర్తి అవుతుండగా పైకి లేచింది అతని కుడిపాదం.

బాధగా అరుస్తూ వెల్లికిలా పడిపోయాడు ఒక దృఢకాయుడు... రైఫిల్ని గురి పెట్టటానికి ప్రయత్నిస్తుండగానే మోకాళ్ళు మడతపడి నేలమీద చతికిల పడ్డాడు రెండో వ్యక్తి.

అతని చేతిలో నుంచి జారిపోతున్న రైఫిల్ని అందుకొని వెనక్కి దూకాడు షాడో. ప్రక్కకు దొర్లిన యాంగ్‌చీ పని పట్టటమే అతని ఆశయం.

అతని మాదిరిగానే అతి వేగంగా కదిలాడు యాంగ్‌చీ... పడిన వెంటనే పైకి లేచి కుడివైపున వున్న ఇంకో గుహలోకి పరిగెత్తాడు.

"కమాన్ యాంగ్‌చీ... కమ్ అవుట్..." అని కమాండ్ చేస్తూ అటుకేసి అడుగులు వేయబోయి హఠాత్తుగా ఆగిపోయాడు షాడో.

"రైఫిల్ని వదిలేయ్ మిస్టర్ షాడో... పిచ్చి వేషాలు వేస్తే ఖతమ్ అయిపోతుంది ఈ పిల్ల..." అంటూ అతని ఎదుట ప్రత్యక్షం అయ్యాడు యాంగ్‌చీ.

అతని చేతుల్ని విడిపించుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ కనిపించింది మహేంద్రనాథ్ కుమార్తె వాసవి.

* * * * *

"వీళ్ళ మాటలు యధార్ధమేనన్న మాట! నా మనసు ఎప్పుడయినా మారిపోతుందేమోననే భయంతో నా కుమార్తెను కూడా తీసుకువచ్చి బంధించి వుంచారన్న మాట!!" తన కనుల్ని తనే నమ్మలేనట్లు చూస్తూ అన్నాడు మహేంద్రనాథ్.

"యస్ మై ఫ్రండ్... ఇప్పుడు అర్ధం అయింది కదా... నీ కుమార్తె ప్రాణాలు దక్కాలంటే నీ పరిశోధనను కంప్లీట్ చేసి ఆ కాగితాల్ని నాకు అప్ప చెప్పు..." వికృతంగా అన్నాడు యాంగ్‌చీ.

చేతిలో వున్న రైఫిల్ని క్రిందికి దించి కను చివరల నుంచి మహేంద్రనాథ్ వైపు చూశాడు షాడో.

ఎర్రబడి పోయిందతని వదనం... విపరీతమైన ఆగ్రహంతో వణికిపోతున్నాడతను.

"కమాన్ మిస్టర్ షాడో... కమాన్..." ఒక పిస్టల్‌ని వాసవి వెనుక నుంచి వూపుతూ షాడోని హెచ్చరించాడు యాంగ్‌చీ.

ఓటమిని అంగీకరించిన వాడిలా తలవంచుకొని నీటి అంచు దగ్గిరికి బయలుదేరాడు షాడో.

నాలుగు అడుగులు వేసినట్లే వేసి "గంగూ!" అని పిలిచాడు ఆ గుహ ప్రతిధ్వనించేటట్లు.

నేలమీది నుంచి లేచి ఎగిరి వెనక్కి దూకాడు గంగారాం.

ఆ కదలికకు డైవర్ట్ అయింది యాంగ్‌చీ అంటెంషన్. షాడో మీది నుంచి అతనికేసి మరలాయి అతని కనులు.

వెంటనే పైకి లేచింది షాడో చేతిలోని రైఫిల్... గుహలన్నీ దద్దరిల్లిపోయేటట్లు నిప్పులు కక్కింది.

వాసవి మెడకు అరంగుళం దూరంలో నుంచి పోయి యాంగ్‌చీ చేతికి తగిలింది బుల్లెట్.

బాధగా అరిచి వెనక్కి తూలిన అతని గుండెల్లో దిగబడ్డాయి మిగిలినవి.

ఏమాత్రం ప్రాణం వున్నా అతను పగ తీర్చుకునే ప్రయత్నం చేస్తాడేమోననే భయంతో రైఫిల్‌ని రెడీగా పట్టుకొని అటు కదలబోయిన షాడో భుజాల్ని పట్టుకొని నీటికేసి నెట్టాడు గంగారాం.

"కొంపలు అంటుకున్నాయి గురో... ఏమాత్రం ఆలస్యం చేసినా మనం పిచ్చివాళ్ళం అయిపోతాం..." అని హెచ్చరించాడు.

తన్ను మోసం చేశారన్న కసితో ఏం చేస్తున్నాడో తనకే తెలియని ఆవేశంతో దొంతర్లు దొంతర్లుగా పేర్చి వున్న నెర్వ్‌గాస్ ప్లాస్టిక్ కాన్స్‌ని నేలకేసి బాది, పగలగొడుతున్నాడు మహేంద్రనాథ్.

తెల్లగా సుడులు తిరుగుతూ పైకి లేస్తోంది గాస్...

అతనున్న గుహను ఆక్రమించుకొని మెల్లిగా యివతలకు వస్తోంది.

"డాడీ... డాడీ..." అని ఆక్రోశిస్తూ అటు పరిగెత్తబోయిన వాసవి చేయి పట్టుకొని బలవంతంగా నీటిలోకి నెట్టాడు షాడో. కన్ను మూసి కన్ను తెరిచేటంతలో ఎంట్రన్స్‌ని దాటి వాగులోకి వచ్చేశాడు.

"వచ్చేస్తోంది... గాస్ బయటికి వచ్చేస్తోంది..." అతని వెనుకే బయటికి వస్తూ వాపోయాడు గంగారాం.

లోపలే వుండి పోయిన మహేంద్రనాథ్‌ని తలుచుకొని గాఢంగా నిట్టూరుస్తూ కుడికాలికి అలాగే వున్న బూట్ సోల్‌ని ప్రక్కకు తిప్పాడు షాడో.

సోల్ క్రింది డొల్లలో వున్న లిటిల్ టామీని బయటికి తీసి ఎంట్రన్స్‌లోకి విసిరేశాడు.

రింగులు తిరుగుతూ పొగమంచు మాదిరిగా అప్పుడే బయటికి తొంగి చూసింది నెర్వ్ గాస్.

అది మరింతగా బయటికి రాకముందే చెవులు చిల్లులు పడే శబ్దంతో బ్రద్దలైంది లిటిల్ టామీ.

కనులు మిరుమిట్లు గొలిపే కాంతుల్ని వెలువరుస్తూ ఎంట్రన్స్ దగ్గర వున్న కొండరాళ్ళను పగలగొట్టి మార్గాన్ని పూర్తిగా మూసేసింది.

ఆ అదటుకు నాలుగు అడుగుల ఎత్తుకు గాలిలోకి లేచి వాగు మధ్యలో పడ్డారు వాళ్ళు... రెండు మునకలు వేసి ఆదరా బాదరాగా అవతలి ఒడ్డును చేరుకున్నారు.

లిటిల్ టామీ చేసిన శబ్దం దూరంలో నిలబడిన కానిస్టేబిల్‌కి వినిపించింది కాబోలు పరుగు పరుగున వస్తున్నాడతను.

"డాడీ... డాడీ..." అని ఆక్రందిస్తున్న వాసవి మెడ మీద బలంగా కొట్టి స్పృహ తప్పించాడు షాడో.

"ఐయామ్ సారీ మై ఫ్రండ్... ఆవేశంతో నువ్వు చేసిన పని నీ మతిని పోగొట్టే వుంటుంది... బయటికి వచ్చిన నీ నెర్వ్‌గాస్ మరికొంతమంది అమాయకుల్ని పొట్టన పెట్టుకోకుండా వుండాలని ఎంట్రన్స్‌ని సీల్ చేశాను... నన్ను క్షమించు..." గుహ లోపల వుండి పోయిన మహేంద్రనాథ్‌ని ఉద్దేశించి అనుకుంటూ, వాసవిని నేలమీద పడుకోబెట్టి గంగారాంకి సైగ చేశాడు.

పరిగెత్తుకు వస్తున్న పోలీస్ కానిస్టేబిల్ ఆమెను చూచి తన పై అధికారులకు రిపోర్ట్ చేస్తాడు.

గుహలో వుండి తమ సంభాషణంతా వినే వుంటుంది వాసవి.

స్పెషల్ బ్రాంచి మహేంద్రనాథ్‌ని నిరుత్సాహపరిచే విధంగా వ్రాసిన లెటర్ గురించి అందరికీ చెపుతుంది.


భవిష్యత్తులోనైనా అటువంటి దుందుడుకు పనుల్ని చేసి సున్నితంగా హేండిల్ చేయవలసిన మహేంద్రనాథ్ వంటి మేధాశక్తి సంపన్నుల్ని అవమానించకుండా జాగ్రత్త పడతారు వాళ్ళు...

చెప్పిన పనిని చెప్పినట్లు చేయకుండా సాగలాగి, ప్రాణాల మీదికి తెచ్చుకున్నందుకు, వద్దన్న కొద్దీ వినకుండా స్పెషల్ బ్రాంచితో తలపడినందుకు కులకర్ణిగారి చేతిలో తినవల్సిన చివాట్లను గురించి ఆలోచిస్తూ వాగు వడ్డును పట్టుకొని పరుగులు తీశాడు షాడో...

కానిస్టేబిల్ వాసవిని సమీపించే సరికి దృష్టి పథం నుండి దూరమైపోయాడు గంగారాంతో కలిసి.

-: అయిపోయింది :-

# NIGHT WALKER



MADHU
BAABU